ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM కరీంనగర్ : fb.com/vaartha Digital


Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 142 పేజీలు: 8+16 వెల: 6.50



ఖమేనీ వారసులుగా ముగ్గురు మత పెద్దలు! 5

14 కోట్లు దాటిన బిజెపి సభ్యత్వాలు

## అమెరికా మెరుపు దాడితో ఇరాన్

# ఉక్కిరిబిక్కిరి

- 3 కీలక అణుశుద్ధి స్థావరాలు ధ్వంసం
- నతాంజ్, పోర్డో స్థావరాలు భస్మీపటలం
- ఇజ్రాయెల్‌కు మద్దతుగా దూసుకొచ్చిన 125 అమెరికా యుద్ధ విమానాలు
- 14 బంకర్ బస్టర్ బాంబులతో దాడి
- రహస్య బంకర్‌లో దాగిన మతపెద్ద ఖమేనీ
- ఇరాన్ ప్రతిచర్యకు దిగితే అంతుచూస్తామని ట్రంప్ హెచ్చరిక
- అమెరికా దాడులను ఖండించిన చైనా
- యుఎన్‌కు ఫిర్యాదు చేసిన ఇరాక్
- రణరంగంలా మారిన పశ్చిమాసియా

**వాషింగ్టన్,జూన్ 22:** పశ్చిమాసియా మొత్తం యుద్ధ మోడుతోంది. మధ్యప్రాచ్యంలోని ఉద్రిక్తతలు పశ్చిమాసియాలోని రెండుదేశాలమధ్య చావోరేవో అన్నట్లుగా మారిపోయాయి. ఇప్పటివరకూ అమెరికాకు వ్యతిరేకంగా నిలిచిన ఇరాన్ దేశం ఇపుడు ఏకాకిగా పోరాటం చేస్తోంది. అణు ఒప్పందంచేసుకోవాలని లేనిపక్షంలో అణు స్థావరాలన్నింటినీ ధ్వంసంచేస్తామన్న హెచ్చరికల నేపథ్యంలో గత పదిరోజులనుంచి ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు తోడు ఇపుడు అమెరికాచేసిన ఆకస్మిక మెరుపుదాడులు ఇరాన్‌లోని కీలక అణుస్థావరాలను ధ్వంసంచేసాయనే చెప్పాలి. జరుగుతున్న పరిణామాలను ముందే పసిగట్టిన ఇరాన్ మతపెద్ద అయతొల్లా ఖమైనీ తన నివాసాన్ని మార్చివేసి రహస్య స్థావరంలోకి వెళ్లిపోయారు. ఖమైనీని అంతం >>2



### చమురు రవాణాకు కీలకం హార్ముజ్ జలసంధి

#### మూసివేతకు ఇరాన్ పార్లమెంట్ ఓకే!

**టెహ్రాన్,జూన్ 22:** పశ్చిమాసియా దేశం ఇరాన్‌పై అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్‌లు ఏకబిగిన దాడులుచేసి అణుస్థావరాలను ధ్వంసం చేస్తుండగా ఇరాన్‌కూడా తక్కువేమీ తినలేదు. దాడులకు ధీటుగా స్పందిస్తూనే ప్రపంచ చమురు జలరవాణాకు కీలకమైన హార్మ్యూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు >>2



### నేటి కేబినెట్ భేటీలో బనకచర్ల వేడి!

#### సిఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం

#### స్థానిక సంస్థల ఎన్నికలపైనా చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలంయలో మంత్రివర్గ సమావేశం జరుగనున్నది. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుపై సమావేశంలో ప్రధాన చర్చ జరగనున్నట్లు సమాచారం. ఈ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని బట్టి తెలంగాణ సర్కార్ ఏపీని చర్చలకు ఆహ్వానించనుంది. తెలంగాణ నీటి వాటా తేలకుండా బనకచర్లను ఒప్పుకునేది లేదని, చర్చల ద్వారానే సామరస్యంగా పరిష్కరించుకోవాల్సి ఉంటుందని ఈ విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై కేబినెట్‌లో ప్రత్యేకంగా చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు, జిల్లా మండల పరిషత్ ఎన్నికల్లో వేటికి ముందుగా నిర్ణయించాలనే అంశంపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ సమావేశంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ స్థాయిలో జరిగే ఎన్నికల షెడ్యూల్‌పై ప్రాథమిక చర్చ జరిగే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్లు, ముందస్తు సన్నాహాలపై దృష్టి సారించనున్నారు. తద్వారా స్థానిక సంస్థల పాలనను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ యోచిస్తున్నట్లు తెలిసింది. రాజీవ్ యువ వికాసం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఇతర సంక్షేమాల కోసం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు >>2



### గోదావరి వివాదాలపై కొత్త ట్రిబ్యునల్!

#### మిగులు, వరద జలాల తగాదాలకు పరిష్కారమార్గం

#### కొత్త ప్రాజెక్టులకు సమస్యలు రాకుండా ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** గోదావరి నదీ జలాల వివాదాలపై కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యునల్ వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి జలాల పరివాహాక ప్రాంతాల పరిధిలోని రాష్ట్రాల మధ్య జలాల వినియోగ వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర జలమంత్రిత్వ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సంబంధిత అధికారులతో చర్చించారు. మహారాష్ట్ర ,తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో గోదావరీ నదీ పరివాహక ప్రాంతం ఉంది. గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా కొత్త ప్రాజెక్ట్‌లకు సంబంధిత రాష్ట్రాలు ప్రణాళికలు వేసుకుంటున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల మధ్య జలాల వినియోగంపై వివాదాలు వస్తున్నాయి. తాజాగా గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ పోలవరం, బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌లకు ప్రతిపాదనలు చేసింది. అయితే ఈ విషయంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. మరోవైపు గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్‌లకు చత్తీస్‌ఘడ్ శ్రీకారం చుట్టింది. రాష్ట్రాల మధ్య వివాదాలు, తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతుండటం, ఫిర్యాదులు కూడా పెద్ద ఎత్తున వస్తోండటంతో ఏం చేయాలనే దానిపై కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏ రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా చూస్తామని కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ దిశలో గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని కేంద్ర జల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. గతంలో ఆయా రాష్ట్రాల మధ్య జలాల వివాదాన్ని పరిష్కరించి అవార్డ్ >>2



#### కొండా ఫ్యామిలీ వివాదం:

### ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ!

#### మీనాక్షి వద్దకు చేరిన కాంగ్రెస్ నేతల పంచాయితీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** వరంగల్ కాంగ్రెస్ నేతల పంచాయతీ... తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. ఇటీవల కొండా మురళీ చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విభేదాలు తారా స్థాయికి చేరాయి. రెండు రోజుల క్రితం వరంగల్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో సమావేశమైన నేతలంతా ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎఐసిసి ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌తో కడియంశ్రీహరి. నాయిని రాజేందర్‌రెడ్డి, గంధ్ర సత్య నారాయణ. >>2

## పన్నేతర రాబడి పెంచండి

### బడ్జెట్ నిధులు అన్ని శాఖలకు సమానంగా పంచాలి



ఆదివారం బడ్జెట్ అస్సెట్స్ సబ్‌కమిటీ సమావేశంలో డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

#### కొత్తగా రూ. 33,600 కోట్ల సంక్షేమ పథకాలు అమలు

#### బడ్జెట్ అస్సెట్స్ సబ్‌కమిటీ సమావేశంలో డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** నాన్ టాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు సీరియస్ గా దృష్టి సారించాలని ఇన్ ఫ్రా స్ట్రక్చర్ అండ్ కేపిటెల్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదివారం బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన అసెట్స్ సబ్‌కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మంత్రులు, కమిటీ సభ్యులైన ఉత్తం కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమవేశం నిర్వహించారు. నాన్ టాక్స్ రెవెన్యూ తో పాటుగా కేంద్ర నిధులను కూడా సాధించుకోవలని చెప్పారు. గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా 33,600 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన ప్రభుత్వానికి ఔటర్ రింగ్ రోడ్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయని ఆయన చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా, మరికొన్ని శాఖలకు అతి తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్‌ని అన్ని శాఖల, డిపార్ట్‌మెంట్లకు సమానంగాపంచాలి. డిపార్ట్‌మెంట్ల మధ్యఖర్చు అంతరాలను తగ్గించి, అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని అధికారులను >>2

## ఆరు రోజుల్లో రూ.7700 కోట్లు



#### రైతు భరోసా పంపిణిలో కొత్త రికార్డు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** రాష్ట్రంలోని రైతులకు వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందించటంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రికార్డు నమోదు చేసినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈసారి వేగంగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేసింది. ఈసారి జూన్ 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. తొలి ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతులకు రూ. 7770.83 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. శనివారం నాటికే రాష్ట్రంలో 9ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. గడిచిన ఏడేండ్లలో ఇంత వేగంతో రైతుల >>2

## పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లింపు

#### ఆర్ అండ్ బి శాఖ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

#### ఆర్వోబిలు ఆలస్యం కావొద్దు: మంత్రి కోమటి రెడ్డి


**హైదరాబాద్,జూన్ 22,ప్రభాత వార్త:** రాష్ట్రంలో కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లిస్తామని రోడ్లుభవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఆదివారం డా.బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారుఆర్ అండ్ బి శాఖ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి



కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు..రోడ్లు భవనాలు శాఖపై బృహత్తర బాధ్యత ఉందని దాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్ల నిర్మాణం, భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేసి వాడుకలోకి వచ్చేవాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ అధికారులకు ఈ సందర్భంగా ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న 5 జిల్లా సమీకృత కార్యాలయాలు ఆదిలాబాద్, వరంగల్, ములుగు, నారాయణపేట, కరీంనగర్ పనుల పురోగతిపై మంత్రి ఆరాతీయగా పెండింగ్ బిల్లుల అంశం అధికారులు మంత్రి దృష్టికి తీసు కొచ్చారు. వర్క్ ఫినిషింగ్ స్టేజ్ లో ఉన్న వరంగల్,ములుగు జిల్లా కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్వోబిల నిర్మాణం ఆలస్యం ఎందుకు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజామాబాద్ మాధవనగర్ ఆర్వోబి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న ఆర్వోబి లు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ హాస్పిటల్స్ పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మంచి రోడ్లు ఉంటే రవాణా సౌకర్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్లు వంతెనలు అభివృద్ధికి సూచిక అవుతుందన్నారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ లో 91లక్షల వెహికిల్ మూమెంట్ ఉందని, రూరల్ >>2

#### బూట్లు, బెల్టులు కూడా వారివే
#### రకరకాల పేర్లతో లక్షల్లో ఫీజులు
#### మధ్య, దిగువతరగతి పేరెంట్స్ లబోదిబో

## ప్రైవేటు స్కూళ్లా! వ్యాపార కేంద్రాలా?




### పుస్తకాలు, నోట్ బుక్‌లు కొంటేనే లోపలికి..

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నాయి. లక్షల్లో ఫీజులను వసూలు చేస్తూ.. చివరికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు కూడా తమ దగ్గరే కొనాలంటూ హుకుం జారీ చేస్తున్నాయి. ఎవరైనా ఇతర చోట్ల నోటుబుక్కులను కొన్నా వాటిని అనుమతించడం లేదు. ఇప్పటికే రక రకాల పేర్లతో లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పుస్తకాలు, నోట్‌బుక్కులతో వ్యాపారం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడంతో.. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ప్రతి ఏడాది ఫీజులను పెంచుతూ ప్రజలపై మోరాన్ని మోపుతున్నాయి. కొత్తవిద్యా సంవత్సరం ప్రారంభమై వారం రోజులు గడుస్తోంది. పాఠశాల విద్య స్థాయిలో ఫీజు నియంత్రణ చట్టం వస్తుందని గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి తల్లిదండ్రులకు ఈ ఏడాది కూడా భారాన్ని మోయక తప్పేలా లేదు. జూనియర్, డిగ్రీ కాలేజీలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తుండగా.. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు అవుతోంది. అయితే రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులను చెల్లించాలని పేర్కొంటూ ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు సందేశాలు పంపిస్తున్నారు. మొత్తం ఫీజులో 50 శాతం చెల్లించిన వారినే కాలేజీలు, స్కూల్స్‌కి అనుమతిస్తున్నారు. ఇక ఫీజులను సకాలంలో చెల్లించలేని >>2



ఆదివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రముఖ ఆంకాలజిస్ట్ దత్తాత్రేయుడు

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రముఖ ఆంకాలజిస్ట్ దత్తాత్రేయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** ప్రముఖ ఆంకాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, కృషిని అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధిలో ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎంకు నోరి దత్తాత్రేయుడు తెలిపారు.

## పన్నేతర రాబడి పెంచండి

>> ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులను అన్ని శాఖలు, డిపార్ట్‌మెంట్లకు సమా నంగా పంచబడాలి. అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రం అవసరా లను, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులను ఖర్చు చేయాలి. డిపార్ట్‌మెంట్ ఖర్చులను కూడా రేషనలైజేషన్ చేసుకుని ప్రయారిటీల అధారంగా ముందుకు వెళ్లాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, డిపార్ట్‌మెంట్లపై సీరియస్‌గా దృష్టి సారించాలి. అవసరాల మేరకు ఖర్చును చేయాలని సూచించాను. స్టేట్ రియలిస్టిక్‌గా, లాజికల్ గా ఖర్చులను చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. రెవెన్యూను పెంచడం, నాన్ టాక్స్ రెవెన్యూపై అధికారులంతా సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. పబ్లిక్ ఇంట్రస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా ప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పని చేయాలని అన్నారు. రేషనలైజేషన్ మేరకు పనులను పూర్తి చేయాలి. స్పిల్ ఓవర్ వర్క్స్ కూడా ప్రయారిటీల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందకు వెళుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ!

>> రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు ముఖ్యనేతలు దాదాపు గంటకు పైగా సమావేశ అయ్యారు. ఈ సందర్భంగా గడిచిన ఏడాదిగా వరంగల్‌లో జరుగుతున్నటువంటి పరిణామాలు, కొండా ఫ్యామిలీకి సంబంధించినటు వంటి అంశాలపై ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్‌కు వివరించారు. వీడియో క్లిప్పింగ్స్, మీడియా ప్రకటనలు అందించారు. ముఖ్యంగా కొండా మురళీపై వెంటనే అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఒక దశలో పార్టీకి మేం కావాలో... కొండా ఫ్యామిలీ కావాలో తేల్చుకోవాలని కూడా ఎమ్మెల్యేలు మీనాక్షితో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో ఆమె స్పందిస్తూ కొండా మురళీ వ్యాఖ్యలు తమ దృష్టికి వచ్చాయని వారికి తెలిపారు. ఈ క్రమంలో వరంగల్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలపై ప్రత్యేకంగా విచారణ కమిటీ వేయాలని ఆమె నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంలో జిల్లాలకు సంబంధం లేనటువంటి నేతలతో పారదర్శకంగా విచారణ జరిపిస్తామని నేతలకు మీనాక్షి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ముగ్గురు సభ్యులతో కమిటీ వేయనున్నారు. ఈ ముగ్గురు కమిటీ నివేదిక కీలకం కానుంది.

## ధాన్యం టెండర్ల స్కాంపై మౌనం ఎందుకు?: పెద్ది సుదర్శన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** ధాన్యం టెండర్లలో రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందని బిఆర్ఎస్ నేత, మాజీ ఎంఎల్ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ స్కాంపై అసెంబ్లీలో కెటిఆర్, హరీష్ రావు మాట్లాడినా ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై బిఆర్ఎస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిందని, అయితే విచారణ సందర్భంగా ప్రభుత్వం కౌంటర్ దాఖలుకు 16 సార్లు వాయిదా కోరడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం బిఆర్ఎస్ నేతలు వై సతీష్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని ఆధారాలతో విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. ధాన్యం టెండర్లలో కేవలం నలుగురు బిడ్డర్లు మాత్రమే పాల్గొన్నారని అన్నారు.

## పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించండి

### మంత్రి సీతక్కకు హరీష్ రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** గ్రామాల్లో కుంటుపడిన పారిశుద్ధం, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యల గురించి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా 2019లో నాటి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం వారు ఎంతో శ్రమించారు. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు మంజూరు చేయడం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారుల కృషి వల్ల తెలంగాణ గ్రామాలు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. నిధులు విడుదల లేకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎక్కడిక్కడే నిలిచిపోయింది. అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలి. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవులు నిర్వహించి, పారిశుద్ధం పెంపొందించాలి. గత మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలి. వెంటనే వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రూ.7700 కోట్లు

>> ఖాతాల్లో నిధులు జమ చేయటం ఇదే మొదటిసారి. వానాకాలం పంటలకు సంబంధించి గతంలో రైతులకు పంటలకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం గరిష్టంగా 169 రోజుల వరకు సాగదీసినట్లు పంపిణీ చేసింది. వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 2021లో 11 రోజుల వ్యవధిలో రూ.7360 కోట్లు జమ చేయటం ఇప్పటి వరకు ఉన్న రికార్డు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అంతకంటే వేగంగా 6 రోజుల్లోనే రూ.7770 కోట్లు పంపిణీ చేసింది. తొమ్మిది రోజుల్లో మొత్తం 9 వేల కోట్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేయాలని ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## సినీనటుడు విజయ్ దేవరకొండపై అట్రాసిటి కేసు నమోదు

### ట్రైబల్స్‌పై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలతో మరో ఎఫ్ఐఆర్

**హైదరాబాద్, జూన్22, ప్రభాతవార్త:** సినీ నటుడు విజయ్ దేవరకొండపై ఆదివారం రాయదుర్గం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏప్రియల్ 26న ఓ సినీ ప్రిరిలిజ్ ఈవెంట్‌లో ట్రైబల్స్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ట్రైబల్స్ న్యాయవాదుల సంఘం ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేస్తున్నట్లు ఉన్నతస్థాయి పోలీస్ అధికారులు పేర్కొన్నారు. పహాల్గామ్ దాడుల నేపథ్యంలో ఆయన 500 ఏళ్ల కింద ట్రైబల్స్ కొట్టుకున్నట్టు పాకిస్తాన్ వాళ్ళు బుద్ధి లేకుండా చేసే పనులు ఇవి అంటూ గిరిజన వర్గాలను పోల్చడంపై సంఘాలు ఘాటుగా స్పందించింది. ఈ క్రమంలోనే సంబంధిత వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. నలబై రోజుల క్రితం సంజీవరెడ్డినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు కాగా ప్రస్తుతం ఆయనపై మరో కేసు నమోదైంది. అయితే ఈ వివాదంపై విజయ్ దేవరకొండ వివరణ ఇస్తూ క్షమాపణలు చెప్పారు. షెడ్యూల్డ్ తెగల వారిని ఎంతో గౌరవిస్తూ, వారిని దేశంలో అంతర్భాగంగా భావిస్తాను. వారిని బాధపెట్టే లేదా లక్ష్యంగా చేసుకునే ఉద్దేశం తనకు ఏ మాత్రం లేదని ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌లో తెలియజేశాడు. ట్రైబ్" అనే పదం శతాబ్దాల క్రితం ప్రపంచవ్యాప్తంగా మానవ సమాజం తెగలు, కుటుంబాలుగా ఏర్పడి, తరచుగా సంఘర్షణలు పడే కాలాన్ని సూచించే ఉద్దేశంతోనే ఉపయోగించాను. నా సందేశంలో ఏదైనా భాగం అపార్థం చేసుకున్నా లేదా ఎవరినైనా బాధించి ఉన్నా, క్షమాపణలు తెలుపుతున్నానని వివరించారు.

## వారం - వర్జ్యం

తేది : 23-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
త్రయోదశి రా.10.10
కృత్తిక మ.3.16
వర్జ్యం తె.5.42-7.09
దు.ము.12.37-1.29, 2) మ.3.14-4.16
శుభసమయం : ఉ.5.30-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. విలువైన వస్తు - ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**వృషభం :** ఎంతోకాలంగా వేధిస్తున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి. పనులు పూర్తి.

**మిథునం:** భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. చర్చలలో పాల్గొంటారు.

**సింహం:** దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఆనందం కలిగిస్తుంది. ధనలాభం.

**కన్య :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**తుల :** ఎంతటివారినైనా ఆకట్టుకొని ముందుకుసాగుతారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** పట్టుదలతో ముందుకు సాగుతారు. వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** అందరిలోనూ గుర్తింపు రాగలదు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.

**మకరం:** రుణాలు తీరి ఊరటచెందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కుంభం:** కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తారు. విందు, వినోదాలు.

**మీనం :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రైవేటు స్కూళ్లా! వ్యాపార కేంద్రాలా?

>> వారు యాజమాన్యాలతో కాళ్లావేళ్లా బ్రతిమిలాడుకొని తమ పిల్లలను కాలేజీలకు పంపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు ఈ ఏడాది కూడా 2025-26 విద్యా సంవత్సరంలో కూడా ఫీజుభారం భరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఫీజుల నియంత్రణ చట్టం చేసే అవకాశం లేనట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం గట్టిగా అనుకుని చట్టం చేయాలంటే ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేవు కాబట్టి.. ఆర్డినెన్స్ తీసుకురావాలి. కానీ రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం అటువంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆనవాళ్లు కనిపించడం లేదు. కాబట్టి ఫీజుల నియంత్రణకు ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేనట్టు కనపడుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కమిటీని ఏర్పాటు చేయడం.. కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరిగింది. నివేదికపై గత బిఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ గవర్నమెంట్ కూడా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో.. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజులను ప్రతి ఏడాది పెంచుతూనే ఉన్నారు. స్కూల్ రేంజ్‌ను బట్టి ఫీజులను పెంచుతున్నారు యాజమాన్యాలు. సాధారణ ప్రైవేటు స్కూల్స్ 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచుతుంటే.. కార్పొరేట్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ స్కూల్స్ 40 శాతం నుంచి 60 శాతం వరకు పెంచుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే ఫీజులను ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పెంచేశాయి. పెరిగిన ఫీజులను చెల్లించలేక ప్రైవేటు స్కూల్స్‌లో చదువును మానలేక.. రాష్ట్రంలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్లేస్కూల్, ఎల్‌కేజీ, యూకేజీ, మొదటి తరగతి నుంచి 10వ తరతి వరకు డొనేషన్లు, అభివృద్ధి ఛార్జీలు, ఫీజులతోతోపాటు పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు, బెల్టులు కొనాలంటూ స్కూల్ యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఫీజుల భారాన్ని మోపుతున్నాయి. ఫీజుల పెంపుకు నిర్ణీత ప్రాతిపదిక అంటూ ఏదీ లేకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులను పెంచుతున్నారు. ఫీజులను పెంచడమే కాకుండా.. విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు కూడా అక్కడే కొనాలని షరతు పెడుతున్నారు. బుక్స్, నోట్‌బుక్కులు అంటే స్కూల్స్‌లో కొనుక్కోవచ్చు.. కానీ బ్యాగులు, బూట్లు, బెల్టులు కూడా అక్కడే కొనాలని చెబుతున్నారు. బయట తక్కువ ధరకు దొరికేవాటిని ఎక్కువ ధరలు పెట్టి స్కూల్‌లోనే కొనుక్కోవలసిన ఆగత్యాన్ని స్కూల్ యాజమాన్యాలు సృష్టిస్తున్నాయి. ఫీజుల విషయంలో తమ స్కూల్స్‌కి డెవలప్‌మెంట్ ఫండ్, గ్రౌండ్ ఫీజు, లైబ్రరీ ఫీజు, ఎన్విరాన్‌మెంటల్ ఫీజు, కల్చరల్ ఫీజు ఇలా పలు రకాల పేర్లతో ఫీజులను విడగొట్టి లక్షల్లో వసూలు చేస్తున్నారు.

**ఫీజుల నియంత్రణకు కమిటీ..**

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడం కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీని నియమించింది. కమిటీ తన నివేదికను రెండు సంవత్సరాల తరువాత .. 2019లో తన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అయితే కమిటీ ప్రతిపాదనలు ప్రైవేటు స్కూల్స్ యాజామాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని పేరెంట్స్ ఆరోపించారు. స్కూల్ యాజమాన్యాలు 15 శాతం కంటే ఎక్కువగా ఫీజును పెంచాలనుకుంటే ప్రభుత్వం నియమించిన జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ అనుమతులు తీసుకోవాలని.... 15 శాతం లోపు.. ఫీజులు పెంచుకోవాలనుకుంటే యాజమాన్యాలు తామే పెంచుకోవచ్చనేది కమిటీ ప్రతిపాదన. దీనిపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. కమిటీ నివేదికను సమర్పించడానికి ప్రభుత్వం కాలపరిమితిని రెండు, మూడుసార్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కాలపరిమితి పెంచిన తరువాత కమిటీ తన నివేదికను 2022లో ప్రభుత్వానికి సమర్పించింది. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికలోని ప్రతిపాదనలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రైవేటు స్కూల్స్ ప్రతి ఏడాది కనీసం 10 శాతంకి తగ్గకుండా ఫీజులను పెంచుతూనే ఉన్నాయి. 2023 డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చీ రాగానే ఫీజుల నియంత్రణ చట్టం చేస్తామని ప్రకటించింది. అయితే కాంగ్రెస్ సర్కార్ వచ్చి కూడా ఏడాదిన్నర దాటింది. గత విద్యా సంవత్సర కాలంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురాలేదు. ఈ ఏడాది కూడా విద్యా సంవత్సరం ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేదు.

**జూనియర్, డిగ్రీ కాలేజీల్లోనూ..**

రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లోనే కాదు.. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో కూడా ఫీజులు భరించలేకుండా ఉన్నాయి. సాధారణ ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్‌కి రూ. 40వేల నుంచి రూ. 1.20 లక్షల వరకు వసూలు చేస్తుండగా.. కార్పొరేట్ కాలేజీల్లో మినిమమ్ ఫీజే రూ. 1.20 లక్షలు కాగా.. రెసిడెన్షియల్ విధానంలో కొనసాగే కాలేజీలు రూ. 4.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. ఇక రాష్ట్రంలోని నాన్ దోస్త్ డిగ్రీ కాలేజీలు కూడా ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. వాటిల్లో రూ. 40వేల నుంచి రూ. 2.30 లక్షల వరకు ఫీజులను వసూలు చేస్తున్నాయి.

## చమురు రవాణాకు కీలకం హార్ముజ్ జలసంధి

>> ప్రకటించింది. ప్రపంచదేశాల చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హార్మూజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్‌పార్లమెంటు ఆమోదం తెలిపింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకోడంతోపాటు ప్రపంచదేశాల మద్దతు కూడగట్టేందుకే ఇరాన్ ఈనిర్ణయం తీసుకుంది. రోజువారి చమురు అవసరాల్లో 20శాతం ఈ జలసంధిద్వారానే రవాణా అవుతుంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం ఇరాన్‌మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇదే. దీనితో ఒకచోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లుమాత్రమే ఉంటుంది. ఈ మార్గంనుంచి నిత్యం రెండుకోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యుఎఇ, కువైట్, ఇరాక్‌లనుంచి ఎగుమతి అవుతుంది. ఇక లిక్విఫైడ్ నేచురల్‌గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంటు ఎల్ఎన్జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. హార్మూజ్ జలసంధి మూసివేత నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యంపై పడుతుంది. ముఖ్యంగా భారత్ చమురు అవసరాల్లో 90శాతం ముడిచమురు విదేశాలనుంచే దిగుమతిచేసుకుంటున్నది. ఈమొత్తంలో 40శాతం హార్మోజ్ ద్వారానే వస్తుంది. ప్రభుత్వం తన 74 రోజుల చమురునిల్వలను తగ్గించుకోవాల్సి వస్తోంది. ఇరాన్ నిర్ణయం ప్రపంచమార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం పడుతుంది. ఇప్పటికే బ్యారెల్‌ముడిచమురు 90 డాలర్లవద్ద ఉంది. సౌదీ అరేబియా, ఇరాక్, యుఎఇ దేశాలనుంచి అత్యధికమొత్తంలో భారత్‌ముడిచమురు దిగుమతిచేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ చమురునౌకలు ఒమన్ ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తాయి. భారత్‌కు ముడిచమురు 15 లక్షల బ్యారెళ్లు ఉంటుంది. ఈ రవాణా ఆగితే రోజుకు 10 నుంచి 12కోట్ల లీటర్ల పెట్రోలు ఉత్పత్తి నిలిచిపోతుంది. అలాగే ద్రవరూప గ్యాస్ రవాణాలోను 20శాతం ఈ జలసంధి మీదుగానే వెళతాయి. ఇపుడు అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల దాడులవల్ల ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచదేశాలపై చమురు డిమాండ్‌మరింతపెరగడం ఆపై ధరలు కూడా చుక్కలనంటేపరిస్థితులు ఉన్నాయి.

## నేటి కేబినెట్ భేటీలో బనకచర్ల వేడి!

>> వెల్లడిస్తున్నాయి నిధుల సమీకరణ, అమలు విధానాలపై చర్చ జరగనుంది. ఈ పథకాలకు సంబంధించిన ఆర్థిక కేటాయిం పులు,లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలను సమీక్షించే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కొత్త రెవెన్యూ చట్టం,భూభారతి అమలు, మెట్రో రైల్ ఫేజ్2 ప్రాజెక్టు, 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను కూడా చర్చించే అవకాశం ఉందని సమాచారం. కాగా ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరవ్వాలని అన్ని విభాగాల అధిపతులకు ఇప్పటికే సిఎస్ ఆదేశాలు జారీ చేశారు.

## గోదావరి వివాదాలపై కొత్త ట్రిబ్యునల్!

>> ఇచ్చిన బచావత్ నేతృత్వంలోనే గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ ఏర్పాటైంది. 1980లో అవార్డ్ ప్రకటించిన అనంతరం గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ మనుగడలో లేకుండా పోయింది. కృష్ణా నదీ జలాల వినియోగానికి కూడా గతంలోనే బచావత్ ట్రిబ్యునల్ అవార్డ్ ప్రకటించింది. కృష్ణా నదీ జలాల వినియోగానికి సంబంధించి వివాదాలు తలెత్తుతుండటంతో బ్రిజేష్ కుమార్ నేతృత్వంలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. ఇప్పుడు మళ్లీ గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ ఏర్పాటు సాధ్యా సాద్యాలపై కేంద్రం పెద్దలు చర్చిస్తున్నట్లు సమాచారం.

## పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లింపు

>> తెలంగాణ లో అదే స్థాయిలో ఉంటుందని అందుకు మంచి రోడ్లు ఉండాలని,ప్రజలకు ప్రధానంగా కావాల్సింది సౌకర్యవంతమైన రోడ్లనీ గుర్తెరిగి పనిచేయాలన్నారు. వర్క్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో మాట్లాడి క్లియర్ చేయిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్సీ తిరుమల, చీఫ్ ఇంజనీర్లు మోహన్ నాయక్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.




నక్సలిజంపై ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల డిజిపిలు, ఎడిజిపిలు సీనియర్ అధికారులతో ఆదివారం న్యూఢిల్లీలో సమీక్ష చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# అమెరికా మెరుపు దాడితో ఇరాన్ ఉక్కిరిబిక్కిరి


>> చేస్తామని ప్రకటించిన ఇజ్రాయెల్ హెచ్చరికలను పరిగణలోనికి తీసుకున్న ఇరాన్ ప్రభుత్వం ఖమైనీని రహస్యస్థావరం అంటే బంకర్‌లోకి తరలించింది. ఎలక్ట్రానిక్‌పరికరాలు వేటినీ కూడా వాడకుండా కేవలం ఒకరిద్దరు నమ్మకస్తులతోనే సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తనకంటూ ప్రాణహాని జరిగితే వారసులు ఉండాలన్న లక్ష్యంతోముగ్గురు సీనియర్ మతపెద్దలపేర్లను కూడా ఎంపికచేసారు. అలాగే వారసత్వ పాలనకు చెక్‌పెడుతూ వారిలో తన కుమారుడిపేరును చేర్చలేదు. ఇదిలా ఉంటే ఇరాన్‌లో ఉన్నకీలక అణుస్థావరాలన్నింటినీ ధ్వంసంచేసామని అమెరికా రక్షణరంగవ్యవస్థ పెంటగాన్‌ప్రకటించింది. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్‌గా పేర్కొన్న పెంటగాన్ తమ ఆపరేషన్ తీవ్ర విఘాతం కలిగించిందని చెప్పింది. రక్షణమంత్రి పిట్ హెగ్‌సేత్ ఆపరేషన్‌వివరాలుప్రకటించారు. మొత్తం 14 బంకర్ బస్టర్ బాంబులు విడిచామని, అమెరికానుంచి బి2 బాంబర్లు పాల్గొన్నాయని, ఇరాన్‌ను దృష్టి మరల్చేందుకు కొన్ని తూర్పువైపు, మరికొన్ని పశ్చిమానికి ప్రయాణించాయి. 37 గంటలపాటు11వేల కిలోమీటర్లుప్రయాణించినతర్వాత ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి 30 వేల పౌండ్ల బరువున్న 14 బాంబులు విడిచామని ప్రకటించారు. నతాంజ్, ఇస్ఫహాన్ ఫోర్డో అణుస్థావరాలు పూర్తిగా ధ్వంసంచేసినట్లు ప్రకటించుకున్నారు. ఏడు బి2 బాంబర్లు సహా మొత్తం 125 యుద్ధవిమానాలు, ఇంధనవిమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు పీట్‌హెగ్‌సేత్ వెల్లడించారు. ఫోర్డో,నతాంజ్‌లపై సాయంత్రం 6.40 గంటలకు ఏడు గంటలకల్లా ఇరాన్ గగనతలంనుంచి బయటకు వచ్చేసామన్నారు. ఇరాన్‌కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.10 గంటలకు దాడులు జరిగినట్లు తెలిపారు. అమెరికాలోని మిస్సోరి స్థావరంనుంచి ఈ ఆపరేషన్ షురూచేసారు. మూడు స్థావరాలతోపాటు మరికొన్ని కీలక కూడళ్లపై తోమ్‌హాక్ క్షిపణులు ప్రయోగించారు. వాస్తవానికి రెండురోజుల ముందే అమెరికా బి2 బాంబర్లను పసిఫిక్ ద్వీపం గ్వామ్‌కు తరలించింది. ఈ బాంబర్లే ఫోర్డోవంటి లోతైన అణుస్థావరాలను ఛేదించాయి.

**హార్మూజ్ జలసంధి మూసివేత**

ప్రపంచ దేశాల చమురు ఎగుమతులకు కీలకంగా నిలిచిన హార్మూన్‌జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్‌ప్రకటించడంతో ఇపుడు చమురు జలరవాణాకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతాయి. ఇరాన్‌నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తుదినిర్ణయం ప్రకటించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే పార్లమెంటు ఆమోదం తెలిపింది. ప్రపంచంలోని రోజువారి చమురు అవసరాల్లో 20శాతం ఈ జలసంధినుంచే వెళతాయి. ఒమన్‌లోని ముసాండం ద్వీపకల్పం, ఇరాన్‌మధ్య ఉన్న ఈ జలసంధిద్వారానే భారత్‌తోపాటు ఇతర దేశాలకు దిగుమతులు, అమెరికా ఇతర అగ్రదేశాల చమురు ఎగుమతులు వంటివిజరుగుతున్నాయి. అమెరికా దాడుల అనంతరం ఇరాన్ ఇక ఉపేక్షించేదిలేదంటూ చమురు రవాణాపై యుద్ధంప్రకటించింది.

**ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదులు**

ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వదేశంగా ఉన్న అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని, తమ గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించి ఇరాన్‌పై దాడులుచేపట్టిందని ఇరాక్ ఐక్యరాజ్యసమితి సెక్రటరీజనరల్‌కు ఫిర్యాదులుచేసింది. ఇలాంటి నేరపూరిత దేశాలపట్ల ఇతర దేశాలు అప్రమత్తంగా ఉండాలని, ఈ దాడులకు ప్రతీకార దాడులు తప్పకుండా ఉంటాయని, ఆగాయం అమెరికాకు జీవితాంతం గుర్తుండిపోతుందని ఇరాన్ విదేశాంగమంత్రి సయ్యద్ అబ్బాస్ ఆరోపించారు. ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటూ ఇరాన్ తన సార్వభౌమత్వం, ప్రజల సంరక్షణకు అన్ని చర్యలుచేపడుతుందని అబ్బాస్ వెల్లడించారు. అలాగేపశ్చిమాసియాలోని అమెరికన్లను



ఇజ్రాయెల్‌లోని హైఫాపై ఇరాన్ బాంబుల వర్షం కురించడంతో ధ్వంసమైన ఇళ్లనుండి ఇద్దరు పిల్లలను ఎత్తుకుని తీసుకువెళ్తున్న రెస్క్యూ సిబ్బంది

అగ్రరాజ్యం స్థావరాలు లక్ష్యంగా దాడులుచేస్తామని వెల్లడించింది. ఎర్రసముద్రంలోని అమెరికా నౌకలపై ప్రతీకారదాడులుచేస్తామని ప్రకటించారు. దీనితో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతపెరిగే అవకాశం ఉంది.

**ఖొమైనీకి భద్రతపెంపు...**

ఇజ్రాయెల్, అమెరికా దేశాలనుంచి పొంచి ఉన్న ముప్పుకారణంగా ఇరాన్ అధినేత అయతొల్లా ఖొమైనీ భద్రతను మరింతపెంచేసారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు సైతం గుర్తుపట్టని రహస్య స్థావరంలో ఖమైనీని ఉంచారు. ఖమైనీ భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని నిర్ణయించిన ఇరాన్ ఎలాంటిసిగ్నల్లకు అవకాశం లేకుండా కమ్యూనికేషన్ వ్యవస్థలను ఈ బంకర్‌కు పూర్తిగా నిలిపివేసింది. కేవలం ముగ్గురు అత్యంత కీలకమైన ఉన్నతాధికారులు, ఖమైనీ సన్నిహితులు మాత్రమేఖొమైనీతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ కార్యాచరణలు అమలుచేస్తున్నారు. అలాగే ఈ రెండుదేశాల నుంచి తనకు ప్రాణహాని ఉన్నందున ఖొమైనీ కూడా తన వారసులను ప్రకటించేసారు. తనకుమారుడు మొజ్తబా పేరును మాత్రం చేర్చలేదు. కేవలం అత్యంత సీనియర్ పెద్దలు అలీరెజా అరాఫీ, అలీ అస్గర్ హెజాజీ, హాషీం హుస్సేని బుషారీల పేర్లను ఎంపికచేసి వీరిలో వరో ఒకరు సుప్రీం బాధ్యతలుచేపడతారన్న సంకేతాలు ఇచ్చారు.

**యూటర్న్ తీసుకుంటున్న మిత్రదేశాలు..!**

కాగా ఇరాన్‌పై జరుగుతున్న దాడులను ప్రతిఘటించి ఆదేశానికి వెన్నుదన్నుగా నిలిచే మిత్రులందరూ యూటర్న్ తీసుకుంటున్నారు. నిన్నమొన్నటివరకూ అమెరికా యుద్ధనౌకలను పేల్చివేస్తామని ప్రకటించిన యెమెన్‌లోని హౌతీ దళాలు ఇపుడు మౌనం వహించాయి. అలాగే గాజా పాలస్తీనా హమాస్, ఈజిప్టులోని హెజ్‌బొల్లాలనుంచి కూడా ఎలాంటి స్పష్టమైన ప్రకటనలు రాకపోవడంతో ఇపుడు అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ప్రతిఘటించేందుకు ఇరాన్ ఏకాకిగా మారింది. అయినప్పటికీ ఇజ్రాయెల్‌లోని కీలక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించి ధ్వంసంచేసింది. మొత్తం 27కిపైగా క్షిపణులను ఇజ్రాయెల్‌లోని హైఫా, టెల్ అవీవ్‌నగరాలపై ప్రయోగించడంతో ఇజ్రాయెల్‌కూడా ఇపుడు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంచేసుకుంటున్నది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పసికందుపై ఊడిపడిన సీలింగ్ ఫ్యాన్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 22:** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెండురోజుల పసికందుపై సీలింగ్ ఫ్యాన్ ఊడిపడింది. ఇంతలోనే తల్లి అప్రమత్తం కావడంతో రెప్పపాటులో పెనుప్రమాదం తప్పింది. ఫ్యాన్ ఊడిపడే సమయంలో బాలింత తన బిడ్డను రెప్పపాటులో ఒళ్లోకి తీసుకోవడంతో స్వల్పగాయాలతో రెండురోజుల పసికందు బయటపడింది. అనంతరం అప్రమత్తమైన గుడిహత్నూర్ ప్రాథమిక ఆస్పత్రి సిబ్బంది పసికందును, బాలింత తల్లిను 108 అంబులెన్స్‌లో అత్యవసర చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తల్లి బిడ్డా ఇద్దరు క్షేమంగా ఉన్నారని రిమ్స్ వైద్యులు తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండురోజుల క్రితం గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్‌కు చెందిన జాదవ్‌పాయల్ పురిటి నొప్పులతో ఇబ్బంది పడటంతో భర్త జాదవ్ కైలాష్ గుడిహత్నూర్ ప్రాథమిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. కొన్ని గంటల్లోనే పండంటి ఆడబిడ్డకు పాయల్ జన్మనిచ్చింది. తల్లిబిడ్డలిద్దరు జనరల్ వార్డ్‌లో చికిత్స పొందుతుండగా.. ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా వారి బెడ్ పైన ఉన్న సీలింగ్ ఫ్యాన్ ఊడిపడింది. ఈ హఠాత్ పరిణామానికి భయభ్రాంతులకు గురైన తల్లి పాయల్ అంతేవేగంగా తన బిడ్డను పక్కకు లాగడంతో ఫ్యాన్ చివరిభాగం వీపుపై పడింది. దీంతో అలర్ట్ అయిన గుడిహత్నూర్ ఆస్పత్రి సిబ్బంది తల్లీబిడ్డలనిద్దరిని మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డలిద్దరు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదఘటనపై కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘోరం జరిగుంటే ఎవరు బాధ్యత వహించేవారని నిలదీస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆస్పత్రిలో సౌకర్యాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# మద్యం అమ్మకాలపై ఆశలు.. కల్తీలపై కన్నెర్ర

### బోనాల జాతరలో కల్తీ మద్యం విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఈ నెల 29 నుంచి జూలై 21 వరకు బోనాల జాతర సంబరాలు ప్రారంభం కానున్నాయి. పేద, మధ్యా తరగతితో పాటు మిగితా వారు కూడ భోనాల పండుగ జరుపుకుంటారు. బోనాల జాతర అంటే అమ్మవారికి బోనాలు, మేక, గొర్రె పోతులతో మొక్కులు, మ్నద్యంతో శాక పోయడం పరిపాటి. జాతర సందర్భంగా ఇంటిల్లీపాదితో పాటు బంధు వులను పిలుచుకొని సంబ రాలు జరుపుకుంటారు. మినీ దసరా రీతిలో జరిగే బోనాల జాతరలో మద్యం వినియోగం జోరుగా ఉంటుంది. జూన్, జూలై నెల్లో 10 రోజుల పాటు బోనాల జాతరలు జరుగుతాయి. ఈ సందర్భంగా మ్నద్య అమ్మకాలు జోరుగా జరుగుతాయని, వ్యాపారులు అవసరమైన స్టాకును సమకూర్చు కోవడానికి అవసరమైన సన్నాహాలు చేపట్టారు. బోనాల జాతర సందర్భంగా జూలై నెలలో భారీగా అమ్మకాలు జరుగుతాయని ఎక్సైజ్ శాఖ అంచనాల్లో ఉంది. జాతర సందర్భంగా జరిగే మద్యంఅమ్మకాల్లో కల్తీ మద్యం, ఫ్యూరియల లిక్కర్ వినియోగం, నాన్ డ్యూటిపెయిడ్ లిక్కర్ వినియోగం జరిగే అవకాశాలు ఉంటాయని భావించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఎస్‌టిఎఫ్ ,ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటిఎఫ్ శాఖలను ఎన్‌డీపీఎల్ మద్యంపై అప్రమత్తం చేశారు. తెలంగాణలో ఆషాడమాసంలో జరిగే బోనాల జాతరలు ఎక్కడెక్కడ ఎప్పుడెప్పుడు జరుగుతాయనే తేదీలను ముందుగానే ఖరారు చేసిన సంగతి తెలిసిందే. జూన్ 29న గోల్కొండ, జూలై 2న బల్కంపేట్, 4న జూబ్లీహిల్స్, 10నఉజ్జయిని మహంకాళీ, 13, 14 బోనాల జాతర, 15న చార్మినార్, 17న లాల్ దార్వాజ, 20న పాతబస్తీ, 21న బోనాల ఘటాలతో ఊరేగింపుతో బోనాల జాతర హైదరాబాద్ మహానగరంలో పూర్తివుతాయి.

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ ప్రాంతాల్లో బోనాలజాతర సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయని మద్యం వ్యాపారులు భావిస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సారి మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు. ఎక్సైజ్ శాఖలో 2024-25 సంవత్సరంలో బోనాలు జరిగే జూన్, జూలై, ఆగస్టుల్లో మద్యం అమ్మకాలు పరిశీలిస్తే బోనాల జాతరసందర్భంగా మద్యంఅమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2024-25 జూన్ నెలలో 30.24 లక్షల పెట్టెల లిక్కర్, 39.94 లక్షల బీరు పెట్టెల అమ్మకాలు జరిగాయి. జూలైలో 31.80 లక్షల పెట్టెల లిక్కర్, 47.94 లక్షల పెట్టెల బీరు అమ్మకాలు జరిగాయి. ఆగస్టులో 30.86 లక్షల పెట్టెల లిక్కర్, 39.77లక్షల పెట్టెల బీర్లు అమ్మకాలు జరిగాయి. ఈ మూడు నెల రికార్డులను పరిశీలించినపుడు బోనాల జరిగిన జూలైలో లక్ష నుంచి లక్షన్నర పెట్టెల లిక్కర్, బీరు అమ్మకాలు అధికంగా జరిగాయి. ఈసారి అమ్మకాలు మరింతగా పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తుంది. ఈ నెలాఖరు వరకు పెద్దమొత్తంలో మద్యం నిల్వలను నిల్వ చేసుకోవడానికి వ్యాపారులు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. ఎన్‌డీపీఎల్ నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ కేసులు పరిశీస్తే 2023లో సంవత్సరంలో176 కేసులు నమోదు కాగాజోనాల జాతర జరిగిన జూలై నెలలో ఎన్‌డీపీఎల్ కింద78 కేసులు నమోదు అయ్యాయి. 2023లో 2940 లీటర్ల మద్యం సీజ్ చేసిన ఒక్క జూలైలో 1845 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ శాఖ సీజ్ చేసింది. అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలపై 2023లో 133 కేసులు నమోదైతే 2024లో 482 కేసులు నమోదు చేశారు. 2023లో 932 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. 2024లో 2937 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. ఈ సారి జరిగే బోనాల జాతర సందర్భంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌లు మరింత నిఘా పెట్టి ఎన్‌డీపీఎల్, అనుమతులు లేని మద్యంఅమ్మకాలు జరుగకుండ చర్యలు తీసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇప్పటికే ఎన్‌డీపీఎల్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పెద్ద మొత్తంలో పట్టుకున్నారు. మరో పక్క డిఫెన్స్ లిక్కర్‌పై ప్రత్యేక ఫోకస్‌తో దాడులు నిర్వహిస్తున్నారు. బోనాలజాతర సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి లిక్కర్‌ను రాకుండా గట్టి నిఘా పెడుతారు. స్థానికంగా ఫ్యూరియస్ లిక్కర్‌ను అరికట్టకట్టడానికి చర్యలు చేపడుతామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజకీయాల్లో చేరే ప్రసక్తిలేదు.. సిఎం పదవిపైనా ఆసక్తిలేదు

### బిసిసిఐ మాజీ చీఫ్ సౌరభ్‌గంగూలీ

**కోల్‌కతా, జూన్ 22:** బిసిసిఐ మాజీ ఛైర్మన్; మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ రాజకీయ అరంగేట్రంపై స్పష్టత ఇచ్చారు. రాజకీయాల్లో తాను చేరే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు.



వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగుతున్నవేళ ఏదైనా రాజకీయ పార్టీలోచేరాలని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు చిరునవ్వుతో నాకు ఆసక్తిలేదన్నారు. ఒక వేళ సీఎం పదవిని ఇస్తానని హామీ ఇస్తే అన్న మరో ప్రశ్నకు కూడా ఆయన తనకు ఆసక్తిలేదని స్పష్టంచేసారు. అయితే టీమిండియా జట్టుకు కోచ్‌గాపనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తంచేసారు. 2018-19, 2022-23 మధ్య ఢిల్లీకేపిటల్స్ టీమ్ డైరెక్టర్‌గాపనిచేసిన గంగూలీ టీమిండియా కోచ్‌గా ఉండటంపై స్పందించారు. తాను వేర్వేరు ప్రాంతాల్లోపనిచేసినందువల్ల దీనిపై నిజంగా ఎప్పుడూ ఆలోచించలేదన్నారు. 2013లోనే పోటీతత్వ క్రికెట్‌కు ముగింపు చెప్పాను. ఆపై బిసిసిఐ అధ్యక్షుడుగా బాధ్యతలుచేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించడంద్వారా భారత క్రికెట్‌కు అతిపెద్ద సహకారం అందించడంతనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. టీమిండియా కోచ్‌అయితే మరింతసహకారం ఇవ్వచ్చుకదా అన్న మీడియా ప్రశ్నకు బదులిస్తూ చూద్దాం ముమ్ముందు ఏంజరుగుతుందో చూడాలి. నావయసు కేవలం 53 అందువల్ల ఏంజరుగుతుందోచూద్దాం. నేను దానికి సిద్ధంగానే ఉన్నాను. అది ఎక్కడివరకూ వెళుతుందో చూద్దామని జవాబిచ్చారు. ప్రస్తుత కోచ్‌గౌతమ్ గంభీర్‌పై ప్రశంసలుకురిపించారు. గంభీర్ తన సీనియర్లపట్ల ఎంతో గౌరవంతో ఉండేవాడని తాను ఆడినరోజులు గంగూలీ గుర్తుచేసుకున్నారు. కోచ్‌గా అతడు దాదాపు ఏడాది మాత్రమే అయిందని, ఆతడు తన వృత్తిపట్ల ఎంతో ఇష్టంతోపనిచేస్తున్నానన్నారు. కోచ్‌గా గంభీర్ ఎదగడానికి కాలక్రమేణా నేర్చుకోడానికి కొంత వ్యవధి ఇవ్వాలని గంగూలీ అన్నారు.

# ప్రధాని మోడీ హయాంలో దేశంలో పెరిగిన అక్షరాస్యత

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(బేగంపేట), జూన్ 22, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ హయాంలో దేశంలో అక్షరాస్యత శాతం పెరిగిందని, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో ఆది వారం రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి, ఇంటర్మీ డియట్, డిగ్రీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 200మంది విద్యార్థులకు ప్రశంస పత్రంతో పాటు నగదు బహుమతి అందజేసారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యను అభ్య సించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించే విధంగా కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ తీసు కున్న నిర్ణయం అభినంద నీయమని అన్నారు. ఇటీవల కాలంలో అన్ని పరీక్షలలో బాలికలే గొప్ప గా రాణిస్తున్నారని అన్నా రు.

విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాఠ శాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. తరగతి గదులు, మూత్ర శాలలు, తాగునీటి సరఫ రా, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రికి సూచించారు.

ఈ కార్యక్రమంలో మహంకాళీ జిల్లా బీజేపీ అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, ఎస్‌ఆర్ మల్లేష్, యోగేశ్, నెమలి అనంద్ (నందూ), శ్రీనివాస్‌యాదవ్, నరేంద్రపాల్, ప్రవీణ్, కనకంట్ల హరి, ఆకుల ప్రతాప్, గోపికిషన్, ఆనంద్‌వ్యాస్, మదన్, శివ, చీరె శ్రీనివాస్, శ్రీను, సునీల్ ఉపాధ్యాయ, కావేరి వినయ్, రవి, దుర్గా ప్రసాద్, మహే ష్, సురేష్, సంతోష్, వేణు, ధన్‌రాజ్, నరే ష్, యశ్వంత్, రఘు, ఆదేశ్, అమర్ నాథ్, నితీష్ భోలే, మహిళా మోర్చా నాయకురాళ్లు కళ్యాణి, కోమల్, నిర్మల, అంజూ, జయ, అశ్విని, స్వప్న, ఓమ్ని తది తరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ చీరె సుచిత్ర.

# ప్రతిఘటన చర్యలను తీవ్రతరం చేయండి

### గిరిజనులలను దోచుకుంటున్న పట్వారీలు, ఫారెస్టు గార్డులు

### మావోయిస్టు పార్టీ కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి దుల్లా

**చర్ల, ప్రభాతవార్త :** ప్రజావ్యతిరేక అటవీ రక్షకులు మరియు పట్వారీల దోపిడీ, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని, ప్రతిఘటన చర్యలను తీవ్రతరం చేయండి అంటూ సీపీఐ (మావోయిస్టు) పార్టీ కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి దుల్లా పేరిట ఆదివారం కొంట బ్లాక్‌లోని కొంట, గొల్ల పల్లి, కిష్టారాం, చింతగుఫా, పోలంపల్లి, దోర్న పాల్, ఎర్రబోర్, భెజ్జి పోలీస్ స్టేషన్ల అంతర్భాగాలలో పనిచేస్తున్న ఫారెస్ట్ గార్డులు, పట్వారీలను హెచ్చరిస్తూ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో ఈ విధంగా పేర్కొని ఉంది. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్ట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సల్ నిర్మూలన, అభివృద్ధి పేరుతో పోలీసు శిబిరాలు / పోలీస్ స్టేషన్లను తెరిచి రోడ్డు వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నాయని, మరోవైపు, అటవీ రక్షకులు, పట్వారీలు లోతట్టు ప్రాంతాలలోని గ్రామా ల్లోకి ప్రవేశించి, పోలీసు బలగాలను ఉపయోగించి సామాన్య ప్రజల నుండి డబ్బును దోచుకుంటున్నారని, పట్వారీలు గ్రామం నుండి గ్రామానికి వెళ్లి 40 సంవత్సరాలుగా మూసి వేయబడిన భూమి నుండి డబ్బును వసూ లు చేస్తున్నారని, కొత్త పట్వారీని నిర్మించడం పేరుతో డబ్బును దోచుకుంటున్నారని ఆరోపిం చారు. ఇటీవల, భేజ్జి పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని బందర్‌పదర్, రామనగరం, పొంటా భేజ్జి వంటి గ్రామాల్లోని భూములను కొలిచి డబ్బులు వసూలు చేశారని, అటవీ రక్షకుడు వెదురు, అడవులను నరికి గ్రామసభ అనుమతి లేకుండా రవాణా చేయడం ప్రారంభించారని పేర్కొన్నారు. ఒకరి భూమిని, అడవులను ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బెదిరిస్తున్నారని, మొత్తంమీద, గిరిజనులు స్థానికుల నుండి శిక్షగా డబ్బు, మద్యం, కోడి, మేక, పందిని కూడా డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ స్థానభ్రంశం, దోపిడీ, అణచివేత పేదలలో ఆగ్రహాన్ని సృష్టిస్తోందని, అందువల్ల, పైన పేర్కొన్న అన్ని రకాల దోపిడీ, అణచివేత మరియు నిరంకుశత్వాన్ని మా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) కొంటా ఏరియా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు.


**ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనుల హత్య**

చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని యాంపురం సండ్రం బోరు గ్రామాలకు చెందిన ఇద్దరు గిరిజనులను ఇన్‌ఫార్మర్ నెపంతో శనివారం అర్ధరాత్రి మావోయిస్టులు హత్యచేశారు. వీరిలో ఒకరు మాజీ దళ సభ్యుడు వెకో దేవయ్య ఆలియాస్ సందీప్ కాగా మరొకరు సున్నం సమ్మయ్య. సందీప్ రెండేళ్ల క్రితం చర్ల పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మరొకరు దళ సభ్యుడిగా పనిచేసినట్లు సమాచారం.

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ వరద

### శ్రీశైలానికి 60,587 క్యూసెక్కుల వరద, ఎస్సారెస్సీకి 2,049

**హైదారబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తుతోంది. పైనుంచి వస్తున్న వరద నీటితో జూరాల డ్యామ్‌కు వరదనీరు చేరుతోంది. ఈ సీజన్‌లో రెండోసారి అధికారులు డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుకుంటోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని అధికారులు చెప్పారు. అయితే, డ్యామ్ నుంచి ప్రస్తుతానికి నీటిని వదలడం లేదు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 854.20 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థం 215.7080 టీఎంసీలు, ప్రస్తుతం 89.7132 టీఎంసీలకు చేరిందని అధికారులు వివరించారు. ప్రస్తుతం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామని చెప్పారు. అదేవిధంగా ఎస్సారెస్పీకి 2049 క్యూసెక్కుల వరద జలాలు వస్తున్నాయి.



## జూరాల డ్యామ్ నుంచి మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 22, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయినిగా కొనసాగుతున్న ప్రియదర్శిని జూరాల డ్యామ్ జలకలను సంతరించుకున్నది. గత వారం రోజులకు పైగా ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెత్తడంతో జూరాల నిండుకుండలా మారింది. దీంతో దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. ఆదివారం జూరాలకు 53000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా మూడు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు.

జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 8.869 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్‌కు 38,164 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 12,303 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమా లిఫ్టుకు 650 క్యూసెక్కులు కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు సమాంతర కాలువకు 850 క్యూసెక్కులు బీమా లిఫ్టుకు 750 క్యూసెక్కులు, విడుదల చేస్తున్నారు. మొత్తంగా జూరాల నుంచి 53,771 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదయింది. శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వర దజూరాల డ్యాం నిండిపోవడంతో అధికారులు గేట్లు ఎత్తారు. దీంతో వరద నేరుగా శ్రీశైలం జలాశయానికి చేరుతుంది.

## వేర్వేరు కేసుల్లో 72 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టివేత

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఢిల్లీలో తక్కువ ధరలకు డిఫెన్స్ మద్యం బాటిల్స్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్ కు తీసుకొని వచ్చి ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఒక వ్యక్తిని ఆదివారం సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సావిత్రి సౌజన్య సిబ్బంది కలిసి పట్టుకున్నారు. సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్ వద్ద దండు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిని ఆల్ఫా హోటల్ వద్ద ఉండడం గమనించి సుబ్బయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్నటువంటి బ్రీఫ్ కేసులో తనిఖీలు నిర్వహించగా అందులో టీచర్స్ 52 మద్యం బాటిళ్లు లభించాయి. ఈ మద్యం బాటిల్లు ఢిల్లీలోని డిఫెన్స్‌కు చెందినవిగా గుర్తించారు. ఢిల్లీలో రూ.850 కొనుగోలు చేసి టీచర్స్ బాటిల్స్‌ని దమ్మాయి గూడా, నాగారం ప్రాంతాల్లో రూ.1800కు అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్న వెంకటసుబ్బయ్యను అరెస్ట్ చేశారు. సంబంధిత మద్యం బాటిల్లను నిందితుని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. మరో హర్యాన ప్రాంతాలకు చెందినటువంటి 20 డిఫెన్స్ మద్యం బాటీలను హైదరాబాద్ కు తీసుకొని వస్తుండగా రంగారెడ్డి ఏసీ ఎన్ఫోర్స్‌మెంట్ టీం పట్టుకున్నారు. ఒక కారులో డిఫెన్స్ మద్యం వస్తుందనే సమాచారం మేరకు ఏసీ ఎన్ఫోర్స్‌మెంట్ సిఐ సుభాష్ చంద్ర అండ్ ఇతర సిబ్బంది కలిసి వికారాబాద్ సమీపంలోని ఎన్నపల్లి ఎక్స్ రోడ్ వద్ద తనిఖీలు చేపట్టి కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్నటువంటి 20 మద్యం బాటీలను స్వాధీనం చేసుకొని, కారులో ఉన్నటువంటి శ్రీనాథ్ రెడ్డి, జీవన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, సురేందర్రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ తెలిపారు.

**1.138 కేజీల గంజాయి జప్తు**


నాంపల్లి మంగర బస్తిలోని బస్తీ దవాఖాన సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఎస్ టి ఎఫ్ ఏ టీం బృందం దాడులు నిర్వహించి 1.138 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# అటవీ ప్రాంతంలో అనాథ పసికందు!

### నర్సాపూర్ అడవిలో వినిపించిన శిశువు ఏడుపు

### పోలీసులు చేరదీసి బాలుర సంరక్షణ కేంద్రానికి తరలింపు

**నర్సాపూర్, జూన్ 22, ప్రభాతవార్త:** మాపవత్వాన్ని మరిచి అభం శుభం ఎరుగని పసికందు మగ శిశువును కన్న పేగు బంధాన్ని మరిచి మానవత్వాన్ని వదిలి వేసి గుర్తు తెలియని వ్యక్తులు ఒక నాలుగు నెలల మగ శిశువు అడవి ప్రాంతంలో చెట్ల పొదల్లో వదిలి వేసిన హృదయ విదారక సంఘటన నర్సాపూర్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరా ల్లోకి వెళితే.. నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిలో గల కొండాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు నెలల పసికందు మగ శిశువును మానవత్వం మరిచి వదిలి వెళ్ళిపోయారు. ఈ క్రమంలో మెదక్ నుండి హైదరాబాద్ నగరానికి ఇదే జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు నర్సాపూర్ అటవీ ప్రాంతంలోకి రాగానే మూత్ర విసర్జన కోసం వాహనాన్ని ఆపి రోడ్డు పక్కకు వెళ్లగా అడవిలోని చెట్ల పొదల నుంచి పసిపాప ఏడుపులు వినిపించాయి. ఈ ఏడుపు చప్పుడు విన్న వాహనదారులు వెళ్లి చూడగా చెట్ల పొదల్లో నాలుగు నెలల పసికందు మగ శిశువు కనిపించాడు. వెంటనే వారు 100 నంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై బి లింగం హుటాహుటిన వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి మగ శిశువును నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఆసుపత్రిలో పసికందును వైద్యులు పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించారు వెంటనే ఎస్సై బి లింగం ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించి అటవీ ప్రాంతంలో లబించిన మగ శిశువుని మెదక్ లోని బాలుర సంరక్షణ కేంద్రానికి తరలిం చారు ఈ సంఘటనపై ఎస్ఐ బి లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు





నర్సాపూర్ అటవీ ప్రాంతంలో లభించిన పసికందును మెదక్ బాలుర సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న ఎస్ఐ లింగం ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు

# బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం పోరాటం

### జూలై 17న రైల్‌రోకోకు ఆర్.కృష్ణయ్య మద్దతు కోరిన కవిత

### ఉద్యమం చేయకపోతే హక్కులు రావు: కృష్ణయ్య



**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** తెలంగాణలో బీసీల హక్కుల కోసం నడుస్తున్న ఉద్యమానికి మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చర్యలు ముమ్మరం చేశారు. బీసీ ఉద్యమ నేత, బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్యను ఆమె హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి, జూలై 17 జరగ నున్న జాగృతి రైల్‌రోకోకు మద్దతు ఇవ్వాలంటూ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ జాగృతి తరఫున మేము బీసీల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ఆర్. కృష్ణయ్య గారిని కలిసాము. కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయాలన్న డిమాండ్‌తో మేము ఉద్యమం చేపట్టాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. అయితే బిల్లులు పాస్‌చేసి, రాష్ట్రపతికి పంపిం చామని చెప్పి చేతులు దులుపుకుంటోంది' అని విమర్శించారు. అంతే కాకుండా.. రేపు జరగనున్న కేబినెట్ సమా వేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

బీసీల రిజర్వేషన్ల విషయంలో నిర్ణయం లేకుండా ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వడం అన్యా యమని స్పష్టం చేశారు. బీసీ బిల్లు పక్కాళీ అనే నినాదంతో నిర్వహించనున్న రైల్ రోకో కార్యక్ర మానికి మద్దతు ఇవ్వాలని కృష్ణయ్యను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి లేదని, బిల్లులు పాస్ చేశారన్న మాటలు చెబుతున్నారు కానీ అమలు చేసే ప్రయత్నం లేదు అని పేర్కొన్నారు. అంతేకాక.. కవిత బీసీ కాకపో యినా, బీసీల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. ఇది గమనించదగ్గ విషయమని, బీసీలు ఇప్పుడు మోనం వహిస్తే, ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను కూడా కోల్పోవాల్సి వస్తుందన్నారు. 75 ఏళ్లుగా బీసీలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కో నాల్సిన సమయం ఇది అని, ఉద్యమం చేయక పోతే హక్కులు రావని గుర్తించాలి అని ప్రజలకు సూచించారు. జూలై 17న జరగనున్న జాగృతి రైల్‌రోకో కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నట్లు ఆర్. కృష్ణయ్య స్పష్టంగా తెలిపారు. బీసీల హక్కుల కోసం ఎవరు పోరాటం చేసినా, అందరికీ మద్దతు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిం చాలంటే ముందుగా బీసీలకు 42 శాతం రిజర్వే షన్లు అమలు చేయాలన్నారు ఆర్. కృష్ణయ్య. లేకపోతే ప్రజల మద్దతుతో పెద్ద స్థాయిలో ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశం బీసీ ఉద్యమానికి మరింత ఉత్సాహాన్ని స్తుందన్నది స్పష్టంగా కనిపిస్తోందని, పార్టీ పరమైన విభేదాలను పక్కన పెట్టి, హక్కుల కోసం ఒకే తాటిపైకి వచ్చే ప్రయత్నానికి ఇది నిదర్శనమన్నారు.

## వ్యవసాయ వ్యర్థాల నుంచి గ్యాస్

### రూ.1,500 కోట్లతో బయోప్లాంట్లు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రైతులకు ఆదాయ మార్గం కల్పించడమే కాక పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ సర్కార్ పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ తయారీ దిశగా శక్తివంతమైన అడుగు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1,500 కోట్ల వ్యయంతో 20 బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి ప్లాంట్‌కు రోజుకు 15 టన్నుల ఉత్పత్తి సామర్థం కలిగి ఉంటుందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఇలా మొత్తం రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 225 టన్నులుగా ఉంది. ఇక ఈ ప్లాంట్లకు ఏటా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి గడ్డి వినియోగించను న్నారు. తద్వారా ఉత్పత్తి చేయబోయే బయోగ్యాస్ 82,125 టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు.

అంతేకాకుండా 3 లక్షల టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 57.84 లక్షల ఎల్‌పిజి సిలిండర్లకు సమానమైన బయోగ్యాస్ ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టులను మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

వార్త

మనిషి తన ధనాన్ని బుర్రగా మార్చుకుంటే దాన్నెవరూ తస్కరించలేరు. జ్ఞానంపై పెట్టిన పెట్టుబడి ఎల్లప్పుడూ మంచి వడ్డీనే ఇస్తుంది.

న-అరిస్టాటిల్

# మాటల్లోనే 'శాంతి'!

అగ్రరాజ్యాధినేత ట్రంప్ ఉన్నట్టుండి ఇప్పుడికిప్పుడు నోబెల్ గ్రహీతనైపోవాలను కుంటున్నట్లుంది. ఒక పక్క ఇరాన్ అణ్వస్త్ర కేంద్రాలపై భీకర దాడులు ప్రారంభిస్తూనే శాంతి ప్రవచనాలు పలుకుతూ, శాంతిదూతగా అవార్డులు పొందాలనుకుంటున్నారు. ఒక పక్క అణ్వస్త్ర దాడికి మేం వ్యతిరేకమంటూనే ఇరాన్‌కు ఉన్న మూడే మూడు నంతాజ్, ఇస్ఫహన్, ఫోర్డో అణు కేంద్రాలపైకి అమెరికా దూకుడు ప్రారంభిం చింది. ఎదుటివారితో వైషమ్యాలు లేకుండా దౌత్యనీతితో పరిష్కరించుకొని శాంతి మంత్రం పఠించడం, శాంతి కోసం కృషి చేయడం శాంతికి మార్గ మని అనుకోవడం సహజం. కానీ ప్రత్యర్థి అణ్వస్త్ర కేంద్రాలను నాశనం చేయడం ద్వారా శాంతికి మార్గం ఏర్పడుతుందని నమ్మే 'శాంతిదూత'గా ట్రంప్ మిగిలి పోయారు. ఇలా 'శాంతికి' కొత్త నిర్వచనం చెబుతున్నా రన్నమాటేగా! మూడో ప్రపంచ యుద్ధం అనే ప్రస్తావన లేకుండానే అగ్రదేశాలు తమకు నచ్చిన, తాము మెచ్చే దేశాలకు అండదండలుగా ఉంటూ, వారి ప్రత్యర్థులను హతం చేసే పనుల్లో చేయూత నందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమయంలో మూడో ప్రపంచ యుద్ధం మూకుమ్మడిగా రానక్కర్లేదు. ఆదిలో కొన్ని సమూహాలు తలపడితే, వెను వెంటనే మిగిలిన దేశాలు వారి ఇచ్ఛ మేరకు వచ్చి కలుస్తాయి. ఇదోరకం యుద్ధ తంత్రం. కానీ అమెరికా ఏకపక్షంగా యుద్ధానికి ఉరకలు వేస్తుంది. ఇరాన్‌తో తన చమురు వాణిజ్య బంధాలను నిలబెట్టుకునే రీతిలో చైనా ఆయుధ సంపత్తిని సమకూరుస్తోంది. ప్రాంతీయ ఆధిపత్యాల కోసం ఈ యుద్ధం పర్యవసానం ఊహించడం కష్టమే మరి!. ఇరాన్ లొంగిరాకపోతే నేరుగా యుద్ధమే శరణ్యమని, ఖోమైనీ తల ఎగిరిపోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిస్తే, అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ ప్రతి హెచ్చరికలు చేసుకుం టున్నాయి. తాను యుద్ధానికి తెగబడుతూనే శాంతి నెలకొల్పడం ఇరాన్ చేతిలోనే ఉందని ట్రంప్ ఒకటికి పదిసార్లు వేదికల మీద బహిరంగంగానే ప్రకటించారు. తాజాగా అమెరికా మాత్రమే చేయగలదన్న సాహసాన్ని ట్రంప్ అమల్లోకి తెచ్చేసారు. బంకర్ బ్లస్టర్ బాంబులతో దాడి మొదలు పెట్టి ఇరాన్‌కు అణ్వాయుధ తయారీకి ఏమాత్రం అవకాశం లేకుండా దెబ్బతీసారు. ఇరాన్‌పై ఇలాంటి హింసాత్మక దాడిని ట్రంప్ చరిత్రాత్మకంగా ప్రకటించుకోవడం విశేషం. విభిన్నమైన పరిస్థితుల మధ్య ట్రంప్ ప్రపంచానికే పెద్దన్న పాత్ర వహించాల్సి ఉండగా, కేవలం ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహుకి మాత్రమే అగ్రజుని పాత్ర పోషించారు. భారత్ పాకిస్థాన్ ల మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందానికి తానే మధ్యవర్తినని ప్రకటించుకుని, ఆ మాత్రం దానికే నోబెల్ అవార్డుకు పాకిస్థాన్ నుంచి ప్రతిపాదన చేయించుకో గలిగారు. అదే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి జపమేదీ లేకుండానే భీకర దాడులకు పురికొల్పారు. అణుయుద్ధం రాకూడదంటూనే మరో భిన్నమైన విచిత్రమైన ఆలోచనకు ట్రంప్ శ్రీకారం చుట్టారు. మరోసారి తూచ్.. భారత్ పాక్‌లకు మధ్య కాల్పుల విరమణ తనదేమీ మధ్యవర్తిత్వ పాత్ర ఏమీ లేదంటూనే దానిని పురస్క రించుకునే తనకు నోబెల్ బహుమతి రావాలని కలలు కంటున్నారు. ఇదేమి మాట తడబాటు కాదు. లేనిపోని పెద్దరికాన్ని తెచ్చిపెట్టుకోవడం. ఇదే సందర్భంగా నెటిజెన్‌లు ట్రంప్‌కు తలంటే పనిలో పడ్డారు. భారత్-పాక్ మధ్యవర్తిత్వం అంటూ ఇక చెప్పుకునే పరిస్థితి లేక భారత్ ప్రధాని హెచ్చరికతో 'యూ టర్న్'కు దిగిన ట్రంప్‌కు ఈ క్రెడిట్ పోయినట్లే. ఇక ఇరాన్ ఇజ్రాయెల్ లలో ఓ వర్గాన్ని బెదిరించి లొంగదీసుకోవాలన్న ట్రంప్ పాచిక పారలేదు. పైగా తొందరపాటు నిర్ణయంతో ఇరాన్‌పై దాడులకు దిగినందున ఈ యుద్ధాన్ని కూడా తన శాంతి సందేశాల ఖాతాలో వేసుకోవడం కుదిరే పనికాదు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడమూ, లేని విషయాలను, విజయాలకు తనకు అపాదించుకుని గర్వించడమంటే - అవేమీ నోబెల్ బహుమతికి ప్రాతిపదికలు కాదు. అందుకేనేమో! ఈ ప్రతిష్టాత్మక బహుమతి తనకు రాసిపెట్టి లేదేమోనని నిర్వేదం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పైగా దశాబ్దాలుగా యుద్ధరంగంలో తలపడుతున్న కాంగో, రువాండాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు యత్నిస్తు న్నట్లు చెప్పుకున్నారు. సెర్బియా, కొసావో మధ్య ఘర్షణలకు చరమ గీతం పాడేసానని, ఈజిప్టు, ఇథియో పియాల మధ్య శాంతి కొనసాగుతోందని ఐనా, నోబెల్ తన శాంతి ప్రయత్నాన్ని గుర్తిస్తుందో లేదోనన్న ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ తన రాజనీతిజ్ఞతలో, వ్యూహాత్మక ముందుచూపులో వ్యవహరించి భారత్‌లో దౌత్యపర చర్చలు జరిపారని రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చకుండా చూపిన శాంతిప్రియుడు ఐనందున నోబెల్ పురస్కారం ఇవ్వాలని పాకిస్థాన్ ప్రతి పాదించింది. ట్రంప్‌లోని ఆకాంక్షలను నెరవేర్చేందుకు మునీర్ నడుం కట్టినందునే మునీర్‌ను ట్రంప్ ప్రశం సలతో ముంచెత్తారు. పాకిస్థాన్ ప్రతిపాదన దురదృష్టక రమని, ఐరాసలో పాక్ రాయబారిగా పనిచేసిన మలీ హాలోది విమర్శించారు. ఇదెంతో దయనీయమైన ప్రతి పాదన అని పాకిస్థాన్ జర్నలిస్టు జాహిద్ హుస్సేన్ గొంతెత్తారు. ప్రపంచ శాంతికి కృషి చేసే వారికిచ్చే నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ కివ్వాలని ప్రతిపాదిం చడంలో పాక్ వివేకమేమిటో తేటతెల్లమౌతోంది!.

> సజ్జనుడు కిందపడ్డప్పటికీ బంతిలా మళ్లీ పైకి లేస్తాడు. మూర్ఖుడు కిందపడితే మట్టి ముద్దలా లేవలేక అణగిపోతాడు.
>
> వివేకానందుడు



> ఆత్మవిశ్వాసంతో కృషి చేసే మనిషి అందుకోలేని శిఖరాలు లేవు.
>
> ఆస్కార్‌వైల్డ్



# ప్రజావాక్కు



## ఉచిత పథకాల కంటే ఉపాధి మేలు

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రాజకీయ పార్టీలవారు లబ్ధి కోసం ప్రజలను మభ్యపెట్టి ఉచిత పథకాలను ప్రవేశపెట్టే పద్ధతి ని అవలంబిస్తున్నారు. దీనివలన ప్రజలు ఈ ఉచిత పథ కాలకు ఆకర్షితులై తమజీవనస్థితులకు దూరమైపోతున్నా రు. అలాగే ఈ పథకాల వలన ప్రభుత్వం మేలు జరగడ మే తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదు. కావున ఈ ఉచిత పథకాలకు స్వస్తి చెప్పి ప్రజలకు ఉపయోగపడే పరిశ్రమ ఏర్పాటుచేసి, ఉపాధి అవకాశాలు వచ్చేటట్లుగా చేయడం, అలాగే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటివి కల్పిస్తే ప్రజలు పురోగ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి. ఈ విషయాలపై ప్రభుత్వాలు పునరాలోచన చేస్తే బాగుంటుంది.

- కె. అన్నారావు, రాజాం, విజయనగరం

## యోగాసనాలు ఆరోగ్యానికి మంచివి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోవిశాఖపట్నంలో కొన్నిలక్షల మంది తో శ్వేతవస్త్రాలు ధరించి పరిశుభ్రంగా కనిపిస్తూ దగదగా మెరిసిపోతూ కొన్నియోగాసనాలు భారతదేశ ప్రధాన మంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ప్రజలను భారతదేశ సనాతన సంప్రదాయాల పట్ల అంతరించిపోతున్న ఆచా రాలుపట్ల సద్భావం కలిగేలా ఒక ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజుల్లో ప్రజలందరూ ఎన్ని ఉచితపథకాలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ, జబ్బులకోసం, వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసండబ్బులు సంపాదించడానికి ఆరా టపడుతున్నారు. ఇలాంటి ఈనేపథ్యంలో ఒకరితో ఒకరు పోటీ పడుతూ విపరీతమైన ఒత్తిడికి గురి అవుతున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## యుద్ధాలు ఆగిపోవా?

ఆధిపత్యమే ఆయువుగా సాగుతున్న పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తుంది. అదే ఈ శత సంవత్సరాలలోని విషాదం చూడండి ఆసియా కేంద్రంగానే ఈ పోరాటం సాగుతుంది. ఎందుకు సహజ వనరుల మీద ఆధిపత్యం కోసం చమురు నిక్షేపాలుకోసం చిన్న దేశాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకోకూడదు మరొక వైపు ఉక్రెయిన్ లాంటి దేశాలు గత సంవత్సర కాలంగా లేదా అంతకు మించి యుద్ధంలో సర్వస్వం కోల్పోయాయి.

- భారత అవినాష్, జనగామ

## స్థానికులకే ఉద్యోగావకాశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలం చేకూర్చే మార్గాల్లో ప్రధానమైనది పారిశ్రామికరంగం. పెట్టుబడులు ఆకర్షించేందుకు అనువైన వాతావరణం కల్పించడంలో పారిశ్రామిక సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. ఇటీవలి కాలంలో కొన్ని రాష్ట్రాలు నిర్వహించిన "ఇన్వెస్టర్స్ సమ్మిట్"లు గణనీయమైన ఫలితాలు ఇచ్చిన ఉదాహరణలు మనకు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి తగిన సదుపాయాలు అందుబాటులో లేవని పలుమార్లు పరిశ్రమలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే అత్యవసరంగా మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయాలి. రోడ్లు, విద్యుత్, నీరు, పారిశ్రామిక పార్కులు వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. అంతర్జాతీయ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు పరిశ్రమలు స్థాపించేందుకు ఉత్సాహం చూపేలా పన్నురాయితీలు, భూముల కేటాయింపు, శిక్షణా కార్యక్రమాల్లాంటి ప్రోత్సాహక పథకాలు ప్రవేశపెట్టాలి. కనీసం 70 శాతం ద్యోగాలు స్థానికులకే కల్పించాల్సి ఉంది. దీనిపై ఒక స్పష్టమైన పారిశ్రామిక విధానం రూపొందించాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## సంతోషం సగంబలం

మనం ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడానికి ప్రయత్నించాలి. సంతోషం సగంబలం అంటారు. ఉమ్మడి కుటుంబాలకు మద్దతు పలకాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. ఆర్థిక, ఇతర సమస్యలతో మనిషి కుదేలవుతాడు. దాంతో ఆనందం ఆవిరవతుందంటే అతిశయోక్తికాదు. ఏదిఏమైనా చిరునవ్వుకు, ఉద్యానవనానికి మనం దూరం కాకూడదు. వ్యసనాలకు స్వస్తి పలుకుతూ సమయానికి తింటూ జీవితంలో కొన్ని నియమాలు తు.చ తప్పకుండాపాటించాలి. ఎనిమిది గంటల నిద్ర అరగంట నడక, పావుగంట వ్యాయామం, పదినిమిషాలుయోగా, ధాన్యం, ఐదు నిమిషాలు నవ్వడం ఇవి అనారోగ్యాన్ని తరిమేస్తాయి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమా నంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచా యతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామా ల్లో రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆ రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు గత ప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు.

-పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# జి-7 సమ్మిట్‌లో భారత్ పాల్గొనటం అవసరమా?

**అసలు భారత్‌ను కెనడా ప్రభుత్వం ఆహ్వానిస్తుందా లేదా అన్న మీమాంసం సమ్మిట్ ప్రారంభం కాకమునుపు జరిగినా ఎట్టకేలకు చివరి నిముషంలో ప్రధా నిని సమావేశానికి స్వాగతించటం జరిగింది. కెనడా కొత్త ప్రధానిని కలవటం ఒక్కటే మంచి పరిణామం అనుకోవాలి. అంతేకానీ ఖలిస్థాన్ ఉగ్రవాదం భారత్‌కు వ్యతిరేకంగాకెనడా దేశంలో ప్రభుత్వ తోడ్పాటుతో జరుగుతున్నప్పుడు కనీసం ప్రధాని మోడీ ఇలాంటి ఉద్యమాలను సమర్థించకూడదని కెనడా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఎలాంటి చర్యలు తలపెట్టకపోవడంతో భారత్ దేశానికి ఈ సమ్మిట్‌లో పాల్గొనటం వల్ల ఒరిగిందేమీటన్న ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి పరిస్థితులలో భారతదేశం జి-7 సమ్మిట్స్‌లో ముందు ముందు పాల్గొనే విషయాన్ని కూడా సమీక్షించుకొని సరైన నిర్ణయం తీసుకోక తప్పదేమో.**



రావులపాటి సీతారాంరావు

ప్రధానమంత్రి మోడీ దాదాపు 11000 కిలో మీటర్లు ప్రయాణం చేసి జి-7 సమ్మిట్ కెనాడా దేశంలోని కానన్‌స్కీలో పాల్గొన్నారు. ఈ సమ్మిట్ ఫలితాలు మాత్రం నిరాశాజనకంగా ఉన్నాయి. అంతర్జాతీయ సమావేశాలు కొన్ని దేశాలు గ్రూప్‌లుగా ఏర్పడి గత కాలంలో జరుపుకున్నప్పుడు ఫలితాలు, ఆ సమావేశాల్లో పాల్గొన్న దేశాలకు సంతృప్తిని కలిగించేవి. గ్లోబల్ పరిధిలో కూడా లాభాలు సమకూర్చేవి. చాలా సంవత్సరాల క్రిందట ఇండియా సారథ్యంలో అలీన దేశాల సమావేశాలు దేశాల మధ్య సంఘర్షణలను, చిన్నచిన్న విభేదాలనూ సరిదిద్దే ప్రయత్నంలో చాలా వరకు మంచి ఫలితాలనే దేశాలకు లాభాలను చేకూర్చే విధంగా పొందటం చరిత్ర గమనంలో రికార్డు అయ్యే ఉంది. కోల్డ్‌వార్ రోజుల్లో కూడా అమెరికా, రష్యా ల్లాంటి అగ్రదేశాల మధ్య రాజుకున్న నిప్పురవ్వలపై నీళ్లు జల్లి ఎంతో కొంత ఉపశమనానికి ఈ సమావేశాలు తోడ్పడేవి. ప్రస్తుతం యు.యన్.ఓ కానీ, యు.యన్. సెక్యూరిటీ కౌన్సిల్ గాని మొక్కుబడిగా దేశాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను తొలగించటంలో ప్రయత్నాలు జరుపుతున్నప్పటికిని ఫలితాలు మాత్రం శూన్యంగా మిగిలిపోవటం గమనార్హం. ఇదంతా ప్రస్తుతం ఎందుకు చర్చించుకోవాల్సి వస్తున్నదంటే ఆర్భాటంగా జరిగిన కెనడాలోని మొన్నటి జి-7 సమ్మిట్ చేసిందేమీ లేదు అని చెప్పటానికే. ఈ మధ్య కాలంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య పహల్గాం నేపథ్యంలో జరిగిన సంఘర్షణలూ, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న ప్రపంచ యుద్ధాన్ని తలపించేటట్లు ఉన్న నిత్య సంఘర్షణల వైనం, పర్యావలోకనం చేసుకుంటున్నప్పుడు మరో ప్రపంచయుద్ధానికీ, ఈ సంఘర్షణలు దారితీస్తున్నాయా అన్న అనుమానానికి తావిస్తున్నాయి. జి-7 గ్రూప్‌లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యు.కెతోపాటు అమెరికా దేశాలు ఉన్నాయి. ఇది ఒక విధంగా రాజకీయ, ఆర్థిక విధానాల సమీక్షకూ, సర్దుబాట్లకు ఏర్పాటయిన సమ్మిట్. యూరోపియన్ యూనియన్ కూడా ఈ సమావేశాలకు, ఇండియాతోపాటు ప్రత్యేక




ఆహ్వానం మేరకు హాజరు అవుతుండటం విశేషం. కెనడా, ఇండియాల మధ్య నిజ్జార్ కేసు విషయంలో తలెత్తిన విభేదాలు, ప్రధాని మోడీ ప్రత్యేకంగా కెనడా కొత్త ప్రధాని మార్క్‌కార్నీని కలిసి చర్చించటానికి తోడ్పడ్డాయి. ఇండియా, కెనడా హైకమిషనర్లను మళ్లీ నెలకొల్పటానికి ఈ సమావేశం ఉపయోగపడింది. కానీ కెనడా ప్రభుత్వం ఖలిస్థాన్ ఉద్యమకారులు, భారతదేశానికి వ్యతిరేకంగా చేస్తున్న విద్రోహ చర్యలు అణచివేసే విషయంలో ఎలాంటి చొరవ చూపకపోవడం ఒక రకంగా అసంతృప్తిని మనదేశానికి కలిగించిన వాస్తవాన్ని కప్పిపుచ్చలేం. గ్లోబల్ ట్రేడ్‌ను అతలాకుతలం చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం టారిఫ్ విధానాలను ఈ సమ్మిట్ సరిచేయలేకపోయింది. డోనాల్డ్ ట్రంప్, రష్యా, చైనాల విషయంలో దౌత్యపరంగా అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరితో పాటు ఉక్రెయిన్ గనులను ఆక్రమించుకొనే ఎత్తుగడలను ఎత్తిచూపలేకపోయింది. చైనా అవకాశవాదాన్ని, పాకిస్థాన్‌ను ఏకపక్షంగా సమర్థించే వైఖరి విషయంలో కూడా ఎలాంటి చర్య కానీ, రిజల్యూషన్ ద్వారా తప్పు పట్టటం కానీ జి-7 సమ్మిట్ చేయలేకపోయింది. అంతెందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యలోనే సమావేశాన్ని వదిలి వెళ్లటం కానీ, ఏకగ్రీవ తీర్మానాన్ని త్రోసి పుచ్చి సంతకం చేయకుండా నిష్క్రమించటాన్ని ఈ సమ్మిట్‌లో పాల్గొన్న అగ్రదేశాలు ఆపలేకపోయాయి. పేరుకు అగ్రరాజ్యాల సమ్మిట్ కానీ నిష్క్రియాపర్వానికి మాత్రమే మరొకసారి ఈ సమావేశం తెరతీసినట్లయింది. తూతూ మంత్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, క్రిటికల్ మినరల్ సప్లయి చైన్స్, వైల్డ్‌ఫైర్ ప్రివెంషన్, ట్రాన్స్‌నేషనల్ రిప్రెషన్ లాంటి విషయాల్లోనే, జాయింట్ స్టేట్‌మెంట్ లేకుండా చైర్స్ సమ్మరీ పేరుతో ఒక ప్రకటన మాత్రమే ఈ సమ్మిట్ వెలువరించింది. అంతెందుకు టెర్రరిజం విషయంలో కూడా భారత్ ఆశించినట్లు బహిరంగ సమర్థన చేయలేకపోయింది. ఇలాంటి నేపథ్యంలో భారత్ ఈ సమ్మిట్‌లో మెంబర్ కాకపోయినా, ఆహ్వానించారని పాల్గొనటం, సమంజసమా అన్న చర్చ కూడా మొదలైంది. అసలు భారత్‌ను కెనడా ప్రభుత్వం ఆహ్వానిస్తుందా లేదా అన్న మీమాంసం సమ్మిట్ ప్రారంభం కాకమునుపు జరిగినా ఎట్టకేలకు చివరి నిముషంలో ప్రధానిని సమావేశానికి స్వాగతించటం జరిగింది. కెనడా కొత్త ప్రధానిని కలవటం ఒక్కటే మంచి పరిణామం అనుకోవాలి. అంతేకానీ ఖలిస్థాన్ ఉగ్రవాదం భారత్‌కు వ్యతిరేకంగాకెనడా దేశంలో ప్రభుత్వ తోడ్పాటుతో జరుగుతున్నప్పుడు కనీసం ప్రధాని మోడీ ఇలాంటి ఉద్యమాలను సమర్థించకూడదని కెనడా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఎలాంటి చర్యలు తలపెట్టకపోవడంతో భారత్ దేశానికి ఈ సమ్మిట్‌లో పాల్గొనటం వల్ల ఒరిగిందేమీటన్న ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి పరిస్థితులలో భారతదేశం జి-7 సమ్మిట్స్‌లో ముందు ముందు పాల్గొనే విషయాన్ని కూడా సమీక్షించుకొని సరైన నిర్ణయం తీసుకోక తప్పదేమో.!

# కృత్రిమ మేధతో ప్రయోజనమా!సమస్యలా?

మేకిరి దామోదర్

మనిషి బుద్ధిజీవి, సృజన కారుడు కూడా. మనిషిలోని సుగుణాల్ని యంత్రానికి ఆపాదిస్తే.. యంత్రానికి వేగం ఎక్కువ, ఖచ్చితత్వమూ ఎక్కువే. అలా పరిమితంగా అయినా సరే, తెలివితేటలు జోడిస్తే? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆలోచన ఇలా వచ్చింది. తనకు ఎదురైన అనుభవాలు, తనకున్న జ్ఞాపకాల ఆధారంగా మనిషి నిర్ణయాలు తీసుకుంటాడు. కానీ యంత్రానికి అనుభవాలు జ్ఞాపకాలు ఉండవు. 'డాటాయే సర్వస్వం'. ఎంత డాటా ఇవ్వగలిగితే, అంత ఖచ్చితత్వం సాధ్యం. అందులోనూ 'డీప్ లెర్నింగ్' టెక్నాల జీతో యంత్రాల విశ్లేషణ సామర్థ్యం బాగా పెరిగిపోయింది. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్.. ఏ భాషనైనా చదివి అర్థం చేసుకునే శక్తినీ, ఏ గొంతు నైనా విని విషయాన్ని ఆకళింపు చేసుకోగలిగే నైపుణ్యాన్ని ప్రసాదించింది. కంప్యూటర్ విజన్ కు తోడు ఇంకో అడుగు ముందుకేసి ఏఐకి సహాయంగా కొత్తకొత్త టూల్స్ తయారు చేసుకుంది. ఇంకేముంది సాంకేతికత చేయలేని అద్భుతమంటూ ఉంటుందా!. ఇలా నేడు కృత్రిమ మేధ (ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భాగస్వామ్యం ఎంతగానో పెరిగిపోతోంది!. ప్రస్తుతం ప్రపంచానికి ప్రయోజనమనీ కొందరు, ఇంకొందరు ప్రమాదమనీ భయపెడుతున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) కొత్త అవకాశాలకుదారులు చూపుతున్న సాంకేతిక పరిజ్ఞానం. ఇది ఇప్పటికే పలు సంస్థలకు సులువుగా పనిచేసి పెడుతూ, చాలామంది ఉద్యోగాలకు ఎసరు పెడుతుందని పలువురు గ్రాడ్యుయేట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ తమ ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీస్తుందని, 70 శాతం మంది తమ అభిప్రాయాన్ని తెలిపారు. సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన శాంపిల్ సర్వేలో ఈ విషయం తేలింది. అలాగే మరికొందరు ఈ ఏఐ విషయంలో సానుకూల అభిప్రాయాన్ని వెల్లడించారు. ఏఐలేదా ఆటోమేషన్ టూల్స్‌లో నైపుణ్యం పొందడం ద్వారా తమ కెరీర్ అవకాశాలు మెరుగుపడటానికి దోహదం చేస్తుందని మరికొందరు అంటున్నారు. సీఎఫ్ఏ అనేది ప్రపంచ పెట్టుబడి నిపుణుల సంఘం. ఇది ఇటీవలే గ్లోబల్ గ్రాడ్యుయేట్ అవుట్ సర్వే 2025 విడుదల చేసింది. తొమ్మిదివేల మందికి పైగా తాజా గ్రాడ్యుయేట్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత గ్రాడ్యుయేట్లలో ఏఐ ఆటోమేషన్ టూల్స్ భయం ఎక్కువగా కనబడుతుంది. ఇవి తాము కోరుకున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చాలా దెబ్బతీసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50శాతం మందికి పైగా తాము ఏఐను



ప్రభావితంగా ఉపయోగించగలమని విశ్వాసాన్ని వెల్లడించారు. సంబంధిత సాఫ్ట్‌స్కిల్స్‌ను కలిగి ఉండటమే కాకుండా ఏఐ నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగ మార్కెట్లో మంచి అవకాశాలు లభిస్తాయని 56శాతం మంది విశ్వసిస్తున్నారు. ఏఐ కెరీర్‌లో స్థిరమైన వృద్ధి, ఆసక్తికరంగా స్థిరమైన ఎదుగుదల కనిపిస్తున్నది. గత ఏడాది ఇది 59 శాతం నుంచి ఈఏడాది 63శాతానికి పెరగటం గమనార్హం. "ఈ తరానికి ఏఐ ఇకపై కేవలం ఒక ఆప్షన్ కాదు. వృత్తిపరంగా ఎదుగుదలకు, సంబంధిత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి దాని ప్రాముఖ్యతపై వారు అవగాహన కలిగి ఉన్నారు' అని భారత్ సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సీనియర్ కంట్రీ హెడ్ అరాటి పోర్వాల్ అభిప్రాయపడ్డారు. గ్రాడ్యుయేట్లలో కెరీర్ ప్రాధాన్యతలకు సంబంధించి వరు సగా మూడేళ్ల ఆర్థిక రంగమే అగ్రస్థానంలో ఉన్నది. ఈ రంగంపై 38శాతం మంది చాలా విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఐటి 32 శాతం, విద్య 21శాతం వంటి రంగాలు ఉన్నాయి. 'కాలంతో పాటు ఆర్థిక రంగం అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త వెర్షన్‌లో, జనరేటివ్ ఏఐ బ్లాక్ చైన్ మొదలైన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి టెక్‌ఎనేబుల్డ్ ఫైనాన్స్‌పై దృష్టి కేంద్రీ కరించబడింది. ఈ అభివృద్ధి చెందుతున్న రంగానికి విద్యార్థులు సంబంధిత శిక్షణను పొందటం తప్పనిసరి అని డివై పాటిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెప్పారు. 'గ్రాడ్యుయేషన్ పూర్తయినవెంటనే ఉద్యోగం కావాలి' కానీ తమ గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన వెంటనే తాము ఉద్యోగాన్ని కోల్పోతున్నట్టు 40 శాతం మంది గ్రాడ్యుయేట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి సర్టిఫికేషన్లు కెరియర్ వృద్ధికి దోహదం చేస్తాయని 68శాతంమంది విశ్వ సించారు. సర్టిఫికేషన్ నేరుగా తమ ఉపాధి పొందే సామర్థ్యాన్ని ఆదాయాలను మెరుగుపరచాయని నివేదిక వివరించింది. ఏఐ అనేది కొంతమందికి ఆందోళనను, మరి కొంత మందికి కొత్త ఆశను కలిగిస్తున్నది. అయితే, ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం వినియోగించుకునే విధానాన్ని బట్టిదాని ఫలితాలు ఆధారపడి ఉంటాయని నిపుణులు మేధావులు చెప్తున్నారు. ఏఐ రాకతో పలు టెక్ కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగులను తొలగిస్తున్నాయనీ, రాబోయే కాలంలో దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశంఉన్నదని ఇప్పటికే పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలనీ, ఏఐ విపరీత వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అందుకే కొన్ని పరిమితులూ అవసరం. అలా అని ప్రయోజనం, ఇబ్బందులూ రెండింటిని ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు మేధోపరమైన సమస్యలు ఎదురు కావచ్చు, చట్టపరమైన తలనొప్పులు వచ్చినప్పుడు ఎవరిని బాధితుల్ని చేయాలనేది జవాబు లేని ప్రశ్న. ఈ కృత్రిమ మేధ అనే కాదు, ఏ పెనుమార్పు ఒంటరిగా రాదు. వస్తూ వస్తూ తన వెంట వివాదాలనూ, ప్రయోజనాలను మోసుకొస్తుంది. కొంత కాలానికి గొడవలు సద్దుమణుగుతాయి. మార్పు స్థిరపడిపోతుంది. ఏఐకి, కృత్రిమ మేధకు ఈ సూత్రమే వర్తిస్తోంది. ఏది ఏమైనా ఒక్కటి మాత్రం నిజం. మనిషిని మింగే శక్తి ఏ సాంకేతికతకూ లేదు. మనిషే కోరి కోరి ఆ టెక్నాలజీ నోట్లో తలపెడితే తప్పించి!

# ఒబిసిల పోరుగర్జనతో జంకుతున్న పార్టీలు!

డాక్టర్ సంగని మల్లేశ్వర్

స్వపరిపాలన అంటే ఒక ఆధిపత్య వర్గంపోయి ఇంకో ఆధిపత్య వర్గం రావడం కాదు, రాష్ట్రం వస్తే సామాజిక న్యాయం జరుగుతుందని నమ్మి బలంగా కొట్లాడిన బడుగులకు రిజర్వేషన్లు లేని కారణంగా ఫలాలు అందలేదని, బిసిల రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఢిల్లీ కేంద్రంగా బిసి సంఘాల జాతీయ నేతల ఆధ్వర్యంలో ఒబిసిల పోరుగర్జన దేశంలోని అన్ని పార్టీలను అప్రమత్తం చేసిందనే భావించాలి. దాని ఫలితంగా దశాబ్ద కాలంగా జాప్యం చేస్తూ కులగణనపై ఊసెత్తని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలనీ బిజెపి ప్రభుత్వం నిర్ణయించడం కనువిప్పు కల్పించిందనే అభిప్రాయం అందరిలో నెలకొంది. ఎన్నికల ముందు జాతీయ కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్టుగానే తెలంగాణలో రేవంత్ సీఎంగా కులగణన చేసి, విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపి తన ఔదార్యాన్ని చాటారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో రేవంత్ నిర్విరామంగా కృషి చేస్తూ రాష్ట్రంలో అన్ని కులాలు, భిన్న వర్గాల వారికీ సైతం సమన్యాయం జరిగేలా సామాజిక తెలంగాణగా తీర్చిదిద్దే ప్రయత్నం నిర్విరామంగా కొనసాగుతున్నది. రెండవ దఫా మంత్రివర్గ విస్తరణలో ఓసీల ఉసెత్తకుండా ఎస్సి, బీసీలకు ఇవ్వడం శుభసూచకం. ఇప్పటికే కాంగ్రెస్ అధినేత రాహుల్ ఒబిసిలను పీసీసీ అధ్యక్షులుగా నియమించి తన నిబద్ధతను చాటుకున్నారు. కులగణన జరిగితే ఏమివస్తది అన్న వ్యతిరేకులకు ప్రభుత్వ పరంగానే కాకుండా పార్టీ పరంగా కూడా కులగణనతో ఆయా వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యత పెరుగుతుందన్న నానుడి మంత్రివర్గ విస్తరణతో రూఢి అయింది. రోజూ ప్రెస్‌క్లబ్ లో మేధోవేదికల్లో బిసి బహుజన కులాల గురించి మాట్లాడే వాళ్లంతా ఆయా పార్టీల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన దాఖలాలు ఎక్కడ కన్పించలేదంటే అతిశయోక్తి కాదు. సమాజంలో 50 శాతం పైగా ఉన్న బిసిలకు ఎప్పుడు అన్యాయం జరిగింది. పార్టీని అధికారంలోకి తేవడానికి దోహదపడ్డ బిసిలకు తెలంగాణాలో కులగణన చేసి కాంగ్రెస్ రోల్‌మోడల్‌గా నిలిచింది. గరీబీ అటావో అన్న ఇందిరా నినాదంతో బిసి, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ వర్గాలకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. నాడు దళితుల జీవితాల్లో మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఏలా జ్యోతులు వెలిగించారో, బిసిలకోసం మహాత్మా జ్యోతిరావు ఫూలే ఎలా వెలుగులు తెచ్చారో నేడు రాహుల్ తీసుకున్న కులగణన ద్వారా బడుగుల జీవితాల్లో కాంతిరేఖ అవుతుందనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఇప్పటివరకు దైవాంశ సంభూతులమన్నట్లు కొంత మంది మాత్రమే పాలించేవారు. అటువంటిది ఇంట గెలిచి రచ్చ గెలవాలని నిన్న జరిగిన మంత్రి వర్గ విస్తరణ ఫలితం చెరగని ముద్రవేసింది. దేశంలో కులగణన రోల్ మోడల్‌గా నిలిచినందున కులగణనకు జై కొట్టిన




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇక్కడ పార్టీ అధ్యక్షున్ని బిసిని నియమించే ప్రయత్నం ముమ్మరం చేసింది. జంతర్ మంతర్ వేదికగా బీసీ సంఘాల మహా ధర్నాకు వచ్చినఆదరణ చూసి, స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించినప్పుడు నోరుమెదపని కెసిఆర్ తనయ భవిష్యత్ అంతా ఒబిసిలదే అంటూ సామాజిక న్యాయం నినాదం అందుకున్నది. జాగృతి అధినేత్రి 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామని, మరోమారు నయవంచన చేసే ప్రయత్నం జరుగుతుంది. ఎందుకంటే తమ్మినేని వీరభద్రం గతంలో బిసి సబ్‌ప్లాన్ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి అటకెక్కించిన సంగతి మరచిపోలేము కదా? ఉత్తరప్రదేశ్‌లో యాదవేతర, జాతవేతర బహుజన కులాలతో సామాజిక సమీకరణ చేసిన బిజెపి నాయకత్వం, మోడీ, అమిత్ షా ద్వయం ఇక్కడ మాత్రం వెనుకడుగువేస్తే భవిష్యత్ క్షమించదు. కానీ, దేశంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు కులగణన తొలిమెట్టు అయ్యింది. మేము సగం మాకు సగం అన్న నినాదంతో సామాజిక తెలంగాణ దిశగా అడుగులు వేస్తుంది. కులగణనకు కట్టుబడి ఉన్నామని రాష్ట్రవ్యాప్తంగా గణాంకాలు తీసి, శాసనసభలో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై తీర్మానం చేసి చేతులు దులుపుకోలేదు. మొన్న జరిగిన ఐదు ఎమ్మెల్సీ లలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన కాంగ్రెస్ పార్టీ అదే పట్టుదల, అదే సంకల్పంతో మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించి సునామీ సృష్టించింది. పార్లమెంట్లో చట్టబద్ధత సాకుతో స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు తేలకముందు ఎన్నికలకు వెళ్ళితే కాంగ్రెస్ అభాసుపాలు అయ్యే ప్రమాదం ఉంది. అయితే స్థానిక సంస్థల్లో ఆయా రాష్ట్రాలకు పెంచడం, తగ్గించడం భారత రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది. ఇక్కడ ఏమి తేడా వచ్చినా డేగ కళ్లతో ఎదురుచూస్తున్న ప్రత్యర్థులు బలపడే ప్రమాదం లేక పోలేదు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల రాష్ట్రంలో 119 సీట్లలో అధికార, ప్రతిపక్ష పార్టీలలో ఉన్న బీసీ అభ్యర్థులు 19 మంది మాత్రమే. 10శాతం కూడా లేని సామాజిక వర్గం ధనబలంతో బిసిలను విడదీసి 69 సీట్లలో ఆధిపత్యాన్ని కొనసాగించారు. కులగణన ఫలితం రాహుల్ కమిట్మెంట్ అనే భావం అందరిలో నెలకొంది. మేము ఏమైనా తక్కువ తిన్నామా అంటూ బిజెపి కులగణన గెజిట్ విడుదల చేసి కార్యాచరణ ప్రారంభించింది. అన్ని పార్టీలకు మనుగడ ఉండాలంటే ప్రజా ప్రాతినిధ్య ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఆయా సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించి, పార్టీ సంస్థాగత పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో 42శాతం అమలు చేయాలి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను దక్కించుకోవడానికి ఓబిసి సంఘాల ఢిల్లీ మహాధర్నాలో సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొని వారి చిత్తశుద్ధిని చాటారు. నాడు బిసి సంఘాలు మహాధర్నాకు రావాలని కోరినా స్పందించని బిజెపి, బీఆర్ఎస్ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. కల్వకుంట్ల కవిత రైల్ రోకో పిలుపు కూడా అందులో భాగమే. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి 2000 మంది ఒబిసి ప్రతినిధులు రిజర్వేషన్లు అమలు చేయాలనీ తీర్మానం చేయడంతో భయపడి కులగణనకు సానుకూల ప్రకటన చేసిందనేది నిర్వివాదాంశం. అయితే కులగణనతో పాటు అన్ని రంగాల్లో మన వాటా మనకు దక్కినప్పుడే సామాజిక న్యాయం దక్కిందని భావించాలి. విద్య ఉద్యోగ రిజర్వేషన్స్ అమలు కావాలంటే ఒబిసిలు ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉంది.

# ఖొమేనీ వారసులుగా ముగ్గురు సీనియర్ మతపెద్దలు!

**టెహ్రాన్,జూన్ 22:** ఇరాన్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. దేశ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ తన వారసుల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు సీనియర్ మత పెద్దల పేర్లను ఆయన తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, ఈ వారసుల జాబితాలో ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీకి చోటు దక్కకపోవడం గమనార్హం. ఇరాన్ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన ప్రస్తుత తరుణంలో, అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో ఖమేనీ ఈ అనూహ్యమైన చర్య తీసుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న తన పాలన ముగింపునకు ఆయన సిద్ధమవుతున్నారనడానికి సంకేతమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్ అత్యున్నత పదవికి తన వారసులుగా ముగ్గురు సీనియర్ మత పెద్దల పేర్లను ఖమేనీ ప్రతిపాదించినట్లు అమెరిక ఆంగ్లపత్రిక కథనం ప్రచురించింది. గతంలో, దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీని ఖమేనీ వారసుడిగా ప్రచారం జరిగినప్పటికీ, హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణంతో ఆ ఊహాగానాలకు తెరపడింది. ఇప్పుడు, ఖమేనీ సొంత కుమారుడు, తెరవెనుక కీలక వ్యక్తిగా భావిస్తున్న మొజ్తబా పేరు కూడా జాబితాలో లేకపోవడం గమనార్హం. ఇది మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న తన పాలన ముగింపునకు ఖమేనీ సిద్ధమవుతున్నారనడానికి

## జాబితాలో కుమారునికి దక్కనిచోటు



సంకేతమని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వస్తున్న తీవ్ర బెదిరింపుల నేపథ్యంలో ఖమేనీ అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఒక రహస్య భూగర్భ బంకర్లోకి వెళ్లినట్లు సమాచారం. అన్ని రకాల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లను నిలిపివేసి, కేవలం ఒక నమ్మకమైన సహాయకుడి ద్వారా మాత్రమే సైనిక కమాండర్లకు సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇజ్రాయెల్ దాడుల్లో ఐఆర్జీసీ ఉన్నతాధికారులు మరణించిన నేపథ్యంలో, తన హత్యకు కుట్ర జరగవచ్చనే ఆందోళనతోనే ఖమేనీ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అర్థమవుతోంది. మొజ్తబా ఖమేనీకి వారసుడిగా అవకాశం దక్కకపోవడం వెనుక, రాజవంశ పాలనను ఖమేనీ వ్యతిరేకిస్తున్నారనే వాదనలకు బలం చేకూరుతోంది. కుటుంబ సభ్యులకు అధికారం కట్టబెట్టడంకంటే, ఇస్లామిక్ రిపబ్లిక్ మతపరమైన, సంస్థాగత పునాదులను కాపాడటమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వారసుల ఎంపిక, సైన్యంలో కీలక మార్పుల ద్వారా, భవిష్యత్ అసరతను నివారించి, నాయకత్వ కొనసాగింపునకు ఖమేనీ మార్గంసుగమం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ట్రంప్, నెతన్యాహూల నుంచి వచ్చిన పరోక్ష హెచ్చరికలు ఖమేనీలో ఆందోళనలను మరింత పెంచినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఇరాన్ భవిష్యత్తుపై తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

## ప్రాణహాని భయంతో రహస్యబంకర్లోకి ఖొమేనీ..

**టెహ్రాన్,జూన్ 22:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ బంకర్లో దాగిన్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ను ఆయనను హత మార్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలో ఆయన ప్రాణాలకు ముప్పున్న నేపథ్యంలో బంకర్లోకి వెళ్లిపోయారు. అయితే, ఎవరూ అనుకోని విధంగా ఆయనకు ఏమైనా హాని జరిగితే తన వారసుడిగా ఎవరు బాధ్యతలు స్వీకరించాలో నిర్ణయం తీసుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ముగ్గురు సీనియర్ మతాధికారుల పేర్లను ఖరారు చేసినట్లు పేర్కొంది. అలీరేజా అరాఫీ, అలీ అస్గర్ హెజాజీ, హాషీం హుస్సేని బుషారీల్లో ఎవరో ఒకరు సుప్రీం లీడర్గా బాధ్యతలు స్వీకరించేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఖమేనీ ఎక్కడ ఉన్నాడో తెలియకుండా వివరాలో గోప్యంగా ఉంచాలని తనకు దగ్గరలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అత్యవసర యుద్ధ ప్రణాళిక నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. సుప్రీం లీడర్గా ఖమేనీ వారసుడిగా మోజ్తాబా ఖమేనీ పేరు సైతం వినిపించింది. తాజాగా ఆయన ఎంపిక చేసిన పేర్లలో తనయుడి పేరు కనిపించలేదు. వాస్తవానికి వారసత్వ రాజకీయాలకు ఖమేనీ పూర్తిగా వ్యతిరేకం. గతంలో కుటుంబ పాలకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలోనే స్పందించడం ప్రస్తావనార్హం. ఇదిలా ఉండగా గతంలో ఖమేనీ వారసుడిగా మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ పేరు బాగా వినిపించింది. కానీ, ఆయన గతేడాది జరిగిన హెలీకాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా ఇటీవల ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఘాటుగా స్పందించారు. ఖమేనీ ఇక బహిరంగంగా బయటకు రాలేడని బంకర్లో దాక్కొని ఇజ్రాయెల్ ఆసుపత్రులపై దాడులకు ఆదేశిస్తున్నాడని ఆరోపించారు. ఇది యుద్ధ నేరమని ఖమేనీ దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఖమేనీని లక్ష్యంగా చేసేందుకు ఇజ్రాయెల్ రక్షణ దళాలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ఇరాన్పైకి అమెరికా వదిలింది పాతకాలం టోమ్హాక్ క్షిపణులే..



**న్యూయార్కు, జూన్ 22:** ప్రపంచవ్యాప్తంగా దేశాలు సూపర్సోనిక్, హైపర్సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో పోటీ పడుతున్న ప్రస్తుత తరుణంలో, అమెరికా మాత్రం కొన్ని దశాబ్దాలుగా ఒక సబ్సోనిక్ క్షిపణిపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. అదే టోమహాక్ క్రూయిజ్ క్షిపణి. గతంలో ఇరాక్ యుద్ధంలో అమెరికా ప్రయోగించిన తొలి ఆయుధం కూడా ఇదే కావడం గమనార్హం. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి బంకర్ బస్టర్ బాంబుల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా, టోమహాక్ క్షిపణి పని తాను నిశ్శబ్దంగా పూర్తి చేసింది. సుమారు మూడు దశాబ్దాలకు పైగా అనేక యుద్ధాల్లో అమెరికా సైన్యం అత్యధికంగా విశ్వసించిన ఆయుధాల్లో టోమహాక్ ఒకటి. ఇరాక్, సిరియా, లిబియా, గల్ఫ్ దేశాలు, యెమెన్ వంటి అనేక సమస్యాత్మక ప్రాంతాల్లో అమెరికా ఈ క్షిపణిని విరివిగా ఉపయోగించింది. ప్రయోగించిన ప్రతీసారి ఇది తన లక్ష్యాలను విజయవంతంగా ఛేదించిందని నివేదికలు తెలియజేస్తున్నాయి. టోమహాక్ మిస్సైల్ను సముద్రంలోని యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి శత్రువుల భూస్థావరాలపైకి ప్రయోగించేలా రూపొందించారు. దీని తయారీ ఆలోచన 1970లలో ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో తెరపైకి వచ్చింది. జనరల్ డైనమిక్స్ సంస్థ దీనిని అభివృద్ధి చేయగా, 1983 నాటికి ఇది అమెరికా సైనిక దళాల అమ్ములపొదిలో చేరింది. బూస్టర్ను మినహాయిస్తే, ఈ క్షిపణి పొడవు 5.6 మీటర్లు ఉంటుంది. ఇది సుమారు 1600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. గంటకు 880 కిలోమీటర్ల వేగంతో (సబ్సోనిక్) ప్రయాణిస్తుంది. భూ ఉపరితలానికి కేవలం 30నుంచి 35 మీటర్ల ఎత్తులో ప్రయాణించే సామర్థ్యం ఉండటం వల్ల, ఇది లక్ష్యానికి అత్యంత సమీపంగా వచ్చే వరకు శత్రు రాడార్లు దీనిని గుర్తించడం కష్టం. అందువల్లే ఇది చాలా యుద్ధాల్లో నమ్మకమైన అస్త్రంగా పేరుతెచ్చుకుంది. ఈ క్షిపణి సుమారు 450 కిలోల బరువైన సంప్రదాయ వార్హెడ్ను మోసుకెళ్లగలదు. అమెరికా వద్ద ఉన్న 140 యుద్ధనౌకలు, జలాంతర్గాములలో దీనిని ప్రయోగించే ఏర్పాట్లు ఉన్నాయంటే, దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. ఇరాక్పై అమెరికా చేపట్టిన ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్ యుద్ధంలో, బాగ్దాద్ నగరంపై ప్రయోగించిన మొట్టమొదటి ఆయుధం టోమహాక్ క్షిపణే. మొత్తం 42 రోజులపాటు సాగిన ఈ యుద్ధంలో అమెరికా మొత్తం 297 టోమహాక్ క్షిపణులను ప్రయోగించగా, వాటిలో 282 క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా తాకాయి. కొన్నిసార్లు చాలా ఎక్కువ ఎత్తు నుంచి, మరికొన్నిసార్లు తక్కువ ఎత్తు నుంచి ప్రయాణిస్తూ ఇవి శత్రువులను గందరగోళానికి గురిచేసి బాగ్దాద్పై విరుచుకు పడ్డాయి. ఒక్కో టోమహాక్ క్షిపణి ఖరీదు సుమారు 2మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ క్షిపణిలో అత్యంత ఆధునాతనమైన స్మార్ట్ నేవిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. జీపీఎస్, ఇనర్షియల్ నేవిగేషన్ సిస్టమ్ (ఐఎన్ఎస్) వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇది ఉపయోగించుకుంటుంది. అంతేకాకుండా, దీనిలో ఉండే టెర్రైన్ కాంటూర్ మ్యాచింగ్ వ్యవస్థ, ముందుగా లోడ్ చేసిన మ్యాపులను అనుసరిస్తూ, భూమిపై వాస్తవంగా ఉన్న చిత్రాలను పోల్చుకుంటూ లక్ష్యం వైపు కచ్చితత్వంతో దూసుకెళ్తుంది. అత్యాధునిక డేటా లింక్లు కూడా దీనికి ఉండటం వల్ల, ప్రయాణ మార్గమధ్యంలో దీని దిశను మార్చవచ్చు లేదా అవసరమైతే మిషన్ను రద్దు చేసే సౌలభ్యం కూడా ఉంది.

# ఇరాన్పై ఇజ్రాయెల్ దాడులకు అమెరికా వత్తాసు



**జెరూసెలెం,జూన్ 22:** ఇరాన్ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరుదేశాలపై మిస్సైళ్లతో దాడులు చేసుకుంటున్నాయి. అయితే, అమెరికా జోక్యం తప్పదన్న చర్చలు గత కొద్దిరోజులుగా సాగుతున్నాయి. చివరకు అదే నిజమైంది. శనివారం అర్ధరాత్రి అనంతరం అమెరికా వైమానిక దళాలు ఇరాన్లోని మూడు అణు కేంద్రాలపై భీకర దాడులకు పాల్పడ్డాయి. దీంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దాడుల విషయాన్ని ప్రకటించారు. ఫోర్డో, నాటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులకు బీ2 స్టెల్త్ బాంబర్ను వినియోగించినట్టు తెలిపారు. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరాన్ని ధ్వంసం చేసేందుకు ఆరు బంకర్ బస్టర్ బాంబులను వాడినట్టు వెల్లడించారు. నాటాంజ్, ఇస్ఫహాన్లపై దాడికి 30 టొమాహాక్ క్షిపణులను ప్రయోగించినట్టు చెప్పారు. అమెరికా వాయుసేనకు చెందిన బీ2 స్టెల్త్ బాంబర్ ఓ ప్రత్యేకతలు గల యుద్ధ విమానం. 1989లో తొలిసారిగా అమెరికా ఈ బాంబర్ను వాడింది. గత మూడు దశాబ్దాలుగా అమెరికా స్టెల్త్ సాంకేతికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ విమానం శత్రుదేశాల రాడార్లను కనిపించకుండా దాడులు చేయడం దీని ప్రత్యేకత. ఇప్పటికీ ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన విమానాల్లో ఇది ఒకటిగా ఉండటం విశేషం. నార్త్రప్ గ్రమ్మన్ అనే అమెరికా సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. ఇది భూగర్భంలో ఉన్న స్థావరాలను సైతం విజయవంతంగా ధ్వంసం చేసే సామర్థ్యం ఉంటుంది. దీనికి చాలా తక్కువ రాడార్ సిగ్నల్ ఉంటుంది. చిన్న పక్షి మాదిరిగా కనిపిస్తుంది. 6వేల నాటికల్ మైల్స్ దూరం ప్రయాణించగలదు. శక్తివంతమైన ఆయుధాలను మూసుకెళ్లగల సత్తా దీనికి ఉన్నది. ఆయుధాలను మోసుకెళ్లగలదు. ఇరాన్పై ఎందుకు బీ2 బాంబర్ను ఉపయోగించారు. ఇజ్రాయెల్ ఇప్పటికే ఇరాన్ అణు స్థావరాలపై దాడులకు పాల్పడింది. అవి భూగర్భంలో ఉండడంతో పెద్దగా నష్టం జరుగలేదు. కానీ, భూగర్భ నిర్మాణాలను ధ్వంసం చేయగల సామర్థ్యం ఇజ్రాయెల్ వద్ద లేదు. ఇలాంటి తరుణంలో అమెరికా రంగప్రవేశం చేసింది. ప్రత్యేకంగా భూగర్భ స్థావరాల కోసం రూపొందించిన 30వేల పౌండ్ల మాసివ్ ఓర్డినెన్స్ పెనెట్రేటర్ (బంకర్ బస్టర్ బాంబులు) బీ2బాంబర్ ద్వారా ప్రయోగించింది. బంకర్బస్టర్లు భూగర్భంలో ఉన్న గుహలను, రహస్య స్థావరాలను లక్ష్యంగా చేసుకునే శక్తివంతమైన బాంబులు. ఇవి జీపీఎస్ ఆధారంగా పని చేస్తాయి. అధిక భద్రత కలిగిన ప్రాంతాల్లోనూ వీటిని ఉపయోగించి ఖచ్చితంగా దాడి చేయొచ్చు. అమెరికా దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అమెరికా ప్రత్యక్షంగారంగంలోకి దిగడం, అణు కేంద్రాలపై గగనతల దాడులు జరగడం ప్రపంచానికే ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# ఉగ్రచర్యలు ప్రోత్సహిస్తున్న ఇద్దరు వ్యక్తుల ఆస్తులు జప్తు

**శ్రీనగర్, జూన్ 22:** పాకిస్థాన్ పారిపోయి అక్కడి నుంచి జమ్మూ కాశ్మీర్తోపాటు పాక్ సరిహద్దు ప్రాంతంలో ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న ఇద్దరు వ్యక్తుల స్థిరాస్తులను కోర్టు ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు సీజ్ చేశారు. 2003లో హంద్వారాలో మహమ్మద్ షఫీ బారా, జీ హెచ్ ముస్తాఫాలు ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారు. హంద్వారా, మూన్బాల్ వాసులైన వీరిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వీరిద్దరు పాకిస్థాన్కు పారిపోయారు. వీరిపై కొనేళ్లుగా కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఆ క్రమంలో జూన్ 20వ తేదీన కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వీరిద్దరి ఆస్తులను సీజ్ చేయాలంటూ జమ్మూ కశ్మీర్ పోలీసులను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షఫీ బారా, ముస్తాఫాల ఆస్తులను పోలీసులు సీజ్ చేశారు. సరిహద్దు ప్రాంతంలో ఉద్రిక్తతలు రేకెత్తించేందుకు వీరిద్దరు ఉగ్రవాద చర్యలను చాలా కాలంగా ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఉగ్రవాద చర్యల్లో వీరిద్దరి ప్రమేయం బలంగా ఉందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. మరోవైపు ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ ప్రముఖ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. దీంతో ఈ ఉగ్రదాడి ఘటనకు కర్త, కర్మ, క్రియ అంతా పాకిస్థానేనని భారత్ భావించింది. ఆ క్రమంలో పాక్కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో పాక్తో చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. అలాగే పాక్ సైతం సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాంటి వేళ భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ ఘటనలో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. అనంతరం సరిహద్దు వెంబడి రాష్ట్రాలే లక్ష్యంగా పాకిస్థాన్ క్షిపణులు, డ్రోనులతో దాడులు నిర్వహించింది. వీటిని భారత్



తిప్పికొట్టింది. ఇక పాకిస్థాన్ ఎయిర్బేస్లే లక్ష్యంగా భారత సైనిక బలగాలు దాడులు చేయడంతో పొరుగుదేశం పాక్ కాళ్ల బేరానికి దిగింది. తర్వాత సరిహద్దుల వద్ద కొన్ని చెదురు మదురు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతంలో సైతం ఉగ్రవాద దాడులు జరగడం లేదు. ఇది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్లే సాధ్యమైందనే చర్చ జరుగుతోంది. కోర్టు తాజా తీర్పుతో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న వారి ఆస్తులు సీజ్ చేయడం వల్ల కూడా భవిష్యత్తులో ఈ తరహా చర్యలకు ఆస్కారమే ఉండదనే భావన జమ్ముకాశ్మీర్ ప్రజల్లో వ్యక్తం అవుతోంది.



## బోర్నో మార్కెట్లో ఆత్మాహుతి దాడి:12 మంది మృతి, 30 మందికిపైగా గాయాలు

**బోర్నో,(నైజీరియా), జూన్ 22:** నైజీరియాలోని బోర్నోలో జరిగిన ఓ ఆత్మాహుతి దాడి స్థానిక ప్రజలను తీవ్ర దుఃఖంలో ముంచేసింది. ఈ దాడిలో దాదాపు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బోర్నోలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి స్థానికులలో తీవ్ర భయాందోళనను రేపింది. బోర్నో పోలీస్ అధికారిగా వ్యవహరించే నహూం కెనత్ దాసో ఈ ఘటనపై వివరాలను అందించారు. ఒక మహిళ ఆత్మాహుతి పేలుడు పరికరాన్ని తన శరీరానికి కట్టుకొని చేపల మార్కెట్ ప్రాంతంలోకి చొరబడి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపారు. బోర్నో నైజీరియాలోని ఉత్తర భాగంలో ఉన్న ఒక కీలక ప్రాంతం. ఇది బోకో హరామ్ అనే ఉగ్రవాద గ్రూప్ దాడులకు కేంద్రంగా మారింది. గత 16 సంవత్సరాలుగా ఈ ప్రాంతం బోకో హరామ్ ఉగ్రవాద కార్యకలాపాల నుంచి తీవ్రంగా బాధపడుతోంది. ఈ దాడులు అనేక అనర్థాలకు కారణమయ్యాయి. ప్రాణనష్టంతోపాటు కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోకో హరామ్ గ్రూప్ దాదాపు 2009 నుంచి బోర్నోలో తీవ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తోంది. వీరి దాడుల వల్ల వేలాది మంది చనిపోయారు. రెండు మిలియన్లకు పైగా ప్రజలు ఇళ్లను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించేందుకు స్థానిక ప్రభుత్వం సకాలంలో స్పందిస్తున్నప్పటికీ, బోర్నో వంటి ప్రాంతాలలో అత్యవసర సేవలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ టీమ్స్ బాధితులను ఆస్పత్రికి తరలించి వారిని ఆదుకునేందుకు కృషి చేస్తున్నాయి. ఈ దాడులు నైజీరియా వ్యాప్తంగా అనేక ప్రశ్నలను రేకెత్తిస్తాయి. ముఖ్యంగా భద్రతా చర్యలు, ప్రభుత్వ పోరాటం పట్ల బోర్నో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేసి ఇలాంటి దాడులను కట్టడి చేయాలని కోరుతున్నారు.




# 14కోట్లు దాటిన బిజెపి సభ్యత్వాలు

## పార్టీలో తొలి క్రియాశీల సభ్యుడిగా చేరడం గర్వంగా ఉంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 22:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మరో మరోరికార్డు సాధించింది. పార్టీ ప్రాథమిక సభ్యుల సంఖ్య 14 కోట్లు దాటినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ప్రకటించారు. ఈ ఘనత సాధించడం వెనుక బూత్ స్థాయి కార్యకర్తల కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు. ఈ విషయంపై బీఎల్ సంతోష్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ "భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వం 14 కోట్ల మార్కును దాటింది. ఇది గొప్ప విజయం. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త కృషి అమోఘం. మేము భారీ ప్రచార కార్యక్రమాలను నిలిపివేసినప్పటికీ, బూత్ స్థాయి కార్యకలాపాల ద్వారా 14 కోట్ల సభ్యత్వ మార్కును దాటగలిగామని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్టీ దేశవ్యాప్త యాక్టివ్ సభ్యత్వ ప్రచారంలో తొలి క్రియాశీల సభ్యుడిగా చేరిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం, బీజేపీ జాతీయఅధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ సభ్యత్వ ప్రచార కన్వీనర్ వినోద్ తావ్డే సమక్షంలో జరిగింది. ఇది పార్టీ చేపట్టిన సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం2024లో తదుపరి దశగా ప్రారంభమైంది. ఆ సమయంలో ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎక్స్లో పంచుకుంటూ, బీజేపీలో తొలి యాక్టివ్ సభ్యుడిగా చేరడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. క్రియాశీల సభ్యుడు కావడానికి ఉండాల్సిన అర్హతలను కూడా ప్రధాని మోదీ వివరించారు. ఒక కార్యకర్త యాక్టివ్ సభ్యుడిగా అర్హత సాధించాలంటే ఒకబూత్ లేదా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కనీసం 50 మంది కొత్త సభ్యులను నమోదు చేయించాలి. దీనివల్ల వారు మండల కమిటీ,పార్టీలో ఉన్నత స్థాయి పదవులకు పోటీ చేయడానికి అర్హులవుతారు. భవిష్యత్తులో పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించేందుకు ఈ కార్యకర్తలకు విస్తృత అవకాశాలు కల్పిస్తామని ప్రధాని తెలిపారు. బీజేపీ జాతీయ సభ్యత్వ ప్రచారాన్ని తొలుత గత ఏడాది సెప్టెంబర్ 2న పార్టీ కేంద్ర కార్యాలయ విస్తరణ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రారంభించారు. సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం2024 పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 2024 అక్టోబర్ 15 నాటికి సభ్యుల సంఖ్య తొమ్మిది కోట్లు దాటింది. ఒక్క ఉత్తరప్రదేశ్లోనే బీజేపీ రెండు కోట్ల మంది సభ్యులను కలిగి ఉన్నట్లు ఆ పార్టీ పేర్కొంది. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదటి, రెండవ దశలు ముగియడంతో పార్టీ క్రియాశీల సభ్యత్వ సంఖ్యను మరింత పెంచే లక్ష్యంతో మూడవ దశ ప్రారంభమైంది.

# తరగతి గదిలోనే టీచర్ గురకనిద్ర!

## విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు



**జల్నా,(మహారాష్ట్ర,)జూన్ 22:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థులందరూ ఉండగానే నిద్రపోయిన ఘటన మహారాష్ట్రలో వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సంబంధిత అధికారి విచారణకు ఆదేశించారు. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా గడేగావన్ గ్రామంలో ఉన్న మరాఠీ మీడియం జిల్లా పరిషత్ పాఠశాలలో వీకే ముండే అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన తరగతి గదిలో విద్యార్థులు పాఠాలు చదువుకుంటుండగా, ఆయన కుర్చీలో వెనక్కివాలి, కాళ్లు బల్లపై పెట్టి గురక పెడుతూ గాఢ నిద్రలో మునిగిపోయారు. ఆ సమయంలో సుమారు 15 నుంచి 20 మంది విద్యార్థులు తరగతి గదిలోనే ఉన్నారు. ఈ దృశ్యాన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. వీడియో తీస్తున్న వ్యక్తి ఒక విద్యార్థిని మాస్టారు ఎంతసేపటి నుంచి నిద్రపోతున్నారని అడగ్గా, ఆ చిన్నారి తడబడుతూ అరగంట నుంచి అని సమాధానం చెప్పడం వీడియోలో వినిపిస్తోంది. కాసేపటికి నిద్రలేచిన ఉపాధ్యాయుడు ముండే ఒళ్లు విరుచుకుంటూ తాను పట్టుబడ్డానన్న భావన ఏమాత్రం లేకుండా చాలా మామూలుగా కనిపించడం గమనార్హం. ఈ ఘటనపై జోనల్ విద్యాధికారి సతీష్ షిండేకు ఫిర్యాదు అందింది. దీనిపై ఆయన స్పందిస్తూ సంఘటనపై విచారణ జరిపిస్తాం, నిజానిజాలు తేలిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఈ ఉదంతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య యొక్క నాణ్యతపై మరోసారి విస్తృత చర్చకు దారితీసింది.

## ఉగ్రవాదులకు సాయంచేశారని ఇద్దరు వ్యక్తుల అరెస్టు



**శ్రీనగర్,జూన్ 22:** జమ్మూకశ్మీర్లోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పహల్గామ్లో ఈ ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ఈ దారుణ మారణకాండలో పాల్గొన్న ఉగ్రవాదుల జాడ కనిపెట్టేందుకు నిఘా వర్గాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా, ఈ దాడికి కారకులైన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి అమానుష చర్యలకు సహకరించిన ఇద్దరు వ్యక్తులను ఆదివారం ఉదయం జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ అరెస్టు చేసింది. నిందితులు పహల్గామ్లోని బాట్కోట్కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్గా ఎన్ఐఏ గుర్తించింది. వీరిద్దరూ పాకిస్థాన్ కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్ఈటీ)కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయం, ఆహారం, రవాణా వంటి అవసరాలు తీర్చి బైసరన్ లోయలో మారణకాండకు సహకరించినట్లు ఎన్ఐఏ తెలిపింది. నిందితులు పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల పేర్లు వెల్లడించడంతో కేసులో కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ కేసులో ఎన్ఐఏ అధికారులు ఇప్పటివరకూ 2000ల మందికిపైగా సాక్షులను విచారించారు. అరెస్టయిన పర్వేజ్, బషీర్ పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల పేర్లను వెల్లడించారు. వారంతా నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్యీటీ) కోసం పనిచేస్తున్న పాక్ దేశీయులు. దాడికి ముందు నిందితులు ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్లోని సీజనల్ గుడిసెలో ఆశ్రయం కల్పించారు. ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ ఘోర విషాదంపై ఇంకా దర్యాప్తులు కొనసాగుతున్నాయి.

# బీహార్ గబ్బర్సింగ్ లాలూప్రసాద్ యాదవ్

## ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం సామ్రాట్చౌదరి



**పాట్నా,జూన్ 22:** ఆర్జేడి అధినేత మాజీ సీఎం లాలూప్రసాద్యాదవ్పై బీహార్ డిప్యూటి సిఎం బిజెపి నాయకుడు సామ్రాట్చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లాలూను బీహార్ గబ్బర్సింగ్ అవినీతికి ప్రతీక అన్నారు. గబ్బర్సింగ్ అంటే షోలే చిత్రంలో విలన్పేరు అదే. ఆపేరును ఉచ్ఛరిస్తూ సామ్రాట్చౌదరి ఈ సారి బీహార్ ఎన్నికల్లో ఆయన ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. లాలూప్రసాద్ యాదవ్ బీహార్ గబ్బర్ సింగ్. రాజకీయాల్లో ఆయన చురుగ్గా ఉన్నంతవరకూ ప్రజలు ఆయనకు భయపడుతూనే ఉంటారు. ఆయన అవినీతికి ప్రతీక అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని సామ్రాట్ అన్నారు. ఆర్జేడి మొత్తంనేరస్థులతో నిండిపోయిందన్నారు. లాలూ కుటుంబం అవినీతిపరులతోనే నిండిందన్నారు. బీహార్ను లాలూకుటుంబం లూటీ చేసిందని, రాబోయే ఎన్నికల్లో ఆర్జేడి అవమానకరమైన రీతిలో ఓటమి పాలవుతుందన్నారు. ప్రధాని మోడీ సీఎం నితీష్కుమార్ల ఆధ్వర్యంలో బీహార్ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. 2025-2030 మధ్యకాలంలో బీహార్ పారిశ్రామిక హబ్గా మారుతున్నదన్నారు. రాష్ట్రంలోని అభివృద్ధిని విమర్శిస్తున్నవిపక్షాలు పట్నా ఎయిర్పోర్టు, గంగాపథ్, పాట్నా బక్సర్రోడ్డు, పాట్నా ముజఫర్పూర్ రోడ్లు చూడాలని అన్నారు. ఇతరమౌలిక వనరుల న్నింటినీ కూడా ఎన్డీయే కూటమి సర్కారు నెరవేర్చిందన్నారు.

# అద్భుత ప్రగతితో ప్రపంచ దేశాలనే ఆశ్చర్యపరిచిన మోడీ

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి,ఎంపి ఈటల

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జూన్ 22, ప్రభాతవార్త:** అభివృద్ధిలో దేశం ఎలా ముందుకు వెళ్ళాలో ప్రపంచానికి తెలిసేలా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.. అప్పుడు పాకిస్థాన్ ఆడిందే ఆటగా ఐఎస్ఐ ఏజెంట్ల ద్వారా దేశాన్ని అంతలాకుతలం చేసిందని.. అప్పుడు లుంబినీపార్క్, గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుళ్ళు జరిగాయని అన్నారు. ఏడాదిగా మల్కాజ్గరి పార్లమెంట్లో ఈటెల రాజేందర్ చేసిన అభివృద్ధిని వివరించడానికి ఈ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 11 ఏళ్లుగా మోడీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. 11 ఏళ్ల పరిపాలన చేయడానికి ప్రజలు ఆమోదం తెలిపిన ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని కొనియాడారు. మరో 11 ఏళ్ల మోడీ పరిపాలన ప్రజలు కోరుకుంటున్నారని.. యూపీఏ ప్రభుత్వంలో ఏ వార్త చూసినా కుంభకోణాలు, అవినీతి పై వార్తలు వచ్చేవన్నారు. అందుకే 2014 లో దేశ ప్రజలు అవినీతి ప్రభుత్వం కాదని, మోడీని ప్రధానిగా చేశారని తెలిపారు. ఏ ఒక్క రోజు కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వంపై అవినీతి జరిగినట్లు వార్తలు రాలేదని చెప్పారు. అప్పట్లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని, అప్పుడు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉండేదని విమర్శించారు. ఇప్పుడు అద్భుతమైన పరిపాలన ప్రజలు చూస్తున్నారన్నారు. అప్పుడు ఉగ్రవాద దాడి జరిగితే పోలీసులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఉండేదని.. కానీ, మోడీ ప్రభుత్వంలో ఉగ్రవాద దాడికి సర్జికల్ స్ట్రైక్ చేసిందని చెప్పారు. మొన్న కూడా ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రధాని మోడీ మన సత్తా ఏంటో ప్రపంచానికి చూపించారని కొనియాడారు. అమెరికాను తలతన్నే విధంగా మన దేశంలో రోడ్లు నిర్మించారని.. జాతీయ రహదారులను అనుసంధానం చేసిన ఘనత మోడీ ప్రభుత్వానికి సొంతమన్నారు. మోడీ మాన రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేశారన్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అనంతరం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ దగ్గర నుండి మోడీ వరకు సాధించిన విజయాలన్నీ ఎగ్జిబిషన్ లో పెట్టాం. నేను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మోబాతో అనేకసార్లు సమావేశం అయ్యాము. బీళీగి అమలు తీరు పరిశీలనకోసం ఆస్ట్రేలియ వెళ్ళాము. వాళ్ళు మా దేశంలో అక్షరాస్యత ఎక్కువ, టాక్స్ ఎక్కువ కడతారు, రాజకీయ చైతన్యం ఉంది మీదగ్గర ఇవేమీ లేదు మీరెలా అమలు చేస్తారు, అమలు చేస్తే మా ప్రభుత్వం కూలిపోయింది అని చెప్పారు. మోడీ గారు పవర్ ఓరియెంటెడ్ కంటే పీపుల్ ఓరియెంటెడ్ మనిషి అని మేము చెప్పాము. జీఎస్టీ ని అమలు చేసే దమ్ము కాంగ్రెస్ కి లేకపోతే మోడీ గారు అమలు చేసి చూపించారు. అప్పుడు టాక్స్ 73 వేల కోట్లు వస్తె 2.40 లక్షల కోట్లకు పెరిగింది. మోడీ చేతులు ఊపి నాయకుడు కాలేదు చెమటోడ్చి కష్టపడ్డారు. కరోనా సమయంలో పలుదేశాల అధ్యక్షులు కంటతడి పెడితే మోడీ భారత ప్రజలకు ధైర్యం నింపారు. 81 కోట్ల మందికి ఐదు కిలోల బియ్యం పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, చిత్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ

## 25 యేళ్లు పూర్తి చేసుకున్న బసవతారకం కేన్సర్ ఆస్పత్రి

### వార్షికోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (పంజగుట్ట), జూన్ 22, ప్రభాతవార్త :** అందరూ బాగుంటే సమాజం కూడా బాగుంటుందని, అలా కేన్సర్ రోగంతో బాధపడుతున్న వారికి సాంత్వన చేకూర్చడం ద్వారా బసవతారకం ఆస్పత్రి ముందుకు సాగుతుందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వ్యాఖ్యానించారు. ఆదివారం బసవతారకం ఆస్పత్రి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఇలా ఓ మంచి సంస్థ 25వ వార్షికోత్స వాలకు హాజరుకావడం ఎంతో సంతోషమని, ఆరోగ్య భారత్‌ను అందించ డంలో హాస్పిటల్ చేస్తున్న కృషి భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని ఆయన సూచించారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ గ్రేట్ హీరో విత్ ఏ మిషన్ అని కొనియాడారు. మరో అతిధిగా వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు అను గుణంగా రూపుదిద్దుకున్న హాస్పిటల్ ఎందరో కేన్సర్ రోగులకు కొత్త జీవ నాన్ని అందించడంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో నానాటికీ కేసులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోనుందని ఆయన వివరించారు. బసవతారకం చైర్మన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధిలో స్వర్గీయ పోలవరపు తులసీదేవి, కోడెల శివప్రసాదరావు, నారా చంద్రబాబునాయుడు, టాటా సొరాబ్జీ ట్రస్ట్ వంటి ఎందరో దాతలు ఇచ్చిన విరాళాల ద్వారా అందించిన సహాయ సహకారాలతో ఆస్పత్రి నేడు దిగ్విజయంగా 25 వసంతాలు పూర్తి చేసుకుంటుందన్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఈ ఆస్పత్రి నేడు దేశంలోనే అత్యున్నత శ్రేణి హాస్పిటల్‌గా రూపాంతరం చెందిందన్నారు. ఎన్నో ఛాలెంజింగ్ కేసులకు చికిత్స అందించి వారి జీవితాలలో వెలుగు నింపామని, అదే మా అమ్మ కోరిక అని దానిని పూర్తి చేయడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన తెలుగు రాష్ట్రాల దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## యుజిసి నెట్-2025 అడ్మిట్‌కార్డులు విడుదల

### 25 నుంచి 29 వరకు పరీక్షలు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) అధ్వర్యంలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)–2025కి సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) విడుదల చేసింది. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జెఆర్ఎఫ్) అవార్డుతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం యుజిసి నెట్‌ను ప్రతి ఏడాది జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. యుజిసి నెట్–2025 అడ్మిట్ కార్డులను ఎన్‌టిఏ ఆదివారం విడుదల చేసింది. అభ్యర్థులు ఎన్‌టిఏ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. ఈ నెల 25 నుంచి 29 వరకు రెండు షిఫ్టుల్లో యుజిసి నెట్ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుండగా.. రెండో సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవడానికి అభ్యర్థులు తమ అప్లికేషన్ నెంబర్‌తోపాటు పుట్టిన తేదీలను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి యుజిసి నెట్‌కి అభ్యర్థులు హాజరుకానున్నారు.

## త్వరలో నూతన జిపి, అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

### వేగంగా స్థలాల గుర్తింపు పూర్తి

### మొదటి త్రైమాసికంలోనే రికార్డు స్థాయిలో స్థలాల సేకరణ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు, మరో రెండు అంగన్వాడీ భవనాల చొప్పున నిర్మించాలని టార్గెట్ పెట్టుకున్న తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆ దిశలో వేగంగా అడుగులు వేస్తుంది. భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపును వేగంగా పూర్తి చేస్తుంది. గత ఏడాది నవంబర్ లో టార్గెట్ పెట్టుకోగ..స్థలాల గుర్తింపు, అప్పగింత లో జాప్యం కారణంగా అనుకున్న స్థాయిలో భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే జీపీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణాల కోసం స్థలాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా, ఎప్పటి కప్పుడు పంచాయతీ రాజ్ కమిషనరేట్ అధికారులు,జిల్లా డీఆర్డీఏలతో సమీక్షలు నిర్వహిస్తూ వచ్చారు.దీంతో మొదటి త్రైమాసికంలోనే గణనీయంగా భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మొత్తం ఈ ఏడాది 1148 అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా... ఇప్పటికే 813 అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మరో 98 చోట్ల స్థలాలను గుర్తించాల్సి ఉంది.మిగిలిన భవనాలకు సంబంధించి గతంలో భవనాల నిర్మాణం మొదలుపెట్టగా నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.ఇక జీపీ భవనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం లో ప్రతి మండలానికి రెండు చొప్పున మొత్తం 1144 జీపీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకోగా మొదటి త్రైమాసికం ముగియక ముందే 549 గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మిగిలిన 84 చోట్ల ఇంకా స్థలాలను గుర్తించాల్సి ఉంది. మిగిలిన గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ప్రధానంగా యాదాద్రి భువనగిరి. వికారాబాద్, సంగారెడ్డి వంటి హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలు.. ఏజెన్సీ ప్రాంతాలున్న ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో స్థలాల గుర్తింపునకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీనాభివృద్ధి డైరెక్టర్ జీ సృజన జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడుతూ..స్థలాల గుర్తించి అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరి కొద్ది రోజుల్లో స్థల సేకరణ పూర్తవుతుందన్న నమ్మకంతో అధికారులున్నారు. అయితే జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలకు యునిక్ మోడల్ ఉండాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారి చేసారు.

రాష్ట్రంలో ఎక్కడికెల్లినా ఆయా భవనాలను చూడగానే ప్రజలు అవి జీపీ భవనాలని, అంగన్వాడీ భవనాలని గుర్తించేలా ఉండేలా డిజైన్ రూపొందించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం జీపీ భవనాలకు, అంగన్వాడీలకు వేరు వేరుగా డిజైన్లు రూపొందిస్తున్నా రు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణ కోసం రూ. 20 లక్షలు ఖర్చు చేయనున్నారు. ప్రణాళిక బద్ధంగా పనిచేయడం ద్వారా వచ్చే మార్చి నాటికి మొత్తం 1148 జీపీ భవనాలు,1148 అంగన్వాడీ భవనాలను నిర్మించనుంది తెలంగాణ ప్రభుత్వం. దీంతో నూతన జీపీ భవనాలు,అంగన్వాడీ భవనాలతో పల్లెలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కస్థలాల గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉన్న నేపథ్యంలో, త్వరలో నూతన భవనాలకు శంకుస్థాపన చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. చివరి త్రైమాసికంలో భవనాల నిర్మాణాలు చేపట్టడం వల్ల పనులు పెండింగ్ లో మిగిలిపోతున్నాయన్నారు.అందుకే ఈ దఫా మొదటి త్రైమాసికంలో స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తున్నామని,యునిక్ డిజైన్ తో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.నూతన జీపీలు, అంగన్వాడీ భవనాల కోసం వేగంగా స్థలాలు గుర్తించడానికి కృషి చేసిన శాఖ అధికారులను,జిల్లా కలెక్టర్లను అభినందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లాలో బాలికను వేధించిన కేసులో ఎనిమిది మంది అరెస్టు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ పోలీసు స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఎనిమిది మం ది యువకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక గుడిహత్నూరు ప్రాంతానికి చెందిన మైనర్ బాలికతో అదే ప్రాంతా నికి చెందిన 22 ఏళ్ల యువకుడు న్యూడ్ ఫోన్ కాల్ చేసి, ఆ బాలికను కూడా అదే విధంగా మాట్లాడించాడు. అనంతరం దీనిని అతను రికార్డ్ చేసి తన స్నేహితులకు ఫార్వర్డ్ చేశాడు. అనంతరం అంద రు కలిసి ఆ బాలికను వేధించడంతో పాటు తమతో గడపాలని కోరారు. దీంతో ఆ బాలిన జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా వారు దీనిపై పో లీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మొత్తం ఎనిమిది మంది యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వీరి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు.

## టీచర్లకు పర్యవేక్షణ బాధ్యతలు సరైన నిర్ణయం కాదు

### తక్షణమే విరమించుకోవాలని ఎస్‌టియు టిఎస్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణా బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించటం సరైన నిర్ణయం కాదని ఎస్‌టియు టిఎస్ మండిపడింది. ఈ నిర్ణయంతో విద్యారంగా సంక్షోభానికి దారి తీస్తుందని.. వెంటనే ఈ ఉత్తర్వులను విరమించు కోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్‌జిటి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి.. వారికి పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించడం సరికాదని.. ఇది విద్యారంగ తిరోగమన చర్య అని విమర్శించారు. 629 మండలాలు 1,817 క్లస్టర్ల పరిధిలో ఉన్న 24,146 పాఠశాలలను తనిఖీ చేయడానికి పది సంవత్సరాలు అనుభవం ఉన్న సుమారు రెండు వేలకుపైగా ఉపాధ్యాయులకు తనిఖీ బాధ్యతలు అప్పగించి విద్యా సంవత్సరం పొడవునా వారిని తనిఖీ బాధ్యతలలో ఉంచడంవల్ల, వారు సేవలందిస్తున్న ఆయా పాఠశాలలలో బోధన స్తంభించి పోతుందని.. ఫలితంగా విద్యా ప్రమాణాలు మరింత కుంటుపడతాయన్నారు. ప్రభుత్వం రాష్ట్రమంతా అన్ని పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుకు చర్యలు తీసుకుం టామని చెబుతూనే .. ఇలాంటి చర్యలకు పాల్పడడం అనాలోచిత మన్నారు. కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పూర్తిస్థాయి మండల విద్యాధి కారు (ఎంఈవో)లను, ఉప విద్యాశాఖ అధికారు(డిప్యూటీ డిఈవో)లను, జిల్లా విద్యాశాఖాధికారు (డిఈవో)లను నియమించి పాఠశాలల పర్యవేక్షణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంవల్ల బోధన కుంటుపడుతుందని.. వెంటనే డీఎస్సీ ప్రకటిం చి ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలని పర్వత రెడ్డి, సదానంద్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### టిఎంసిలు, క్యూసెక్కులంటే తెలియని వాళ్లు

## కాళేశ్వరం గురించి మాట్లాడడం సిగ్గుచేటు

### 'తెలంగాణ జలవనరులు-వ్యవసాయం-నాడు, నేడు, రేపు'పై

### రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్(టిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్న 22, ప్రభాతవార్త:** నీటి పారుదల రంగానికి సంబంధించి టిఎంసి, క్యూసెక్, ప్రాజెక్ట్ అంటే తెలియని వాళ్లు కాళేశ్వరం గురించి మాట్లాడడం సిగ్గుచేటని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్(టిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డి అధ్యక్షతన 'తెలంగాణ జలవనరులు–వ్యవసాయం– నాడు, నేడు, రేపు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిధిగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తొంబై శాతం పూర్తి అయిన పాల మూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సమీక్షించకపోగా ఆ ప్రాజె క్టును సందర్శించిన పాపాన పోలేదన్నారు. పరిపాలన వైఫల్యం వల్లనే ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇందుకు తాత్కాలిక ఉపశమనం కోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు కారణమన్నారు. తెలంగాణ ఉదారత్వన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది కుట్రలు చేస్తున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సాగునీటి రంగనిపుణులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ప్రముఖ పాత్రికేయులు పరాంకుశం వేణుగోపాల స్వామి, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ పూర్వ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ముక్యాల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా సమావేశంలో చేసిన తీర్మానాలను నరసింహారెడ్డి వివరించారు. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టును కేంద్రం తక్షణమే ఆపాలన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించడంతో పాటు ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, కోతలు లేని విద్యుత్తు సరఫరా చేయాలని, రైతాంగంపై పెట్టిన అక్రమ అరెస్టులు, కేసులను ఖండిస్తూ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. కేంద్రం వెంటనే తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు వెంటనే ఇవ్వాలని కోరింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ కేంద్రం ప్రకటన చేసేవరకు పోరాటం చేయాలని తీర్మానించింది.

## భైంసాలో భారీచోరీ.. తాళం వేసిన ఇంటికి కన్నం వేసిన దుండగులు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని రాహుల్ నగర్ హనుమాన్ మందిర్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చొరబడి బీరువా బద్దలు కొట్టి 31 తులాల బంగారు నగలతో పాటు 70 వేల రూపాయల నగదును చోరీ చే శారు. స్థానికంగా నివసించే మచ్చ గజ్జారాం, పంచపూల దంపతులు శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నర్సాపూర్ (జి) గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే తాళం వేసి వున్న గజ్జారాం ఇంటిని దుండగులు ముందుగా పసిగట్టి శనివారం అర్ధరాత్రి వేళ వచ్చి తాళాలు పగులగొట్టారు. అనంతరం ఇంట్లోని బీరువాను బద్దలు కొట్టి అందులోని 31 తులాల బంగారు నగలు, 70 వేల రూపాయల నగదును దోచుకుని పారిపోయారు.

ముగ్గురు దుండగులు ము ఖాలకు ముసుగులు ధరించినట్లు ఇంటి వద్ద వున్న సిసి కెమెరాల్లో వుంది. కాగా ఆదివారం ఉదయం గజ్జారాం ఇంటి తాళాలు బద్దలు కొట్టి వుండడాన్ని గమనిం చిన స్థానికులు దీనిపై ఆయనకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే గజ్జారాం వెంటనే తన ఇంటికి వచ్చి చూడగా దోపిడి జరిగినట్లు గుర్తి ంచి దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశార. ఘటనా స్థలికి క్లూస్ టీంను, పోలీసు జాగిలాలను రప్పించి కొన్ని ఆధారాలను సేకరించారు. పాత నేరగాళ్లే ఈ దోపిడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. భైంసా పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు.

## పంచాయతీ సంఘటన్ కీలకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలి

### ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్.. ఎంపి మల్లు రవి భేటీ

### 24న క్రమశిక్షణా కమిటీ సమావేశం

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** పంచాయతీ సంఘటన్ స్థానికసంస్థల ఎన్నికల్లో పనిచేయాలని మీనాక్షి నటరాజన్ కోరారు.రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ సమావేశం చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ అధ్యక్షతన గాంధీ భవన్ లో ఆదివారం జరిగింది.ఈ సమావేశం లో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సంఘటన్ జాతీయ అధ్యక్షులు సునీల్ పన్వర్ తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సంఘటన్ కీలక బాధ్యతలు తీస్కొని పని చేయాలని సూచించారు. గ్రామ పునాది నుంచి పార్టీని బలోపేతం చేయడానికి బూత్‌లెవల్ కార్యకర్తల సహకారం తీసుకోవాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ లౌకిక తత్వాన్ని ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు కాంగ్రెస్ భావాజాలంకు అనుకూలంగా కూడగట్టుకోవడానికి పంచాయతీసంఘటన్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని దేశంలో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాలను వారికి తెలిపి ఈ పరిస్థితిలో రాహుల్‌గాంధీ నాయకత్వం బలోపేతం చేస్తేనే అన్ని రకాల రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందనే సంకేతం ప్రజలకు బలంగా పంపించాలని ఆమె కోరారు. సునీల్ పన్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంఘటన్ పునర్ వ్యవస్తీకరణ చేస్తామని అన్నారు. మీనాక్షి నటరాజన్‌తో మల్లు రవి ఆదివారం గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు గాంధీ భవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశాన్ని నిర్వహించాలని మీనాక్షి నట రాజన్ సూచించారు. పలు నియోజక వర్గాల్లో క్రమశిక్షణ అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై మీనాక్షితో మల్లు రవి చర్చించారు.

**సినిమా డైలాగులు రాజకీయాల్లో చెల్లుబాటు కాదు: ఎంపి మల్లు రవి**

సినిమా డైలాగులు రాజకీయాల్లో చెల్లుబాటు కావని పార్లమెంట్ సభ్యులు మల్లురవి అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ రాజుల కాలంలో రప్పా రప్పా ఆడించేది ఉండేదని అన్నారు. ఇప్పుడు ఉన్నది ప్రజాస్వామ్యమని ఇక్కడ రప్పా రప్పా అంటే చెల్లదని మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. వ్యక్తిగత కక్షలకు ప్రజాస్వామ్యంలో తావు లేదని అన్నారు. బిఆర్ఎస్ నేతలను హెచ్చరిస్తూ ఈ డైలాగులు వినడానికి బాగుంటాయని కానీ రాజకీయాల్లో చెల్లవని హెచ్చరించారు.

బిఆర్ఎస్ పరిస్థితి లోకల్ బాడీ ఎన్నికల్లో తేలుతుందని మల్లు రవి చెప్పారు. బిఆర్ఎస్ వంటి పార్టీలకు కాంగ్రెస్ భయపడదని హెచ్చరించారు. వరంగల్ జిల్లాకు సంబంధించిన అంశం తన దృష్టికి వచ్చిందని అన్నారు. టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌లను అడిగి సమస్య తెలుసుకుంటానని చెప్పారు. ఆ సమస్యలను తెలుసుకొని పార్టీ లైన్ ప్రకారం ముందుకు వెళ్తానని తెలిపారు. వరంగల్, గజ్వేల్ రెండు ప్రాంతాల నుంచి హై కమాండ్‌కి ఫిర్యాదులు వచ్చాయనివాటిపై పరిశీలన చేస్తామని మల్లు రవి పేర్కొన్నారు ..

## మిగిలిపోయిన భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలి

### ఎంపి మల్లు రవికి ఆర్‌యుపిపి టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గతంలో చేపట్టిన పండితుల అప్‌గ్రేడేషన్‌లో మిగిలిపోయిన వారిని స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(ఆర్‌యుపిపి టిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సింహులు, రాష్ట్రన ప్రధాన కార్యదర్శి శశి యాదవ్ ఆదివారం గాంధీభవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆర్‌యుపిపి టిఎస్ కోర్ కమిటీ సమావేశం శానమోలు నర్సింహులు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు ఎంఎన్ విజయ్ కుమార్, లెంకల రాంరెడ్డి, గోపాల్‌జీ, సుధాకరాచారి, వెంకటస్వామి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కోర్ కమిటీ సభ్యులు నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవిని కలిసి భాషా పండితుల మిగిలిపోయిన అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కోరారు. సంఘ పటిష్టతకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతోపాటు సంఘం అభివృద్ధికి తీసుకోవల్సిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేసినట్టు నర్సింహులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పదోన్నతులు పొందకుండా మిగిలిపోయిన భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయాలని ఎంపి మల్లు రవిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన 800 మంది ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషాపండితులను అప్‌గ్రేడ్ చేయాలని వినతి పత్రంలో కోరినట్టు తెలిపారు. సమస్య తీవ్రతను విన్న అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం అయ్యే విధంగా తనవంతు సహకారం అందిస్తానని మల్లు రవి హామీ ఇచ్చినట్టు ఆర్‌యుపిపి టిఎస్ నాయకులు తెలిపారు.

## కార్పొరేషన్లలో గ్రామాల విలీనంతో తగ్గనున్న ఎంపిటిసిల సంఖ్య

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోంది.జూలై చివరి నాటికి ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గనుందని సమాచారం.కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం,కార్పొరేషన్లలో గ్రామాలు విలీనం కావడం దీనికి కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఆ సంఖ్య తగ్గుతుందని అధికారులు తెలిపారు. పంచాయత్ రాజ్ శాఖ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది.తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడమే ఆలస్యం అని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.జూలై చివరి నాటికి గ్రామాలకు కొత్త పాకమండలి కొలవుదీరనుందని అధికారులు చెబుతున్నారు. ఇక గ్రామాల్లో స్థానిక సంస్థల సందడి అప్పుడే మొదలయ్యింది. ఇదిలా ఉంటే తాజాగా ఒక ఆసక్తికర వార్త ప్రచారం అవుతుంది. ఇంతకు అది ఏంటంటే.. తెలంగాణలో ఎంపీటీసీ స్థానాలు తగ్గబోతున్నాయని సమాచారం.తెలంగాణ రాష్ట్రంలోని 566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎలక్షన్ నిర్వహించేందుకు పంచాయత్ రాజ్ శాఖ రెడీ అవుతోంది. దీనికి సంబంధించి తుది జాబితా ఖరారు చేసింది. ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను ఓ కొలిక్కి తెచ్చే పనిలో బిజీగా ఉంది. దీనితో పాటుగా.. తెలంగాణలో ఎంపీటీసీల స్థానాల సంఖ్యను కూడా ఫైనల్ చేయనున్నారు అధికారులు. ఇప్పటి వరకు తెలంగాణలో 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య తగ్గుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణలో ఎంపీటీసీ స్థానాలు తగ్గనున్నాయి.కారణం ఇటీవల రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేశారు. అంతేకాక కార్పొరేషన్ సమీపంలోని గ్రామాలను వాటిలో విలీనం చేశారు. దీంతో పాటుగా మేడ్చల్జిల్లా మొత్తాన్ని అర్బన్ ప్రాంతంగా మార్చడమే కాక.. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి మండలాలన్నింటినీ మున్సిపాలిటీలుగా మార్చారు. దీంతో ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తగ్గనుందని తెలుస్తుంది. 2019లో 32 జిల్లా పరిషత్ ఛైర్మన్లు, 539 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సారి 31 జిల్లా పరిషత్,566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎలక్షన్స్ జరగనున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 33 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా నిజామాబాద్‌లో31, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో 26, కామారెడ్డిలో 25 స్థానాలు ఉన్నాయి. అతి తక్కువగా పంచాయతీరాజ్శాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తోన్న ములుగు జిల్లాలో కేవలం 10 జెడ్పీటీసీ స్థానాలే ఉన్నాయి. ఆ తర్వాత వరంగల్‌లో 11 స్థానాలున్నాయి. రాష్ట్రంలో ఎక్కువ జిల్లాల్లో 12 నుంచి 15 మధ్యనే జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఈ విధంగా ఉమ్మడి తెలంగాణలోని పది జిల్లాలు ఉన్నట్టు అధికారుల లెక్కలను బట్టి స్పష్టమైందనే అభిప్రాయం వ్యక్తమైంది.

# వన్యప్రాణుల రక్షణకు అటవీఅధికారుల ప్రత్యేక ఏర్పాట్లు

**మణగూరు - కొత్తగూడెం మధ్య వన్యప్రాణి కారిడార్ ఏర్పాటు**

**రైల్వే కారిడార్ చుట్టూ ఫెన్సింగ్ కూడా..**

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** తెలంగాణలోని మణుగూరుకొత్తగూడెం రైల్వే మార్గాన్ని వన్యప్రాణి కారిడార్‌గా గుర్తించేందుకు అటవీ శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల రైలు ప్రమాదంలో అడవిదున్న మృతి చెందిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. 48 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గంలో 52 రకాల జంతువులు సంచరిస్తున్నట్లు గుర్తించారు. కారిడార్ ఏర్పాటుతో వన్యప్రాణులకు రక్షణ కల్పించనున్నారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, జంతువుల సంచారాన్ని పర్యవేక్షించనున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని మణుగూరుకొత్తగూడెం (భద్రాచలం రోడ్) మధ్య ఉన్న రైల్వే మార్గాన్ని వన్యప్రాణి కారిడార్‌గా గుర్తించే ప్రయత్నాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ కీలక నిర్ణయం అడవుల గుండా వెళ్లే రైలు మార్గాల వల్ల వన్యప్రాణులకు తలెత్తుతున్న ప్రమాదాలను నివారించడంలో.. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో గణనీయమైన ముందడుగు. ఇటీవల మణుగూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఒక అడవిదున్న రైలు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందడంతో.. అటవీ శాఖ అధికారులు ఈ విషయంలో మరింత అప్రమత్తమయ్యారు. మణుగూరు, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, కిన్నెరసాని డివిజన్ల పరిధిలో లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం గుండా 48 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వేలైన్ వెళ్తుంది. రైల్వే లైన్లు అటవీ ఆవాసాలను ఛిన్నాభిన్నం చేసి, వన్యప్రాణుల స్వేచ్ఛా సంచారాన్ని అడ్డుకోవడమే కాకుండా, వాటికి ప్రత్యక్ష మరణాలకు కారణమవుతాయి. అందువల్ల, అడవుల గుండా వెళ్లే రైల్వే మార్గాలకు వన్యప్రాణి కారిడార్లు అత్యవసరం. ఇవి జంతువులు సురక్షితంగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లేందుకు వీలు కల్పిస్తాయి.. తద్వారా వాటి ఆవాసాల విభజనను నిరోధించి, జన్యు వైవిధ్యాన్ని కాపాడతాయి. వన్యప్రాణుల సంచారంపై అవగాహన పెంచుకోవడానికి అటవీ శాఖ అధికారులు రైలు మార్గంలో ఒక సమగ్ర సర్వేను నిర్వహించారు. ఈ నివేదికను వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ డిపార్ట్‌మెంట్‌కు సమర్పించారు. నెల రోజుల పరిశీలనలోనే సుమారు 52 రకాల జంతువులు, వివిధ పక్షులు ఈ ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ, వాటి నీటి అవసరాల కోసం ఇటీవల అనేక చర్యలు చేపట్టారు. అడవి జంతువుల అభివృద్ధి కోసం గడ్డి మైదానాలను ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి వరకు చెక్‌డ్యాంలు, సోలార్ బోర్లు, నీటి తొట్లను అమర్చారు. దీనివల్ల మూగజీవుల సంచారం మరింత పెరిగింది. అయితే అదే సమయంలో రైలు ప్రమాదాల ముప్పు కూడా ఎక్కువైంది. రైల్వే శాఖ ఏదైనా మార్గాన్ని యానిమల్ కారిడార్‌గా ప్రకటిస్తే.. ఆ మార్గంలో వన్యప్రాణులు రైల్వే ట్రాక్‌లోకి ప్రవేశించకుండా నిరోధించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటారు. ఇందులో భాగంగా.. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్ (కంచె) ఏర్పాటు చేస్తారు.

# చెన్నైలో ఐటి ఉద్యోగినిపై డెలివరి బాయ్ అత్యాచారయత్నం

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** తమిళనాడు రాజధాని చెన్నై నగరంలో ఐటి ఉద్యోగినిపై డెలివరి బాయ్ ఒకతను అత్యాచార యత్నం చేసిన ఘటన క లకలం రేపింది. శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక కుబేరన్ నగర్‌లో నివసించే ఉద్యోగిని కిరాణా వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డ ర్ పెట్టుకుంది. పావు గంట తరువాత ఆమె ఆర్డర్ చేసిన వస్తువులను తీసుకువచ్చిన డెలివరి బాయ్ తన సెల్‌ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోయిందని ఇంట్లో ప్రవేశిం చి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో డెలివరి బాయ్ పారిపోయాడు. అయితే స్థానికులు అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించ గా బాధితురాలు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. డెలివరి బాయ్ చెన్నై నగరానికి చెందిన గోపీనాథ్‌గా గుర్తించారు. అతను చెన్నై నగరంలో ప్రముఖ డెలి వరి సంస్థ జెప్టో సంస్థ ఉద్యోగిగా గుర్తించారు. దీనిపై మదిపక్కం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

# కల్వకుర్తి డీఎస్పీగా వెంకట్‌రెడ్డి, మీర్‌చౌక్ ఏసిపిగా భాస్కర్

**12 మంది డిఎస్పీల బదలీ, ఉత్తర్వులు జారీ చేసిన డిజిపి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 12 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ పోలీసు డైరక్టర్ జనరల్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ డీటీసీ డీఎస్పీగా ఉన్న అనుముల శ్రీనివాస్‌ను హైదరాబాద్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ-5గా అక్కడున్న సంపత్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పురుషోత్తం రెడ్డిని ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, సీఐడీకి బదిలీ చేసిన శ్రీనాథ్ రెడ్డిని డీఎస్పీ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నియమించారు. మెదక్ డీసీఆర్బీ డీఎస్పీ కొంతం చంద్రశేఖర్ రెడ్డిని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీగా అక్కడున్న కందుల సత్యనారాయణను డీజీపీ కార్యాలయానికి పంపించారు. సంగారెడ్డి డీసీఆర్బీ డీఎస్పీ రణ్వీర్ రెడ్డిని హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రామ్మోహన్ రెడ్డిని ఇంటెలిజెన్స్‌కు పంపించారు. ఇంటెలిజెన్స్‌లో ఉన్న భాస్కర్‌ను హైదరాబాద్ మీర్ చౌక్ ఏసీపీగా, అక్కడున్న వెంకటేశ్వర్ రావును డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. డీజీపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏసీపీగా ఉన్న సాయిరెడ్డి వెంకట్ రెడ్డిని నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి డీఎస్పీగా అక్కడున్న పల్లె వెంకటేశ్వర్లును డీజీపీ కార్యాలయానికి బదలీ చేశారు.

# మాగంటిని నేనే ఖతం చేశా

**'సంధ్య కన్వెన్షన్ శ్రీధర్ ఆడియో కలకలం!**

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపి



నాథ్‌ను తానే ఖతం చేసినట్లు ఆదివారం సంధ్యా కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఆడియో సంభాషణ లీక్ అవడంతో చర్చానీయాంశమైంది. గోపినాథ్‌ను పూజలు చేసి ఖతం చేశానని మరో వ్యక్తిని ఫోన్‌లో బెదరించి మాట్లడిన మాటలు వైరల్ అయ్యాయి. బ్లాక్ మ్యాజిక్ చేయించినట్లు సంభాషణలో ఉంది. ఇక నువ్వు ఎంత? నీ బతుకెంత? కిడ్నీలు ఫెయిలై చనిపోతావని సదరు వ్యక్తిని బెదరించిన కాల్ ఆడియో సంచనలంగా మారింది.

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌కు రెండు కళ్ల సిద్ధాంతం

**పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి పాటుపడుదాం**

**ఒక్కో నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటెగ్రేటెడ్ స్కూళ్లు**

**పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రభుత్వపాలన చేస్తున్నది టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్ పర్యటనలో భాగంగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం నిజామాబాద్ పర్యటనకు వెళ్ళి అక్కడ వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రజా ఆశీర్వాదంతో ఏడాదిన్నరలో కాంగ్రెస్ పాలన విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉచిత బస్సు ప్రయాణం నుంచి సన్న బియ్యం వరకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బిఆర్ఎస్ దశ దిశా లేకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి మిగిలింది అప్పుల భారం మాత్రమే అని ఆయన ఆవేదన చెందరారు. పదేళ్ల పాలనలో కేసిఆర్ ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజాపాలనలో 17 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నాం .. డబుల్ బెడ్ రూమ్ వాగ్దానం చేసిన కేసీఆర్ ఒక్క ఇల్లు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట డబుల్ బెడ్ రూమ్‌లు, స్థలం ఉన్నవారికి గృహనిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేస్తామని తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం అని అన్నారు. నాలుగైదు రోజులుగా రైతుబంధునగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు తర్వాత ప్రజాసేవే మా లక్ష్యం.. పార్టీలకు



అతీతంగా జిల్లా అభివృద్ధే ప్రధానంఅని ఆయన అన్నారు. నిజామాబాద్ పూర్వ వైభవానికి కృషి అవసరమని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు.

**కులాలు పక్కనబెట్టి బిసిలు ఐక్యం కావాలి : మహేష్‌కుమార్**

నిజామాబాద్ పద్మశాలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ మహోత్సవంలో ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ పాల్గొన్నారు. కులాభిమానం తప్పు కాదు కానీ కులపిచ్చి మాత్రం ఉండకూడదని మహేష్ ఉద్బోధించారు. కులాలు పక్కన పెట్టి బిసిలంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బిసిలు 56 శాతం ఉన్నారని కులసర్వేలో తేటతెల్లమైందని చెప్పారు. భారత్ జోడో యాత్రతో దేశ వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న రాహుల్ గాంధీ కులసర్వేకు శ్రీకారం చుట్టారని వివరించారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శాస్త్రీయంగా కులసర్వే నిర్వహించగలిగామని ఆయన చెప్పారు. కేంద్రం జనగణనలో కులసర్వే చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా మారిందని చెప్పారు. ఎవరి వాటా వారికే అనే రాహుల్ గాంధీ నినాదాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజాభీష్టానికి మద్దతుగా మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకుని యువత రాజకీయాల్లో ఎదగాలని కోరారు. అభివృద్ధి విషయంలో పార్టీలకతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# 14 కోట్ల మార్కును దాటిన బిజెపి ప్రాథమిక సభ్యుల సంఖ్య

**ఎక్స్ వేదికగా వెల్లడించిన జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్**

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. పార్టీ ప్రాథమిక సభ్యుల సంఖ్య 14 కోట్లు దాటినట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ప్రకటించారు. ఈ ఘనత సాధించడం వెనుక బూత్ స్థాయి కార్యకర్తల కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు. పార్టీ సభ్యత్వ నమోదుపై బిఎల్ సంతోష్ ఎక్స్ వేదికగా స్పందించారు. భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వం 14 కోట్ల మార్కును దాటిందని, ఇది గొప్ప విజయం అన్నారు. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త కృషి అమోఘం అన్నారు. తాము భారీ ప్రచార కార్యక్రమాలను నిలిపివేసినప్పటికీ, బూత్ స్థాయి కార్యకలాపాల ద్వారా 14 కోట్ల సభ్యత్వ మార్కును దాటగలిగామని అన్నారు. గత యేడాది అక్టోబర్ 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్టీ దేశవ్యాప్త సభ్యత్వ ప్రచారంలో తొలి క్రియాశీల సభ్యుడిగా చేరిన సంగతి తెలిసిందే. పార్టీ చేపట్టిన సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం-2024లో తదుపరి దశగా ప్రారంభమైంది. ఆ సమయంలో ప్రధాని మోడీ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎక్స్‌లో పంచుకుంటూ, బిజెపిలో తొలి యాక్టివ్ సభ్యుడిగా చేరడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. క్రియాశీల సభ్యుడు కావడానికి ఉండాల్సిన అర్హతలను కూడా ప్రధాని మోడీ వివరించారు. ఒక కార్యకర్త యాక్టివ్ సభ్యుడిగా అర్హత సాధించాలంటే ఒక బూత్ గానీ, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కనీసం 50 మంది కొత్త సభ్యులను నమోదు చేయించాలన్నారు. దీనివల్ల వారు మండల కమిటీ, పార్టీలో ఉన్నత స్థాయి పదవులకు పోటీ చేయడానికి అర్హులవుతారరు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించేందుకు ఈ కార్యకర్తలకు విస్తృత అవకాశాలు కల్పిస్తాం అని ప్రధాని తెలిపారు. జాతీయ సభ్యత్వ ప్రచారాన్ని తొలుత గత ఏడాది సెప్టెంబర్ 2న పార్టీ కేంద్ర కార్యాలయ విస్తరణ కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రారంభించారు. సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం-2024 పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 2024 అక్టోబర్ 15 నాటికి సభ్యుల సంఖ్య తొమ్మిది కోట్లు దాటింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే బిజెపి రెండు కోట్ల మంది సభ్యులను కలిగి ఉన్నట్లు ఆ పార్టీ పేర్కొంది. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదటి, రెండవ దశలు ముగియడంతో పార్టీ క్రియాశీల సభ్యత్వ సంఖ్యను మరింత పెంచే లక్ష్యంతో మూడవ దశ ప్రారంభమైంది.

**నేడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్‌దివస్ సందర్భంగా..**

# ప్రాథమిక సభ్యులతో సమావేశం, అమ్మ పేరుతో మొక్క కార్యక్రమం

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి**

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ సంస్థగత నిర్మాణం కోసం పార్టీ ప్రాథమిక సభ్యులతో సమావేశంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం చేపట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూన్ 23న జనసంఘ్ (పూర్వ బిజెపి) పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలి దాన్ దివస్ ప్రారంభమై సోమవారం నుంచి జూలై 6న డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించే కార్యక్రమం అన్ని ప్రాంతాలలో జరుగుతుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వెల్లడించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్, శాసనసభా పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ బిజెపి జిల్లా కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తారని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యులు డికె అరుణ షాద్‌నగర్ నియోజకవర్గం కమ్మదనం గ్రామంలో జరిగే మొక్కలు నాటి కార్యక్రమం, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తారని తెలిపారు. సోమవారం నుంచి జూలై 6వరకు జరిగే కార్యక్రమాలకు రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. గంగిడి మనోహర్ రెడ్డి అభియాన్ (కార్యక్రమం)కన్వీనర్‌గా వ్యవహరిస్తారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా మిల్లెట్ ఉద్యమి భారత్

**నేషనల్ ఛైర్మన్ శ్రీనివాస్**

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** దేశంలో చిరు ధాన్యాల సాగు, వినియోగానికి ప్రాధాన్యత కల్పించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మిల్లెట్ ఉద్యమి భారత్ పేరుతో హైదరాబాద్‌లో జాతీయ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ ద్వారా ఐదు రోజుల పాటు నిర్వహించబడుతున్న ఈ కార్యమ్రానికి దేశం నలుమూలల నుండి హాజరవుతున్నారు. 25 రాష్ట్రల నుండి మొత్తం 140 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీన్ని హైదరాబాద్‌లో ఆదివారం ప్రారంభించిన మిల్లెట్స్ నేషనల్ పోర్టల్ ఛైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం ద్వారా చిరు ధాన్యాల సాగును నేర్చుకునే రైతులు, ఉత్పత్తులను తయారు చేయాలనుకునే వ్యాపారులు, ఆరోగ్యానికి మిల్లెట్లు ఏవిధంగా ఉపయోగపడతాయనేది నేర్చుకునే వారందరికీ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు.

# ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై ప్రసంగించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'గవర్నింగ్ ఇన్నొవేషన్ ఏ తెలంగాణ కేస్ స్టడీ' అనే అంశంపై ప్రసంగించిన కేటీఆర్.. తెలంగాణలో గత దశాబ్దంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలు చేసిన వినూత్నమైన, ప్రేరణ




కలిగించే పాలన విధానాలను వివరించారు. ఈ ఫోరంలో మాట్లాడుతూ కేసీఆర్ ప్రబల నాయకత్వం, సమావేశాత్మక అభివృద్ధి, సాంకేతికతలో నాయకత్వం వంటి అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్రాన్ని ఒక అభివృద్ధి మోడల్‌గా ఎలా తీర్చిదిద్దారో వివరిస్తూ విద్యార్థులు, పరిశోధకులు, ఆలోచన నాయకులను ఆకట్టుకున్నారు. అంతేకాకుండా, తెలంగాణ పాలన, రాజకీయాలు, అభివృద్ధి మార్గాలపై ప్రఖ్యాత ప్రొఫెసర్ మాయా ట్యూడర్‌తో జరిగిన ఆసక్తికరమైన చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, మేధావులు, ఆలోచన నాయకులతో కేటీఆర్ సులువుగా మమేకమయ్యారు. ఇక వచ్చే వారం రోజుల పాటు కుటుంబంతో కలిసి కొంత సమయం గడిపేందుకు విరామం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. పాలకుడిగా శ్రమించిన తరువాత, వ్యక్తిగత జీవితానికి కాస్త విశ్రాంతి అవసరమని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రతి పేదోడికి ఇల్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**మూడున్నరేళ్లలో 20 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం**

**నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**నల్లగొండ ప్రతినిధి, ప్రభాతవార్త జూన్ 22:** పోరాడి సాధించుకున్న తెలంగాణాలో పేదవాడి స్వంత ఇంటి కలను బిఆర్ఎస్ ప్రభుత్వం కలగానే మిగిల్చిందని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిదిగా హాజరయి లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా ... ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ..ఇస్తున్నట్లే టివి లలో ,పేపర్లలో ప్రకటనలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపిం చారు. కానీ పదేళ్ల బిఆర్ఎస్ పాలంలో 93 వేల ఇల్లు మొదలుపెట్టి 66 వేల ఇండ్లు మాత్రమే నిర్మాణం పూర్తిచేసుందని చెప్పారు. మిగిలిన 30 వేలు ఇండ్లు మొండి గోడలతో ఉన్నాయని చెప్పారు. రానున్న మూడున్నర ఏళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. మొదటి విడత లో రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4 లక్షల ఇళ్ల కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందుకు 22500 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినట్లు ఆయన చెప్పారు. ఇంటి నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్దిదారుడికి రూ 5 లక్షలు 4 దఫాలుగా ఇంటి నిర్మాణ స్టేజిని బట్టి మధ్య దళార్లు లేకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో చేపట్టిన అసంపూర్తి ఇళ్లకు లబ్దిదారులను ఎంపిక చేసి ఆ వివరాలను ఆన్ లైన్ చేయాలని అన్నీ జిల్లాల కలెక్టర్ లకు సూచించారు. వివరాలు అందగానే బడ్జెట్ విడుదల చేసి ఆ ఇళ్లను కూడా పేదలకు అందించనున్నట్లు ప్రకటించారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో అక్రమార్కులతో కలిసి రాష్ట్రంలోని భూయజమాను లను ఇబ్బందులకు గురుచేశారని అక్రమ పాసు బుక్కులతో రైతుబంధు లబ్దిదారులుగా చెలామణి అయ్యారని అందుకే ధరణి రద్దు చేసి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

భూభారతి చట్టం భూములున్న ఆసాములకు చుట్టమయిందని ... ఇప్పటి వరకు 8 లక్షల 60 వేల ధరఖాస్తులు అందాయని ఆగస్టు 15 నాటికి భూభారతి లో నమోదైన న్యాయమైన దరఖాస్తులన్నింటిని పరిష్కరించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో త్రాగు , సాగు నీటి సమస్య పరిష్కారం కోసం అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టును పదేళ్ళ పాటు పట్టించుకోలేదని పాత ప్రాజెక్టులో కమీషన్ లు రావని ...కాళేశ్వరం ప్రాజెక్ట మొదలు పెట్టి లక్ష కోట్లుపైన దిగమింగారని మంత్రి ధ్వజమెత్తారు.

ఈ సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి ,చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య ,శంకర్ నాయక్ ,బత్తుల లక్ష్మా రెడ్డి , కుంభం అనిల్ కుమార్ , నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాటి , భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా ఆరు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు

**హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యం**

**నాచారంలోని ల్యాబ్‌పై తగ్గనున్న భారం**

**హైదరాబాద్,జూన్22,ప్రభాతవార్త:** ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో పేరున్న హోటల్స్, రెస్టారెంట్లలో తెలంగాణ ఆహార భద్రతా కమిషనర్ అధ్వర్యంలోని టాస్క్ ఫోర్స్ బృందాలు పలు హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల్లో ఎక్కువ వాటిల్లో అపరిశుభ్రమైన పరిస్థితులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కొన్నింటిని వెంటనే సీజ్ చేయగా.. మరికొన్నింటిలోని ఆహార నాణ్యతను పరిశీలించడానికి శాంపిల్స్‌ను సేకరించారు. అధికారులు తనిఖీలు నిర్వహించిన వెంటనే వారిపై కేసులు నమోదు చేయడానికి అవకాశం లేదు. అందుకు కారణం వారు సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షించి వాటి ఫలితాలు వచ్చిన తరువాత మాత్రమే వారిపై కేసులు నమోదు చేయడానికి అధికారులకు అవకాశం ఉంటుంది. అయితే అధికారులు తనిఖీలు చేసిన సమయంలో హోటల్స్, రెస్టారెంట్లలో పరిశుభ్రమైన పరిస్థితులు లేకపోవడంతో.. వంటకు ఉపయోగించే ఆహార పదార్థాలు తాజాగా ఉండకపోవడంతో ఈ రెండు అంశాలపై హోటల్, రెస్టారెంట్లకు వెంటనే నోటీసులను జారీ చేస్తున్నారు అధికారులు. అయితే వారు సేకరించిన శాంపిల్స్‌ను నాచారంలోని ప్రభుత్వ టెస్టింగ్ ల్యాబ్‌కి పరీక్షల నిమిత్తం పంపిస్తారు. సుమారు 15 రోజుల తరువాత గానీ వాటి ఫలితాలు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ నుంచి వస్తాయి. ఈ నేపథ్యంలో త్వరాగా ఫలితాలు వచ్చేలా చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 6 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ల్యాబ్‌కి సుమారు రూ. 15 కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించింది. కొత్త ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం మూలంగా నాచారంలోని ల్యాబ్‌ను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన శాంపిల్స్‌ను టెస్ట్ చేయడానికి ఉపయోగించేలా చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్ నగరం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నేపథ్యంలో విదేశాలకు చెందిన టూరిస్టులు, పలు అంతర్జాతీయ సంస్థలు ఉన్నందున హైదరాబాద్‌లోని ఆహార పదార్థాలు కూడా అదేస్థాయిలో నాణ్యతా, ప్రమాణాల్లో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ప్రజలతోపాటు ఇతర దేశాల నుంచి వచ్చే ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని హోటల్స్, రెస్టారెంట్లలో కల్తీ ఆహారం కాకుండా, నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చూడాలని భావిస్తోంది. వైద్య, ఆరోగ్య శాఖ హైదరాబాద్‌లో కొత్త ఆహార పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వాటిల్లో ఎల్‌బినగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికిందరాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో ఒక్కొక్కటి చొప్పున 6 కొత్త ఆహారపరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయా లని నిర్ణయించింది. ప్రతి ప్రయోగశాలలో కలుషితాలతోపాటు కల్తీ, ఆహార పరిశుభ్రతను గుర్తించడానికి ఆధునిక పరీక్షా పరికరాలు అమర్చబడతాయి. ప్రతి ప్రయోగశాలను ఏర్పాటుకు రూ.15 కోట్లు ఖర్చు చేయనుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. నేటి నుంచి మలివిడత విచారణ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి సోమవారం నుంచి మలిదఫా విచారణ మొదలుకాను ంది. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో జరగనున్న ఈ విచారణలో ఓవైపు ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుతో పా టు ఇతర నిందితులను సిట్ అధికారులు విచారించనున్నారు. ఇదే సమయంలో ఈ కేసులో బాధితులుగా వున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపిలు ఈట ల రాజేందర్, ధర్మపురి అర్వింద్ సహా పలువురు బిజెపి, కాంగ్రెస్ నేతలు తమ వాంగ్మూలం ఇవ్వనున్నారు. ఇందుకోసం పోలీసులు ఏర్పాట్లు చేబట్టారు. కాగా ఇదే కేసులో ఇప్పటికే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంఎల్ఎ గోనె ప్రకాష్ రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు తమ వాంగ్మూలం ఇవ్వడం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావడంతో పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. మలిదఫా విచారణలో బిజెపి ప్రముఖులు రానుండడంతో ఆ పార్టీ కార్యకర్తలు కూడా వచ్చే అవకాశం వుండడంతో ముందుగానే బందోబస్తు చేబట్టారు.

**మినహాయింపులను రద్దు చేయాలని సుప్రీం కోర్టును కోరనున్న పోలీసులు**

ఇదిలావుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు నుంచి అరెస్టుపై మినహాయింపు పొందిన ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు విచారణకు ఏ మాత్రం సహాకరించక పోవడంతో వీటిని రద్దు చేయించాలని సిట్

**ఓవైపు ప్రభాకర్‌రావుసహా ఇతర నిందితుల విచారణ**

**మరోవైపు ప్రజాప్రతినిధులు, బాధితుల వాంగ్మూలం**

అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సుప్రీం కోర్టుకు లేఖ రాయాలని వారు నిర్ణయంచారు. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే ముందు పోలీసులు తనను ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు చేయకుండా ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొం దడం తెలిసిందే. ఆగస్టు ఐదవ తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమల్లో వుంటాయి. అయితే పోలీసుల విచారణకు ప్రభాకర్ రావు సహకరించాలని సుప్రీం కోర్టు తన ఉత్తర్వులో పేర్కొన్నా ఆయన పెద్దగా సహకరించడం లేదని సిట్ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తేనే ఫోన్ ట్యాపింగ్‌లో కీలక విషయాలు వెలుగు చూస్తాయని, అవసరమైతే ఆయనను అరెస్టు చేసి, ఇతర నిందితుల తరహాలో జైలుకు పంపితే వాస్తవాలు బయటకు వ స్తాయని సిట్ అధికారులు భావిస్తున్నారు. సోమవారం నుంచి మొదలయ్యే మలిదఫా విచారణలో ప్రభాకర్ రావు సహాకరించకుంటే సిట్ అధికారులు సుప్రీం కో ర్టుకు లేఖ రాసే వీలుంది.

### క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఫైనల్స్‌కు అల్కరాజ్, లెహెకా



**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్-2025లో టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ దూసుకుపోతూ విజయపరంపర కొనసాగిస్తున్నాడు. టోర్నమెంట్ సెమీఫైనల్లో అల్కరాజ్ తోటి స్పానియార్డ్ రాబర్టో బటిస్టా అగుట్‌ను ఓడించాడు. ఇదే సమయంలో జిరి లెహెకా హోమ్ ఫేవరెట్ జాక్ డ్రేపర్‌ను ఓడించాడు. 2023లో ఇదే ఈవెంట్‌లో తన తొలి గ్రాస్‌కోర్ట్ టైటిల్‌ను గెలుచుకున్న ప్రపంచ నంబర్ 2 అల్కరాజ్, 37 ఏళ్ల బటిస్టా అగుట్‌ను 6-4, 6-4 తేడాతో ఓడించి తన కెరీర్‌లో 250వ విజయాన్ని నమోదు చేశాడు. 22 ఏళ్ల అల్కరాజ్ తన అజేయ పరంపరను 17 మ్యాచ్‌లకు విస్తరించాడు. అల్కరాజ్, హోమ్ ఫేవరెట్ జాక్ డ్రేపర్ మధ్య తుది పోరుపై బ్రిటిష్ అభిమానులు ఆశించారు, కానీ లెహెకా అతనితో తలపడి ఆ స్క్రిప్ట్‌ను 6-4, 4-6, 7-5 తేడాతో రెండవ సీడ్‌ను ఓడించి చెడగొట్టాడు. 23 ఏళ్ల లెహెకా, 15 సంవత్సరాల తర్వాత టాప్ లెవల్ గ్రాస్‌కోర్ట్ ఫైనల్‌కు చేరుకున్న తొలి చెక్ ఆటగాడు. ఇక ఎడమచేతి వాటం బౌలర్ డ్రేపర్ రెండవ సెట్ ప్రారంభంలోనే బ్రేక్ పాయింట్‌ను సేవ్ చేసి, 10వ గేమ్‌లో తన 23 ఏళ్ల లెహెక్కా సర్వీస్‌ను తొలిసారి బ్రేక్ చేసి మ్యాచ్‌ను సమం చేశాడు. లెహెకాకు 4-4తో బ్రేక్ వచ్చే మొదటి అవకాశం లభించడంతో, డిసైడర్‌లో ఇద్దరు ఆటగాళ్ల సర్వ్‌లో దృఢంగా ఉన్నారు, కానీ డ్రేపర్ తన ప్రత్యర్థిపై ఒత్తిడిని పెంచడానికి బతికిపోయాడు. అయితే, లెహెక్కా ఏమాత్రం వెనుకాడలేదు మరియు రెండు అద్భుతమైన పాసింగ్ షాట్‌లతో 55 వద్ద సర్వ్‌ను బ్రేక్ చేశాడు. దీనితో డ్రేపర్ కోర్టు వైపు ఎలక్ట్రానిక్ ప్రకటన బోర్డుపై కోపంతో తన రాకెట్‌ను ఢీకొట్టి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డాడు.

# కెనడా సూపర్ విక్టరీ

### వరల్డ్ కప్ రేసులో 13వ జట్టుగా నమోదు



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరగబోయే మెన్స్ టీ20 వరల్డ్ కప్ పోటీలకు మరో జట్టు అర్హత సాధించింది. ఇప్పటికే భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్ వరల్డ్ కప్ రేసులో నిలిచాయి. తాజాగా ఇప్పుడు సూపర్ విక్టరీతో కెనడా జట్టు వర్డ్ కప్ పోటీలకు తన బెర్త్ ను కన్ ఫర్మ్ చేసుకుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో చోటు దక్కించుకున్న 13వ జట్టుగా నిలిచింది. అమెరికాస్ రీజనల్ క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన కెనడా టి20 టోర్నమెంట్ లో స్థానం సంపాదించుకుంది. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో బహమాస్ పై కెనడా సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత బహమాస్‌ను 57 పరుగులకే పరిమితం చేసిన కెనడా, స్వల్ప లక్ష్యాన్ని 5.3 ఓవర్లలోనే ఛేజ్ చేసింది. ఈ లీగ్‌లో వరుసగా 5 విజయాలతో కెనడా దుమ్మురేపి పాయింట్స్ టేబుల్ లో అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. ఈ మెగా టోర్నీకి ఇప్పటికే 12 జట్లు అర్హత సాధించాయి. భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్.. వరల్డ్ కప్ రేసులో నిలిచాయి. మరోవైపు భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా ఉండటం వల్ల అవి కూడా అర్హత సాధించాయి. మరో 7 జట్లకు బెర్తులు ఖరారు కావాల్సి ఉంది. వీటిలో యూరోపియన్ క్వాలిఫయర్ ద్వారా 2, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో ఫైనల్ చేరిన రెండు జట్లతో పాటు ఆసియా ఈఏపీ క్వాలిఫయర్‌లోని టాప్3 జట్లు వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధిస్తాయి. 20 జట్లతో జరిగే మొట్టమొదటి గి20 ప్రపంచ కప్ ఇదే కానుంది.





# హాకీ టోర్నీలో భారత్ ఓటమి

### పురుషుల, మహిళల జట్లపై బెల్జియం డబుల్ విక్టరీ

**న్యూఢిల్లీ:** భారతనపురుషుల, మహిళల హాకీ జట్లు బెల్జియం చేతిలో ఓటమి పాలయ్యాయి. భారత్ పురుషుల జట్టుపై 3-6 తేడాతో వరుసగా 7వ మ్యాచ్‌లోనూ ఓటమిపాలయింది. అలాగే మహిళల విభాగంలో భారత్ జట్టుపై 1-5 తేడాతో బెల్జియం హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆంట్వెర్ప్‌లో జరిగిన పురుషుల మ్యాచ్‌లో భారత్ హాకీ జట్టు దారుణమైన ప్రదర్శనను కొనసాగించింది. ఆట మొదలైన 20 సెకన్లలోనే బెల్జియం రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకోవడంతో భారతదేశం మొదటి నిమిషంలోనే గోల్ చేసింది. దిల్‌ప్రీత్ సింగ్ (36వ నిముషం) మరియు మన్దీప్ సింగ్ (38వ నిముషం) గోల్స్ చేయడం ద్వారా భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. ఇదే సమయంలోఅమిత్ రోహిదాస్ (56వ నిముషం) చేసిన మూడవ గోల్ భారత్‌ను పోటీలో నిలిపింది. అయితే బెల్జియం వేగంగా ప్రారంభించడంతో భారత్ జట్టు వెనుకబడిపోయింది, భారత్ గోల్‌ను నిలుపుకోవడంలో ఇబ్బంది పడింది. ఆట గమనానికి వ్యతిరేకంగా, అలెగ్జాండర్ హెండ్రిక్స్ హాఫ్ టైమ్‌కు ముందు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో బెల్జియం తన ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. బెల్జియం ప్లేయర్లు ఆర్థర్ వాన్ డోరెన్ (1వ నిముషం, 54వ నిముషం) చేసిన రెండు గోల్స్ మరియు అలెగ్జాండర్ హెండ్రిక్స్ (28వ నిముషం), రోమన్ దువెకోట్ (49వ నిముషం), థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ (53వ నిముషం) మరియు టామ్ బూన్ (59వ నిముషం) చేసిన గోల్స్ బెల్జియం విజయాన్ని సాధించాయి. ఇక ఆంట్వెర్ప్‌లోని స్పోర్ట్‌సెంట్రమ్ విల్రిజ్సే ప్లీన్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 1-5 తేడాతో ఆతిథ్య బెల్జియం చేతిలో ఓడిపోయింది. సలీమా టెటె అమ్మాయిలు మంచి ఆరంభంతో ఆరంభించారు కానీ ఆటుపోట్లను తమకు అనుకూలంగా మార్చుకోవడంలో విఫలమయ్యారు. భారతదేశం తరపున దీపిక (6వ నిముషం) ఏకైక గోల్‌గా నిలిచింది, హెలెన్ బ్రాస్సియర్ (37వ నిముషం, 55వ నిముషం), లూసీ బ్రెయిన్ (41వ నిముషం), అంబ్రే బాలెంఘియన్ (54వ నిముషం), షార్లెట్ ఎంగిల్‌బర్ట్ (58వ నిముషం) బెల్జియం తరపున గోల్స్ చేశారు. ఆతిథ్య జట్టు మరింత బలంగా పుంజుకుంది, 17 పెనాల్టీ కార్నర్లు మరియు ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను సాధించింది. ఈ ఓటమితో, రాబోయే మ్యాచ్‌లలో పరిస్థితులు అనుకూలించకపోతే భారతదేశం నిష్క్రమణకు గురయ్యే అవకాశం ఉంది.

# మనీషాకు తొలి ఆసియా టైటిల్

### నితీష్‌కు డబుల్ టైటిల్స్

**న్యూఢిల్లీ:** భారత్ యువ పారా షట్లర్లు మనీషా రామదాస్ తొలి ఆసియా టైటిల్‌ను, పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ నితేష్ కుమార్ రెండు టైటిళ్లను కైవసం చేసుకున్నారు. రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్‌గా నిలిచిన చైనాకు చెందిన యాంగ్ క్వియుక్సియాను ఫైనల్లో మనీషా ఓడించి సంచలన విజయం సంపాదించింది. థాయ్‌లాండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌లో మనీషా యాంగ్ క్వియాక్సియాను ఓడించి బంగారు పతకంతో పాటు, తన తొలి ఆసియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకుంది. 57 నిమిషాల పాటు జరిగిన మూడు గేమ్‌ల (21-18, 17-21, 21-15) హోరాహోరీ పోరులో యాంగ్‌తో జరిగిన ఏడవ మ్యాచ్‌లో మనీషా తొలిసారి విజయం సాధించింది. మహిళల సింగిల్స్ ఎస్‌యు5 విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. మనీషాకు తొలి ఆసియా టైటిల్ కోసం సానుకూలంగా ఆట ప్రారంభించింది. ప్రారంభ గేమ్‌లో తన మంచి ఆధిక్యాన్ని కొనసాగించడానికి వ్యూయాత్మకంగా వ్యవహరించింది. అద్భుతమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్ షాట్‌లను ప్రదర్శించి మ్యాచ్‌లో మొదటి ఆధిక్యాన్ని 21-18తో సాధించింది. అయితే, యాంగ్ తన ప్రశాంతతను ప్రదర్శించి, రెండవ గేమ్‌లో తిరిగి పుంజుకుని టైబ్రేకర్‌ను వత్తిడి తెచ్చింది. ఇక్కడ కూడా 20 ఏళ్ల భారత క్రీడాకారిణి టైబ్రేక్‌లో 13-2 ఆధిక్యాన్ని సాధించింది. అయితే ఆమె చాలా అనవసర తప్పిదాలు చేసింది. మరియు అకస్మాత్తుగా ఆమె ఆధిక్యం కేవలం 1 పాయింట్‌కు, 15-14కి పడిపోయింది. ఈ ఆకస్మిక మార్పుతో ఒత్తిడికి గురైనాకానీ ఆమె తన ఆశను కోల్పోకుండా పట్టుదలతో కొనసాగించింది. దీంతో తిరిగి పోరాడి ఏడు ఫైనల్ పాయింట్లలో ఆరు గెలుచుకుని మ్యాచ్




మరియు ఆసియా టైటిల్‌ను కైవసం చేసుకుంది. కాగా పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ నితేష్ కుమార్, థాయిలాండ్‌లో రెండు ఆసియా టైటిళ్లను గెలుచుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్, తులసిమతి మురుగేషన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యు5 విభాగాల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో నితేష్ ఇండోనేషియాకు చెందిన యువ ఆటగాడు ముహ్ ఇమ్రాన్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. అదే సమయంలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో, నితేష్ తులసిమతి ఫైనల్‌లో రుథిక్‌మానసిపై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్ఎల్4 ఫైనల్‌లో సుకాంత్ కదమ్‌తో కలిసి నవీన్-జగదీష్‌తో తలపడనున్నందున నితేష్ ఇంకా క్లీన్ స్వీప్ పూర్తి చేసే అవకాశం ఉంది.



# ఛాంపియన్‌గా భారత్

### ఆసియా రెజ్లింగ్‌లో 6 బంగారు, 1 రజతంతో ట్రోఫీ కైవసం

**న్యూఢిల్లీ:** అండర్23 ఆసియా రెజ్లింగ్ పోటీల్లో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. రెజ్లింగ్ ట్రోఫీని దక్కించుకుని చరిత్ర సృష్టించింది. భారత ఫ్రీస్టైల్ జట్టు మ్యాట్‌పై ఆధిపత్యం చెలాయించడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. వుంగ్ టౌ (వియత్నాం)లో ఆదివారం జరిగిన అండర్23 సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశం తన ఫ్రీస్టైల్ జట్టు ఆరు బంగారు పతకాలు మరియు 1 రజతాన్ని గెలుచుకుని మొత్తం ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అద్భుతమైన ప్రదర్శనతో ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న భారత మహిళల రెజ్లింగ్ జట్టు ప్రారంభం నుండి ఆధిక్యానిన కొనసాగిస్తూ వచ్చింది. ఇక భారత పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ జట్టు ఇప్పుడు స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్, ఫ్రీస్టైల్ విభాగంలో భారత్ యొక్క అత్యుత్తమ ప్రదర్శన ఇది. 61 కిలోల విభాగంలో నిఖిల్, 65 కిలోల విభాగంలో సుజీత్, 74 కిలోల విభాగంలో జైదీప్, 97 కిలోల విభాగంలో చందర్ మోహన్ (79 కిలోలు), సచిన్ (92 కిలోలు) మరియు విక్కీ బంగారు పతకాలు గెలుచుకున్నారు. అలాగే 125 కిలోల విభాగంలో జస్పూర్ సింగ్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. మొత్తంగా భారత్ అండర్23 మహిళా రెజ్లర్లు తమ అత్యుత్తమ ప్రదర్శనతో దేశాన్ని గర్వపడేలా చేశారు, అంకు ముందు 10 వెయిట్ కేటగిరీలలో 4స్వర్ణాలు, ఐదు రజతాలు మరియు ఒక కాంస్య పతకాలను సాధించింది. 50 కిలోల విభాగంలో ప్రియాంషి ప్రజాపత్, 55 కిలోల విభాగంలో రీనా, 68 కిలోల విభాగంలో శ్రుష్టి మరియు 76 కిలోల బరువు విభాగంలో ప్రియా భారతదేశం తరపున బంగారు పతకాలను గెలుచుకున్నారు. 57 కిలోల విభాగంలో నేహా శర్మ, 62 కిలోల విభాగంలో ప్రగతి, 65 కిలోల విభాగంలో శిక్ష, 59 కిలోల విభాగంలో తన్వి, 72 కిలోల విభాగంలో జ్యోతి బెర్వాల్ రజత పతకాలు గెలుచుకున్నారు.

# ఎన్ఆర్ఐ పెట్టుబడులకు 'ఫండ్స్' బెస్ట్

**ముంబై, జూన్ 22:** ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) భారతదేశంలో మ్యూచువల్ ఫండ్లలో డబ్బును పెట్టుబడి పెట్టవచ్చా అనే అనుమానం చాలా మందికి ఉంటుంది. అయితే దేశంలోని మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి ఎన్ఆర్ఐలకు అనుమతి ఉందని నిపుణులు చెబుతున్నారు. కానీ వారు విదేశీ మారక నిర్వహణ చట్టం కింద నిర్దేశించిన నియమాలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఈ నియమాలు అన్ని విదేశీ పెట్టుబడులు సురక్షితంగా, చట్టబద్ధంగా ఉండేలా చూసుకోవడానికి సహాయపడతాయి. భారత దేశంలో డబ్బును పెట్టుబడి పెట్టడం ద్వారా ఎన్ఆర్ఐలు తమ వ్యక్తిగత పొదుపులను పెంచుకోవడమే కాకుండా దేశ ఆర్థిక పురోగతికి కూడా మద్దతు ఇస్తారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించడానికి ఎన్ఆర్ఐలకు అనేక మార్గాలు ఉన్నాయి. ఒక సాధారణ పద్ధతి నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ ఖాతా ద్వారా ఇది ఎన్ఆర్ఐలు తమ విదేశీ ఆదాయాన్ని భారతదేశంలో డిపాజిట్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ ఖాతాపై వచ్చే వడ్డీ పన్ను రహితం. మరొక ఎంపిక




నాన్‌రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్ఓ) ఖాతా, ఇది అద్దె, డివిడెండ్‌లు లేదా ఆస్తి అమ్మకపు ఆదాయం వంటి భారతదేశంలో సంపాదించే ఆదాయాన్ని నిర్వహించడంలో సహాయపడుతుంది. వారు తమ ఎన్ఆర్ఈ లేదా ఎన్ఆర్ఓ ఖాతాలను సాధారణ బ్యాంకింగ్ మార్గాల ద్వారా ఉపయోగించి నేరుగా పెట్టుబడి పెట్టడానికి కూడా ఎంచుకోవచ్చు. ఈ పద్ధతి పెట్టుబడి నిర్ణయాలపై పూర్తి నియంత్రణను ఇస్తుంది. ముఖ్యంగా తమ లక్ష్యాలకు సరిపోయే నిధులను ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంది. తమ పెట్టుబడులను వ్యక్తిగతంగా నిర్వహించలేని వారికి, పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ)ని నియమించడం సహాయకరంగా ఉంటుంది. అప్పుడు విశ్వసనీయ వ్యక్తి అన్ని పెట్టుబడి నిర్ణయాలను నిర్వహించ గలడు.

# టర్మ్ ఇన్సూరెన్స్‌కే మహిళల ప్రాధాన్యం..సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 22:** మహిళల ఆర్థిక ప్రాధాన్యతలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నట్లు సర్వే స్పష్టం చేసింది. పిల్లల భవిష్యత్తు, వారి విద్యా వ్యయాలు, ఆరోగ్యం ముఖ్యమైన అంశాలుగా మారాయి. పిల్లల భవిష్యత్తు రక్షణకు ఆర్థిక సాధనాలలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు మహిళలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరోగ్య సంబంధిత రిస్కులపై వారిలో అవగాహన పెరిగినట్లు ఇది సూచిస్తుంది. వైద్యపరమైన అనూహ్య ఖర్చుల వల్ల తమ కుటుంబ పొదుపు తీవ్రంగా దెబ్బతింటుందని 53 శాతం మంది మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని 87శాతం మంది పేర్కొన్నారు. తమ టర్మ్ ప్లాన్‌లో అంతర్గతంగా హెల్త్ మేనేజ్‌మెంట్ సేవలు తప్పనిసరిగా ఉండాలని 50 శాతం మంది తెలిపారు. పిల్లల చదువు ప్రయోజనాలు టర్మ్ ప్లాన్‌లో భాగంగా ఉండాలని మహిళలు ఆకాంక్షిస్తున్నారు. ఆర్థికంగా స్వతంత్రంగాఉన్న మహిళలు, బీమాను కేవలం జీవిత రక్షణకు మాత్రమే పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక



ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి ఉపయోగపడే సాధనంగా పరిగణిస్తున్న విషయాన్ని ఈ సర్వే ధృవీకరిస్తుంది. ఏదైనా అనుకోనిది జరిగితే పిల్లలకు ఆర్థిక స్థిరత్వం ఎలా కల్పించాలనేది 61 శాతం మంది మహిళల ప్రాథమిక ఆందోళన. ఆదాయ స్థిర త్వం (61), ఆరోగ్య వ్యయాలు (53), రిటైర్మెంట్ ప్లానింగ్ (54), పిల్లల చదువు (57) ప్రధాన ఆర్థిక ప్రాధాన్యతలుగా ఉన్నాయి. తమ పిల్లల ఆర్థిక భవిష్యత్తును కాపాడటానికి 46శాతం మంది మహిళలు టర్మ్ ఇన్సూరెన్స్‌లో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ లక్ష్యసాధనకు ఇది ఆర్థికంగా అత్యంత ముఖ్యమైన ఎంపికగా నిలుస్తుంది. టర్మ్ ప్లాన్‌లో అంతర్గతంగా హెచ్ఎంఎస్, హెల్త్/సీఐ కవర్ తప్పనిసరిగా ఉండాలని 57 శాతం మంది మహిళలు కోరుకుంటున్నారు. టర్మ్ ప్లాన్‌లో చైల్డ్ ఇన్‌కం సెక్యూరిటీ ఫీచర్ అత్యంత ఆకర్షణీయమై నదిగా 93శాతం మంది మహిళలు భావిస్తున్నారు. జీవితంలో ముందుకెళ్లే కొద్దీ పరిస్థితులకు అనుగుణంగా కవరేజీ పెంచుకునే వెసులుబాటు, మెచ్యూ రిటీ బెనిఫిట్స్ కావాలని 51శాతం మంది ఆశిస్తు న్నారు. టర్మ్ ప్లాన్లలో పిల్లల చదువుపరంగా ఆర్థిక ప్రయోజనాలు తప్పనిసరిగా ఉండాలని 33 శాతం మంది, అత్యధిక లైఫ్ కవరేజీ ఉన్న టర్మ్ ప్లాన్‌లు కావాలని 28 శాతం మంది మహిళలు ఆకాంక్షిస్తున్నారు.

# రోజుకు 10 గంటల వర్క్ రూల్..జెన్‌ప్యాక్ట్ కొత్త పాలసీ

**ముంబై, జూన్ 22:** ప్రముఖ టెక్ మరియు సర్వీసెస్ సంస్థ జెన్‌ప్యాక్ట్ తీసుకున్న ఓ నూతన నిర్ణయం ఉద్యోగుల్లో, ముఖ్యంగా హైదరాబాద్ కార్యాలయంలో తీవ్ర ఆందోళన రేపుతోంది. సంస్థ తమ ఉద్యోగులకు రోజుకు 10 గంటల పని విధానాన్ని తప్పనిసరి చేస్తూ కొత్త పాలసీని ప్రవేశపెట్టిందని, ఇది జూన్ మధ్య నుంచి అమల్లోకి రానున్నట్లు సమాచారం. ఈ కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు రోజుకు తప్పనిసరిగా 10 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పెరిగిన పనిగంటలకు అనుగుణంగా మూల వేతనంలో (బేస్ శాలరీ) ఎటువంటి పెంపుదల లేకపోవడం గమనార్హం. నిర్దేశించిన 10 గంటల పనిని పూర్తిచేసిన వారికి నెలకు 500 పాయింట్ల వరకు ప్రోత్సాహకాలు అందుతాయని, వీటివిలువ సుమారు రూ.3,000 ఉంటుందని తెలుస్తోంది. అంతేకాకుండా, 10గంటలు దాటి అదనంగా పనిచేసిన సమయానికిదాదాపు రూ.150కి సమానమైన 5బోనస్ చెల్లిస్తారని సమాచారం. ఉద్యోగుల ఉత్పాదకతను, వారు చురుకుగా పనిచేసిన గంటలను (యాక్టివ్ అవర్స్) పర్యవేక్షించేందుకు ఓ అంతర్గత సాధనాన్ని (ఇంటర్నల్ టూల్) ఉపయోగించనున్నట్లు కూడా ఆ కథనం పేర్కొంది. ఈ నిబంధనలను పాటించని ఉద్యోగులు పనితీరు సమీక్షలను (పెర్ఫార్మెన్స్ రివ్యూ) ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా చెబుతున్నారు. జెన్‌ప్యాక్ట్ తీసుకున్న ఈ నిర్ణయం, ముఖ్యంగా హైదరాబాద్ కార్యాలయంలోని ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. కార్యాలయంలో వాతావరణం ఉద్రిక్తంగా మారిందని, ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బతిన్నదని తెలుస్తోంది. ఈ నూతన విధానాన్ని అధికారిక హెచ్ఆర్ విభాగం ద్వారా కాకుండా, మేనేజర్లు మరియు టీమ్ లీడర్‌ల ద్వారా అనధికారికంగా తెలియజేయడం కూడా ఉద్యోగుల ఆందోళనలను మరింత పెంచింది. ఈ విధానంపై స్పష్టత కొరవడిందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. అంతా మౌఖికంగానే చెబుతున్నారు. ఎవరైనా దీన్ని ప్రశ్నిస్తే, వారిని ఇబ్బంది పెట్టేవారిగా ముద్రవేసి, ఉద్యోగం నుంచి తొలగించేప్రమాదం ఉంది అని ఓ సీనియర్ రిక్రూట్‌మెంట్ స్టాఫ్ సభ్యుడు అన్నట్లు సమాచారం. జెన్‌ప్యాక్ట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గాపనిచేస్తున్న అభిషేక్ శర్మ అనే ఉద్యోగితన ఆందోళనను లింక్డ్‌ఇన్ ద్వారా పంచుకున్నారు.




# యూరప్ మార్కెట్లోకి భారతీయ 'ఇ' బైక్‌లు

**ముంబై, జూన్ 22:** భారతీయ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ అల్ట్రావైలెట్, పారిస్‌లోని ఐఫిల్ టవర్ వద్ద తన యూరోపియన్ విడుదలతో సంచలనం సృష్టించింది. జర్మనీలో విజయవంతంగా అడుగుపెట్టిన తర్వాత, కంపెనీ తమ అత్యాధునిక మోటార్‌సైకిళ్లు – ఎఫ్77 ఎంఎసిహెచ్ 2 ఎఫ్77 సూపర్ స్ట్రీట్లను ఫ్రాన్స్ రాజధానిలో విడుదల చేసింది. ఈ ప్రయోగం ఎలక్ట్రిక్ వాహన (ఇవి) విభాగంలో ప్రపంచ స్థాయి శక్తిగా తమను తాము నిలబెట్టుకోవాలనే అల్ట్రావైలెట్ ఆశయాన్ని బలోపేతం చేస్తుంది. దీనికి బలమైన పెట్టుబడిదారుల మద్దతు, భారతదేశంలో లోతైన పరిశోధన, అభివృద్ధి నైపుణ్యం తోడయ్యాయి. అల్ట్రావైలెట్ సిఇఓ నారాయణ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, ఇతర యూరోపియన్ దేశాలలో ఎఫ్77 విడుదల అల్ట్రావైలెట్‌కు ఒక కీలక మలుపు. ఇది భారతదేశ ఆటోమొబైల్ రంగానికి కూడా ఒక మైలురాయి. ఈ ప్రవేశం ద్వారా యూరప్‌లోని అత్యంత ప్రభావవంతమైన టూవీలర్ మార్కెట్‌లలోకి అడుగుపెట్టాం. ఎలక్ట్రిక్ మొబిలిటీ విప్లవంలో ప్రపంచ శక్తిగా ఉండాలనే మా ఉద్దేశాన్ని ఇది నొక్కి చెబుతుంది" అని వివరించారు. ఒక భారతీయ కంపెనీగా, భవిష్యత్ డిజైన్, అత్యాధునిక సాంకేతికతను ప్రపంచానికి అందించటం గర్వకారణమని ఆయన అన్నారు. ఇది భారతదేశ ఇంజినీరింగ్, తయారీ సామర్థ్యాలకు ప్రపంచ గుర్తింపు లభించిన సందర్భమని సుబ్రమణ్యం చెప్పారు. ఎఫ్77 మోటార్‌సైకిళ్లు ఎలక్ట్రిక్ పనితీరును కొత్తగా నిర్వచిస్తాయి. కేవలం 2.8 సెకన్లలో 0 నుంచి 60 కెపిహెచ్ వేగాన్ని అందుకుంటాయి. ఇందులో 10.3 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉంది. 30 కెడబ్ల్యూ గరిష్ట పవర్ అవుట్‌పుట్ అందిస్తుంది. 100 ఎన్ఎం టార్క్ను ఉత్పత్తి చేస్తుంది. ఇది వేగవంతమైన త్వరణం, చురుకైన హ్యాండ్లింగ్, 155 కెం/హెచ్ గరిష్ట వేగంను అందిస్తుంది. అత్యాధునిక సాంకేతిక భద్రతతో అల్ట్రావైలెట్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్లు అత్యాధునిక సాంకేతికతతో రూపొందాయి. కంపెనీ యాజమాన్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ వయోలెట్ ఏఐ ఇందులో ఉంది. బోష్ అభివృద్ధి చేసిన పరిశ్రమప్రముఖ స్విచబుల్ డ్యూయల్‌ఛానల్ ఎబిఎస్ (యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్) వంటి ఫీచర్లు ఉన్నాయి. 10 స్థాయిల రీజెనరేటివ్ బ్రేకింగ్, 4 స్థాయిల ట్రాక్షన్ కంట్రోల్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి అధునాతన లక్షణాలు భద్రత, పనితీరును మెరుగుపరుస్తాయి. తెలివైన, సురక్షితమైన ఉత్సాహభరితమైన రైడింగ్ అనుభవాన్ని అందిస్తాయి. అల్ట్రావైలెట్ సిటిఓ సహవ్యవస్థాపకుడు నీరజ్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ, ఇది కొత్త మార్కెట్‌లలో మోటార్ సైకిళ్లను ప్రవేశపెట్టడం మాత్రమే కాదు, భారతదేశంలో పుట్టిన సంవత్సరాల నిరంతర పరిశోధన, ఇంజినీరింగ్, ఆవిష్కరణల ప్రపంచ ఆవిష్కరణ. ప్రపంచంలో అత్యంత అధునాతన ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను నిర్మించాలనే ఆశయంతో బయలుదేరాం. ఈ రోజు, ఆ విజన్‌ను అంతర్జాతీయ కస్టమర్‌లకు అందిస్తున్నాం అని చెప్పారు. ఈ మైలురాయి ప్రపంచ 'ఇవి' మార్పులో మన సామర్థ్యాన్ని, అత్యున్నత స్థాయిలో పోటీపడే సాంకేతికతతో దీనికి నాయకత్వం వహించే మన సామర్థ్యాన్ని సూచిస్తుంది అని ఆయన అన్నారు.




# వాణిజ్యం

## క్రెడిట్ స్కోర్ పెంచుకోవడం చాలా ఈజీ!

**ముంబై, జూన్ 22:** ఒక వ్యక్తి డబ్బు నిర్వహణ, క్రెడిట్ నిర్వహణ, ఖర్చు తనిఖీ వంటి అంశాలపై ఆధారపడి క్రెడిట్ స్కోర్ ఉంటుంది. అయితే క్రెడిట్ స్కోర్‌పై ప్రజలకు అవగాహన పెరుగుతున్నా కొన్ని తప్పుల వల్ల స్కోర్ గణనీయంగా పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్‌స్కోరు అనేది కేవలం ఒక సంఖ్య కాదని, రుణగ్రహీత క్రెడిట్ ప్రవర్తన, తిరిగి చెల్లించే అలవాట్లతో పాటు మొత్తం ఆర్థిక విశ్వసనీయతను సూచిస్తుంది. క్రెడిట్ స్కోర్‌లు ఆర్థిక విశ్వసనీయతకు ఒక స్నాప్‌షాట్‌ను అందిస్తున్నప్పటికీ అవి మీరు ఆర్థికంగా అప్రమత్తంగా ఉండటానికి, మీ స్టేటస్ గురించి తెలుసుకోవడంలో సహాయపడే సాధనంగా కూడా పనిచేస్తాయి.క్రెడిట్ విలువను ప్రభావితం చేసే అంశాలను అర్థం చేసుకోవడం ప్రారంభం మాత్రమే, ఆ జ్ఞానం రోజువారీ ఆర్థిక నిర్ణయాలలో ఎలా వర్తింపజేయాలనే విషయం చాలామందికి తెలియదు.




కొత్త క్రెడిట్ కార్డ్ ఆఫర్‌ను అంచనా వేయడం, రుణం కోసం ప్రణాళిక వేయడం లేదా నెలవారీ ఖర్చులను నిర్వహించడం వంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. బలమైన క్రెడిట్ ప్రొఫైల్, ఆరోగ్యకరమైన క్రెడిట్ స్కోర్ స్థిరమైన క్రెడిట్ క్రమశిక్షణ ద్వారా నిర్మితమవుతాయి. సకాలంలో, పూర్తిగా బకాయిలను చెల్లించడం అనేది ఆరోగ్యకరమైన క్రెడిట్ స్కోర్‌ను నిర్మించాలని సూచిస్తున్నారు. అలాగే సకాలంలో చెల్లింపులు రుణదాతలకు విశ్వసనీయతను సూచిస్తాయి. భవిష్యత్తులో మెరుగైన క్రెడిట్ సౌకర్యాలకు మార్గం సుగమం చేస్తాయి. క్రెడిట్‌స్కోర్ ఎడ్యుకేషన్ కూడా చురుకైన క్రెడిట్ నిర్వహణనుప్రోత్సహిస్తుంది. క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా వ్యత్యాసాలను గుర్తించవచ్చు. అలాగే వారి పురోగతిని ట్రాక్ చేయవచ్చు. దేశవ్యాప్తంగా క్రెడిట్ యాక్సెస్ విస్తరిస్తున్నందున ఆర్థిక అవగాహనను బలోపేతంచేయడానికి సంబంధించిన ప్రాముఖ్యత కూడా పెరుగుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14